

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 10-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 155 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.12:10 తదుపరి విదియ, నక్షత్రం: ధనిష్ఠ మ.1:53 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.8:49-10:21, దుర్ముహూర్తం: సా.4:59-5:49, అమృతఘడియలు: ఉ.6:03-7:36, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:00, సూర్యాస్తమయం: 6:40 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పీ-4 పిచ్చిలో సీబీఎన్!



ఆచరణ సాధ్యం కాని ఇలాంటి ఆలోచనలంటే చంద్రబాబుకు మా చెడ్డ ఇష్టం. ఈ బలహీనతను గుర్తించిన కొందరు ప్రతి టర్మ్‌లో పక్కన చేరి దిక్కుమాలిన ప్రణాళికలు రూపొందించి ఆయనను అందులోకి లాగుతారు. దీంతో పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు ఆయనకు రాజకీయంగా నష్టం జరుగుతుంది.

దిక్కుమాలిన సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు గానీ 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా పీ-4 విధానాన్ని అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్నారు. ఈ లక్ష్యం ఆచరణ సాధ్యమా? అని కనీస ఆలోచన చేయకుండా మార్గదర్శులకు బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు.

ఏదైనా ఒక పథకానికి రూపకల్పన చేసే ముందు అది ఎంతవరకు ఆచరణ సాధ్యం? సదరు పథకం వల్ల ప్రజలకు జరిగే మేలెంత? ప్రభుత్వానికి రాజకీయంగా కలిగే ప్రయోజనం ఎంత? అని బేరీజు వేసుకోవాలి కదా! ప్రజలతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియనివారు ఇచ్చే సలహాలను గుడ్డిగా ఆచరించి అమలు చేస్తే నష్టం తప్పదు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు పీ-4ను పట్టుకొని వేలాడుతున్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులను పిలిపించుకొని గంటలకొద్దీ చర్చలు జరుపుతున్నారు. సదరు సమావేశాలలో ఒకరిద్దరు పారిశ్రామికవేత్తల గొప్పదనాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావిస్తుండటంతో మిగతావారు చిన్నబుచ్చుకుంటున్నారు.

పీ4 పథకం అమలు పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన సంస్థకు వైస్ చైర్మన్‌గా సి.కుటుంబరావు అనే ఆయనను నియమించారు. ఆయన ముఖ్యమంత్రి మెప్పు పొందడం కోసం జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు ఫోన్లు చేసి టార్గెట్లు విధిస్తున్నారని చెబుతున్నారు.

ఉపాధి కల్పించండి అని వ్యాపార, పారిశ్రామికవేత్తలను కోరడం వేరు. దత్తత తీసుకొని వారి ఆలనా పాలనా మొత్తం చూడాలని కోరడం ఏమిటి? ప్రజలను పని సంస్కృతికి దూరం చేయడం వల్ల జరుగుతున్న అనర్థాలను తెలుగు రాష్ట్రాలు అనుభవిస్తున్నాయి.

చంద్రబాబుతో వచ్చిన తంటా ఏమిటంటే, ఆయన ఏది పట్టుకుంటే దాని వెనకాలే పరిగెడతారు. 1999-2004 మధ్య ప్రజలను సమాయత్తం చేయకుండా సంస్కరణలను అమలుచేసి దెబ్బతిన్నారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి పేదరికమే ఉండకూడదన్న పాట పాడుతున్నారు.

గ్రామ స్థాయిలో కూడా మార్గదర్శులను ఎంపిక చేయమంటున్నారట! ఇందుకోసం రెవెన్యూ అధికారులను ప్రయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులపై కూడా వ్యతిరేకత ఏర్పడుతోంది.

ఈ నెల 19న ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈలోపు చంద్రబాబు మేల్కొని పీ-4 అమలు వల్ల తనకు లాభమా? నష్టమా? అన్నది సమీక్షించుకోవడం మంచిది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

అటెన్షన్: చంద్రబాబు!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి.. ముఖ్య గమనిక!

అధికారం మారినా... అమరావతి మళ్లీ పట్టాలపైకి ఎక్కినా రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఎందుకు ఊపందుకోవడంలేదో గమనించండి! అభివృద్ధికి ఆటంకంగా మారిన 'నిబంధనల చట్రాన్ని' సడలించండి! 'సింగపూర్' మాస్టర్ ప్లాన్‌ను స్థానిక అవసరాలకు అనుగుణంగా సవరించండి! అధికారులు ఆంక్షల కొరడాను పక్కనపెట్టి... మనసుపెట్టి ఆలోచించాలని ఆదేశించండి. ఇంతటి ఆందోళనకు కారణమవుతున్న ఆ సమస్య ఇదే!

నిబంధనల చట్రంలో 'రాజధాని ప్లాట్లు'

- విభజించుకోలేక, విక్రయించలేక రైతుల పాట్లు
- వెయ్యి, రెండు వేల గజాల ప్లాట్లను కొనేవారెవరు?
- నాడు అవగాహన లేక పెద్ద ప్లాట్లు ఎంచుకున్న రైతులు
- నేడు విభజనకు నిబంధనలు ఒప్పుకోవంటున్న అధికారులు
- 'నగరం అందం' పేరుతో అర్థంలేని ఆంక్షలు
- సంక్లిష్టంగా మారిన 'సింగపూర్ మాస్టర్ ప్లాన్'
- సీఎం జోక్యం చేసుకోవాలని రైతుల విన్నపం





(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మీ ఊళ్లో మీకు 500 గజాల స్థలం ఉంది! అత్యవసరంగా డబ్బు అవసరమొచ్చింది! ఉన్న స్థలంలో సగం విక్రయించగా వచ్చిన సొమ్ముతో కష్టం తీరింది! మరో 250 గజాల స్థలం మిగిలే ఉంది! ఇక సమస్యేమీ లేదు! ఇది... ఎక్కడైనా, జరిగేదే! ఎవరైనా అనుసరించే అత్యవసర ప్రణాళికే! కానీ... అమరావతిలో ఇది కుదరదు! రాజధానికోసం భూములిచ్చిన రైతులకు ఇలాంటి అవకాశమే లేదు! ఇచ్చిన భూమికి బదులుగా ప్రభుత్వం నుంచి తీసుకున్న రిటర్నబుల్ ప్లాటును ముక్కలుగా విడదీసేందుకు వీల్లేకుండా నిబంధనల చట్రంలో బంధించారు. అమ్మితే... మొత్తం ప్లాటు విక్రయించాలి. లేదంటే... లేదు. చివరికి... వారసులకూ పంపకాలు చేసేందుకు వీల్లేకుండా ఇరికించేశారు.

ఇదీ జరిగింది... రాజధాని అమరావతి కోసం రైతులు చేసిన త్యాగం అసమాన్యమైనది. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా... తమ భూములు

మిగతా 14వ పేజీలో...

అన్యాయం చేయొద్దు!

రాజధాని కోసం భూములను త్యాగం చేసిన మమ్మల్ని కష్టపెట్టి అందమైన నగరం ఎలా నిర్మిస్తారు? రైతులను నమ్ముకుంటే నష్టపోయిన వారెవ్వరూ లేరు. ఇక్కడ రైతులే నష్టపోతూ రాజధానికి ప్రాణం పోశారు. ఇలాంటి చోట రైతుల డిమాండ్‌ను పట్టించుకోకుండా అడ్డుగోడల్లా రూల్స్ పెడితే ఎలా? ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. పెద్ద ప్లాట్ల పునర్విభజన, అమ్మకాలకు వీలు కల్పించాలి. అధికారుల నివేదికలనే పరిగణనలోకి తీసుకుంటే రైతులు అన్యాయమైపోతారు!

- వెంకటేశ్వర్లు, తుళ్లూరు





అల్లూరి సీతారామరాజు జిల్లా వంజంగి కాఫీ తోటలను పరిశీలిస్తూ గిరిజన రైతు పూజారి సత్యారావు, కృష్ణవేణి దంపతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఆదివాసీల రక్షణకు నాదీ హామీ

మళ్లీ జన్మ ఉంటే ఏజెన్సీలోనే పుడతా: సీఎం

- ఆదివాసీ బాగుంటేనే రాష్ట్రంలో వెలుగులు
- ఏజెన్సీలో గిరిజనుల పోస్టులు గిరిజనులకే
- నేను తెచ్చిన జీవో నం.3కు జగన్ తూట్లు
- దాని పునరుద్ధరణకు కూటమి కృషి
- గంజాయి అడ్డాగా ఆనాడు ఏజెన్సీ
- గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు.. లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు
- అరకు, లంబసింగి, మారేడుమిల్లిలో పర్యాటక క్లస్టర్లు
- ఈ నెలాఖరుకు టీచర్ల నియామకం
- సూపర్ సిక్స్.. సూపర్ హిట్ కొట్టాం
- ఆదివాసీ దినోత్సవంలో చంద్రబాబు వెల్లడి
- పాడేరు మండలంలో సాగిన సీఎం పర్యటన

పాడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండ కోనల్లో నివసించే ఆదివాసీలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏజెన్సీ దేవుడు సృష్టించిన అద్భుతమని, మళ్లీ జన్మ అంటూ ఉంటే తాను ఏజెన్సీలో పుడతానన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం లగిశపల్లిలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి ప్రసంగించారు. గిరిజన అభివృద్ధిపై తనకు శ్రద్ధ, స్పష్టత ఉన్నాయని, గిరిజనుల సంక్షేమంతో పాటు వారి హక్కుల పరిరక్షణ బాధ్యత కూడా తీసుకుంటానన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలు స్థానిక

మిగతా 13వ పేజీలో...

సత్వర న్యాయం, పటిష్ఠ పోలీసింగ్‌లో ఏపీ భేష్

2వ స్థానం
ఇండియా జస్టిస్ రిపోర్టులో



- వైసీపీ హయాంలో పోలీసు వ్యవస్థ దుర్వినియోగం
- నాటి పాలకుల నిర్వాకంతో 2022లో 5వ స్థానం
- కూటమి రాకతో గాడినపడ్డ శాంతిభద్రతలు
- జైళ్ల శాఖ పనితీరులో 4వ ర్యాంకు
- పోలీసు శాఖలో మహిళల భాగస్వామ్యంలో ఏపీ టాప్
- ఖైదీల సంక్షేమంలోనూ మన రాష్ట్రమే బెస్ట్
- అగ్రస్థానంలో నిలబెడతాం: సీఎం చంద్రబాబు

2



రొయ్యకు ట్రంప్ దెబ్బ!



సుంకాల బాదుడుతో విలవిల.. ఎగుమతుల్లో దేశంలోనే ఏపీ టాప్

- ఏటా రూ.20 వేల కోట్ల ఎగుమతి
- అందులో అమెరికాకే 16 వేల కోట్లు
- గోదావరి జిల్లాల వాటానే 60 శాతం
- సుంకాల ప్రకటనతో పడిపోయిన ధర
- టన్నుకు రూ.40 వేలకు పైగా నష్టం
- ధరలు మరింత తగ్గే అవకాశం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా ఎగుమతులపై తొలుత విధించిన 25 శాతం సుంకం ఈ నెల 7వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో లక్షకు 25 వేల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి రవాణా, ఇతర ఖర్చులు అదనం. తాజాగా సుంకాన్ని 50 శాతానికి పెంచడంతో లక్షకు రూ.50 వేలు చెల్లించాలి. ఈ నెల 27వ తేదీ నుంచి ఇది అమల్లోకి రానుంది. ట్రంప్ ప్రకటన వెలువడగానే రొయ్యల ధరలు పడిపోయాయి. టన్నుకు రూ.40 వేల దాకా నష్టపోతున్నామని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు అండగా నిలవకపోతే ఆక్వా రంగం కుదేలయ్యే ప్రమాదముంది.

12

అగ్రి ఎగుమతులకూ షాక్

- రకరకాల బియ్యం, వివిధ ఆహార పదార్థాలపై 50% టారిఫ్
- జాబితాలో దంపుడు బియ్యం, ఉప్పుడు బియ్యం, పాలిష్డ్ బియ్యం
- ప్రత్యామ్నాయ మార్కెట్ల కోసం ప్రభుత్వాలు సహకరించాలి
- ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ వినతి



6 పాక్ విమానాలు కూల్చేశాం

12

- రాజకీయ సంకల్పం సుస్పష్టం.. మాపై ఏ ఒత్తిళ్లూ లేవు
- ఎస్400 గేమ్ చేంజర్.. వైమానిక దళాధిపతి ఏపీ సింగ్
- మరి.. హఠాత్తుగా పాక్‌పై యుద్ధం ఎందుకు ఆపేశారు?
- ఏ ఒత్తిడి పనిచేసింది?.. ప్రధాని మోదీకి కాంగ్రెస్ ప్రశ్నలు
- ఒక్క విమానాన్నీ కూల్చలేదు.. అది అసంబద్ధ వాదన: పాక్
- భారత్, పాక్ యుద్ధంలో 6 విమానాలు కూలాయి: ట్రంప్

హృదయం.. జర భద్రం

గుండెజబ్బుకు.. ముందస్తు హెచ్చరికలు



- గమనించకపోతే ముప్పు తప్పదు
- 50% బాధితుల్లో ముందుగానే సంకేతాలు
- కడుపు, ఛాతీలో నొప్పి, మంట
- నడిచినా, మెట్లెక్కినా విపరీతమైన ఆయాసం
- గుండెలో ఇన్ఫెక్షన్‌తో తీవ్ర జ్వరం
- గ్యాస్ట్రిక్ అనుకుని చాలా మంది నిర్లక్ష్యం
- అప్రమత్తం కాకపోతే అపాయమే

3

కాస్ట్‌లీ.. గురూ..



11

ఇకపై ఐసీఐసీఐ కనీస బ్యాలెన్స్ రూ.50 వేలు

- పట్టణాల్లో కొత్త సేవింగ్స్ ఖాతాలకు వర్తింపు
- చిన్న పట్టణాల్లోనైతే రూ. 25 వేలు

డిస్కౌంట్ సేల్



పండుగ వేళ రైల్వే బంపర్ ఆఫర్

- రానూపోనూ టికెట్ బుక్ చేస్తే తిరుగు ప్రయాణంపై 20% తగ్గింపు
- అక్టోబరు 13-26 జర్నీ, 17 నవంబరు-డిసెంబరు 1 రిటర్న్ జర్నీలకు వర్తింపు

7 ఇంజిన్లు.. 354 వ్యాగన్లు!

- దేశంలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలు
- 'రుద్రాస్త్ర'.. 4.5 కిలోమీటర్ల పొడవు
- ప్రారంభించిన భారతీయ రైల్వే

11



అన్న సమాధికి రాఖీ

భౌతికంగా దూరమైన తన అన్నను తలచుకుంటూ ఓ చెల్లి రాఖీ పౌర్ణమి రోజున అతని సమాధికి రక్షా బంధన్ కట్టింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా పెదబయలు మండలం చల్దిమామిడికి చెందిన రెడ్డి సూర్యప్రకాశ్ (వీఆర్‌పీ) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. శనివారం రక్షాబంధన్ కావడంతో చింతపల్లిలో ఉంటున్న అతని సోదరి సంధ్యాకుమారి 100 కిలోమీటర్లు ప్రయాణించి చల్దిమామిడి చేరుకుంది. తన అన్న సమాధిని శుభ్రం చేసి నైవేద్యం పెట్టింది. సమాధికి రాఖీ కట్టి కన్నీటి పర్యంతమైంది.

- పెదబయలు, ఆంధ్రజ్యోతి



దొండ 'కారు'

కారులో షికారుకు వెళ్లడం అందరూ చేసేదే. కారులో కూరగాయలు తీసుకెళ్లడం.. గోదావరి జిల్లాల రైతులకే సాధ్యం. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటకు చెందిన ఓ రైతు తన చేలో పండించిన దొండకాయలను మారుతీ కారులో 15 కిలోమీటర్ల దూరంలోని గూడెం మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. గతంలో బైక్, ఆటోల్లో కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళ్లగా.. ఎల్పీజీ గ్యాస్‌తో నడిచే కారు కావడంతో రవాణా ఖర్చులు కలిసొస్తాయని, పాతబడిన కారును ఇలా వాడేస్తున్నారు. ఈ కారులో పది బస్తాల దొండకాయలు తీసుకెళుతున్నారు. పది కేజీల దొండకాయలకు రూ.200 వస్తోందని రైతు చెప్పారు.

- (తాడేపల్లిగూడెం రూరల్, ఆంధ్రజ్యోతి)

400 కిలోలు రూ.30 వేలు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు జాలరిపాలేనికి చెందిన మత్స్యకారులకు శనివారం భారీ చేప చిక్కింది. బోట్లపై సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడి గేలానికి భారీ చేప చిక్కడంతో దానిని బోటులోకి లాగలేకపోయారు. తాడుతో కట్టి నీటిలోనే తీరానికి తీసుకువచ్చారు. దానిని 'కితలం' చేపగా మత్స్యకారులు చెబుతున్నారు. సుమారు 400 కిలోల బరువు ఉన్న ఈ చేపను వ్యాపారులు రూ.30 వేలకు కొనుగోలు చేశారు.

- అచ్యుతాపురం, ఆంధ్రజ్యోతి



లోకం తీరు



రాజమండ్రి జైలు వద్ద.. ఎట్టకేలకు పోలీసుల ఆంక్షలు

- సిబ్బంది సంఖ్య పెంపు.. జైలు ఎదుట రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు
- అనధికార న్యాయవాది హుస్సేన్ కూడా వాటికి ఆవలే
- మీడియానూ దూరంగా పంపేసిన వైనం
- ములాఖత్ సమయంలో గంట సేపు వన్‌వే



రాజమండ్రి జైలు ఎదుట రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు.. పోలీసుల మోహరింపు

రాజమహేంద్రవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి కేంద్ర కారాగారం వద్ద వైసీపీ శ్రేణులు, నేతల హంగామాకు తెరపడింది. జైలు ఎదుట భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ఎవరూ గుంపులుగుంపులుగా రాకుండా.. అక్కడే బైఠాయించకుండా ఎట్టకేలకు ఆంక్షలు పెట్టారు. సిబ్బంది సంఖ్యను పెంచారు. జైలు ఎదుట రోడ్డుపై బారికేడ్లు పెట్టారు. ముఖ్యంగా ములాఖత్ సమయంలో జైలు ఎదుట సుమారు అర కిలోమీటరు వరకు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టి ట్రాఫిక్ నిలిపివేస్తున్నారు. ఆ సమయంలో గంట సేపు వన్‌వే ఇచ్చారు. మద్యం కుంభకోణంలో నిందితుడైన రాజంపేట వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ4)ను కలవడానికి అటు నేతలతో పాటు వస్తున్న వైసీపీ కార్యకర్తలు జైలు ప్రధాన గేటు ఎదురుగా బారులు తీరి నానా హడావుడి చేస్తున్నా నిన్నటిదాకా పోలీసులు పట్టించుకోలేదు. జైలు అధికారులు కూడా నిబంధనలు పాటించలేదు. అడ్డగోలుగా ములాఖత్‌లు ఇస్తున్నారు. ఈ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో కొంత మార్పు కనబడుతోంది. జైలు వరకు ఎవరినీ రానివ్వకుండా బారికేడ్ల అవతలే ఆపేస్తున్నారు. ఇంతకు ముందు మీడియా ప్రతినిధులను ప్రధాన గేటు వరకూ అనుమతించేవారు. శనివారం వారిని దూరంగా పంపించేశారు. ములాఖత్‌కు వెళ్లి వచ్చేవారి ఫొటోలు తీసుకునే అవకాశం లేకుండా చేశారు. ఆంక్షలు మంచివే కానీ మీడియాను అనుమతించకపోవడం విమర్శలకు తావిచ్చింది. మిథున్‌రెడ్డిని కలిసేందుకు వచ్చేవారితో దర్జాగా లోపలకు వెళ్తున్న అనధికార న్యాయవాది హుస్సేన్ కూడా బారికేడ్ల ఆవలే తచ్చాడడం గమనార్హం.

మిథున్‌రెడ్డికి రాఖీ కట్టనివ్వాలని సోదరి వాగ్వాదం

మిథున్‌రెడ్డి సోదరి శక్తిరెడ్డి, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, మిథున్‌రెడ్డి చిన్నాన్న కుమారుడు పి.అభినయరెడ్డి శనివారం ములాఖత్‌కు వచ్చారు. అయితే ఆయనకు రాఖీ కట్టనివ్వలేదని శక్తిరెడ్డి, ఇతరులు జైలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ స్పందిస్తూ.. తమకు రాఖీ అని చెప్పలేదని, ఏదో లగేజీ తెస్తున్నారని భావించి అనుమతించలేదని చెప్పారు. అనంతరం గురుమూర్తి, మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ.. అసలు మద్యం స్కాం అనేదే లేదని.. రాజకీయ వేధింపులతో అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. మిథున్‌రెడ్డికి కనీసం రాఖీ కట్టే అవకాశం ఇవ్వలేదని, చట్టప్రకారం కల్పించాల్సిన వసతులను నిరాకరిస్తున్నారని విమర్శించారు.

సత్వర న్యాయం, పటిష్ఠ పోలీసింగ్‌లో ఏపీ భేష్



ఇండియా జస్టిస్ రిపోర్టు-2025లో 2వ స్థానం

- వైసీపీ హయాంలో పోలీసు వ్యవస్థ దుర్వినియోగం
- నాటి పాలకుల నిర్వాకంతో 5వ స్థానం
- కూటమి రాకతో గాడినపడ్డ శాంతిభద్రతలు
- మెరుగైన పోలీసు శాఖ పనితీరు
- జైళ్ల శాఖ పనితీరులో 4వ ర్యాంకు
- మహిళల భాగస్వామ్యంలో ఏపీ టాప్
- ఖైదీల సంక్షేమంలోనూ మన రాష్ట్రమే బెస్ట్

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర న్యాయం అందించటంలో, పటిష్ఠమైన శాంతిభద్రతల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ పనితీరు గతం కంటే చాలా మెరుగైంది. ఈ విషయం శనివారం విడుదలైన ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025లో స్పష్టమైంది. జాతీయ స్థాయిలో ఆ రిపోర్టు ఓవరాల్ ర్యాంకింగ్‌లో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానాన్ని దక్కించుకుంది. ఇండియా జస్టిస్ రిపోర్టును 2019 నుంచి టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రకటిస్తున్నారు. ప్రస్తుతం ఇచ్చిన నివేదిక నాలుగోది. సుదీర్ఘ అధ్యయనం తర్వాత రాష్ట్రాలకున్న సత్వర న్యాయాన్ని వెలువరించే సామర్థ్యాన్ని అంచనా వేసి ఈ నివేదికను విడుదల చేస్తారు. ముఖ్యంగా పోలీసు, న్యాయ, జైళ్ల శాఖల పనితీరుతో పాటు బాధితులకు న్యాయ సహాయం(లీగల్ ఎయిడ్) అందుతున్న తీరును అధ్యయనం చేసి ఈ నివేదిక రూపొందించారు. రాష్ట్రాల మానవహక్కుల కమిషన్ల పనితీరునూ అధ్యయనం చేసి నివేదికలో పొందుపరిచారు. పోలీసుశాఖ పనితీరు పరంగా ఏపీ 2వ స్థానంలో ఉంది. జైళ్ల శాఖ పనితీరులో 4వ స్థానంలో, న్యాయశాఖ పనితీరులో 5వ స్థానంలో, లీగల్ ఎయిడ్ పరంగా 5వ స్థానంలో ఉంది.

5వ స్థానం నుంచి 2వ స్థానానికి

వైఎస్ జగన్ హయాంలో రాజకీయ ప్రతీకారాలు, ప్రతిపక్ష నాయకుల్ని టార్గెట్ చేసేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారు. దీంతో 2022లో ఇచ్చిన ఇండియా జస్టిస్ రిపోర్టు ర్యాంకుల్లో వెనకబడి ఏపీ 5వ స్థానానికి పడిపోయింది. 2019 నుంచి 2024 వరకు సత్వర న్యాయంతో పాటు ఇతర అంశాల్లో వెనుకబడిన రాష్ట్రం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాడిన పడిందని, చట్టబద్ధ పాలన తిరిగి వచ్చిందని ఇండియా జస్టిస్ రిపోర్టు వెల్లడించింది. పోలీసింగ్‌తో పాటు న్యాయసహకారాన్ని అందించటంలో ఏపీ పనితీరు మెరుగైనట్టు నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు, పోలీసింగ్, న్యాయవ్యవస్థ పనితీరు, సామాజిక, చట్టపరమైన పాలన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏపీకి ర్యాంకింగ్ ఇచ్చినట్లు నివేదిక పేర్కొంది. మొత్తం పది పాయింట్లకు 6.78 స్కోర్‌తో జాబితాలో మొదటి స్థానాన్ని కర్ణాటక దక్కించుకుంది. 6.32 స్కోరుతో ఏపీ రెండో స్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో తెలంగాణ, కేరళ, తమిళనాడు వరుసగా ఉన్నాయి.

ఖైదీల సంక్షేమంలోనూ టాప్


ఖైదీల సంక్షేమం విషయంలోనూ ఏపీ టాప్‌లో ఉంది. ఒక ఖైదీకి రోజుకి రూ. 500 ఖర్చు చేస్తూ ఏపీ దేశంలోని మిగిలిన రాష్ట్రాలకన్నా ముందు వరుసలో ఉంది. పోలీసు శాఖలో ఖాళీల భర్తీ విషయంలోనూ ఏపీ మెరుగ్గా ఉంది. పోలీసు కానిస్టేబుల్స్, పోలీసు అధికారుల ఖాళీలు జాతీయ సగటు కన్నా ఏపీలోనే తక్కువగా ఉన్నాయి. ఏపీలో కేవలం 10 శాతం మాత్రమే ఖాళీలు ఉండగా, తెలంగాణలో 13 శాతం ఖాళీలు ఉన్నాయి. అలాగే పోలీసు అధికారుల్లో ఎస్టీ కోటాను పూర్తిస్థాయిలో భర్తీ చేసిన ఘనత ఏపీకి దక్కింది. పోలీసు శాఖలో ఎస్సీ అధికారుల ఖాళీలు ఏపీలో 10 శాతం ఉండగా, తెలంగాణలో 11 శాతం ఉన్నాయి. ఏపీ పోలీసు శాఖలో మహిళల భాగస్వామ్యం 22 శాతం ఉంది. ఇది దేశంలోని మిగిలిన రాష్ట్రాల కన్నా ఎక్కువ. తెలంగాణలో మహిళల భాగస్వామ్యం 9 శాతం మాత్రమే.

నివేదికలోని ఆసక్తికర అంశాలు..

- గత మూడేళ్లుగా పరిశీలిస్తే రాష్ట్రంలో ప్రతి మూడు కేసుల్లో ఒక కేసు పెండింగ్‌లో ఉంటోంది.
- ఏపీలోని 58 శాతం పోలీసుస్టేషన్లలో మాత్రమే ఒక్కటైనా సీసీ కెమెరా ఉంది. మిగిలిన పోలీసుస్టేషన్లలో సీసీ కెమెరాలు లేవు.
- దేశవ్యాప్తంగా మిగిలిన పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే హైకోర్టు, జిల్లా కోర్టుల్లో పోస్టుల ఖాళీలు ఏపీలోనే చాలా తక్కువగా ఉన్నాయి. హైకోర్టులో 19 శాతం, జిల్లా కోర్టుల్లో 12% ఖాళీలు మాత్రమే ఉన్నాయి.
- న్యాయ సహాయానికి కేటాయిస్తున్న బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించడంలో ఏపీ ముందంజలో ఉంది.

ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యం: చంద్రబాబు

ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో ఏపీని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలకు న్యాయ సహాయం, పోలీసింగ్ సహా వివిధ విభాగాల్లో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో నిలవడంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. దేశంలో రెండో స్థానంతో ఏపీ కీలకమైన మైలురాయిని అందుకున్నా.. సంతృప్తి చెందడంలేదన్నారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టే వరకు నిర్విరామంగా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.



రజనీ సినిమా కోసం సాఫ్ట్‌వేర్ సంస్థ సెలవు

చెన్నై, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కూలీ సినిమాను తొలి రోజే వీక్షించేందుకు అనువుగా తమ సిబ్బందికి ఈనెల 14న సెలవు ఇస్తున్నట్లు 'యూనో ఆక్వాకేర్' సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రకటించింది. చెన్నై, బెంగళూరు, తిరుచ్చి, తిరునల్వేలి, చెంగల్పట్టు, మాట్టుదావని, ఆరపాళయంలో ఉన్న తమ శాఖల సిబ్బంది వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. అలాగే, రజనీకాంత్ సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'రజనిజం' వేడుకల నేపథ్యంలో అనాథ, వృద్ధాశ్రమాల్లో మిఠాయిలు పంపిణీ చేయనున్నట్లు సంస్థ తెలిపింది.

శంషాబాద్‌లో విమాన రాకపోకలకు అంతరాయం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు జాతీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపం, వాతావరణం అనుకూలించకపోవడంతో సర్వీసులను ఆలస్యంగా నడపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జీఎంఆర్ అధికారుల వివరాల మేరకు.. అబుధాబీ నుంచి రావాల్సిన ఎతిహాద్ విమానం, సింగపూర్ నుంచి రావాల్సిన ఇండిగో విమానం, దుబాయ్ నుంచి రావాల్సిన రెండు విమానాలతో పాటు మరో రెండు అంతర్జాతీయ సర్వీసులు ఆలస్యమయ్యాయి. అలాగే అహ్మదాబాద్ నుంచి రావాల్సిన ఇండిగో విమానం 4 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.45 గంటలకు శంషాబాద్‌కు చేరుకుంది. ఇక్కడి నుంచి రాజ్‌కోట్‌కు వెళ్లాల్సిన విమానం కూడా ఆలస్యమైంది. మధ్యాహ్నం 12.45కు గోవా వెళ్లాల్సిన సర్వీసు 2 గంటలకు పైగా ఆలస్యంగా నడిచింది. సాయంత్రం 5.20 గంటలకు వెళ్లాల్సిన అలియాబాద్ వెళ్లాల్సిన ఇండిగో విమానం రాత్రి 9.45 గంటలకు బయలుదేరి వెళ్లింది. పాట్నా వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.



జలమయమైన అమీర్‌పేట

హైదరాబాద్‌లో కుండపోత

రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను శనివారం రాత్రి వర్షం ముంచెత్తింది. చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్బీనగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, తార్నాక, అబిడ్స్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతగా కురిసిన వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వగా.. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి 11 గంటల సమయానికి అబ్దుల్లాపూర్‌మెట్‌లో అత్యధికంగా 13..5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నాంపల్లి-బేగంబజార్ ప్రాంతంలో 12..4 సెం.మీ వర్షం కురిసింది. భారీ వర్షానికి యూసుఫ్‌గూడ కృష్ణానగర్ ప్రాంతంలో వరద పోటెత్తింది. వరద నీటిలో చిక్కుకున్న వారిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చాయి. మలక్‌పేట రైల్వే వంతెన వద్ద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక, తెలంగాణలోని సంగారెడ్డి, సిద్దిపేట, నారాయణపేట, గద్వాల, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని వాగులు పొంగి పొర్లగా పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి.

నేడు సాగర్ గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఆదివారం ఉదయం 6గంటలకు ఎత్తనున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జున్‌రావు శనివారం ప్రకటించారు. ఎగువ నుంచి వరద కొనసాగుతుండడం, ప్రాజెక్టు నీటి మట్టం పూర్తిస్థాయికి (590 అడుగులు) చేరువలో ఉండడంతో రెండు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని తెలిపారు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు) సాగర్ గేట్లు ఎత్తడం ఇది రెండోసారి కావడం విశేషం. జూలై 29 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. సాగర్ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 589.70 అడుగులుగా ఉంది. కాగా, శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. జూరాలకు భీమానది వరద తోడు కావడం, తుంగభద్రకు వరద పెరగడంతో శనివారం శ్రీశైలానికి 1.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 183.41 టీఎంసీలు నిల్వ ఉన్నది. జూరాల ప్రాజెక్టుకు 1.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఇందులో భీమా నది నుంచి 22 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.


కప్ప స్తంభం వద్ద జస్టిస్ లక్ష్మణరావు దంపతులు

అప్పన్న సేవలో జస్టిస్ లక్ష్మణరావు

సింహాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు సతీసమేతంగా శనివారం సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజల అనంతరం కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

మంత్రాలయంలో ఘనంగా సప్తరాత్రోత్సవాలు

- రజత వాహనంపై ప్రహ్లాదరాయల విహారం
- మూలరాములకు కనకాభిషేకం
- టీటీడీ నుంచి రాఘవరాయుడికి పట్టువస్త్రాలు


టీటీడీ నుంచి వచ్చిన పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, వాటిని బృందావనం ఎదుట ఉంచి పూజలు చేస్తున్న దృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గురు రాఘవేంద్ర నమో నమః అంటూ వేలాది మంది భక్తులు రాఘవేంద్రస్వామి సన్నిధిలో తరించారు. రాఘవేంద్రస్వామి 354వ సప్త రాత్రోత్సవాల్లో రెండో రోజు శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. మూలరాములకు చేసిన కనకాభిషేకం భక్తులను తన్మయత్వంలో ముంచెత్తింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజ వాహనంపై దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊంజల సేవలో ఊగిస్తూ పీఠాధిపతి శాఖోత్సవం చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మఠం ప్రాంగణం మార్మోగింది. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కాగా.. రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా టీటీడీ నుంచి అధికారికంగా జేఈవో (పేష్కర్) రామకృష్ణ తెచ్చిన పట్టువస్త్రాలు, ప్రసాదాన్ని ముఖద్వారం నుంచి ఏఏవో మాధవశెట్టి, మఠం అధికారులు స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీమఠంలో పీఠాధిపతి టీటీడీ పట్టువస్త్రాలను తలపై మోసుకుని వచ్చి బృందావనం ముందు ఉంచి హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు తెప్పపై విహరించారు. మఠంలోని యోగీంద్ర కళా మండపంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్య, సంగీత కచేరి ఆకట్టుకుంది.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ తుహిన్ కుమార్, జస్టిస్ గోపాలకృష్ణారావు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుహిన్ కుమార్, జస్టిస్ గోపాలకృష్ణారావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపటి నుంచి కోస్తాలో భారీ వర్షాలు

13న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 13వ తేదీన అల్పపీడనం ఏర్పడనుంది. దానికి ఒకరోజు ముందు అదే ప్రాంతంలో ఆవర్తనం ఆవరించే అవకాశం ఉంది. వీటి ప్రభావంతో కోస్తాలో వర్షాలు పెరగనున్నాయి. ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. 12 నుంచి 14వ తేదీ వరకు కోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, దక్షిణ కోస్తాంధ్ర పరిసరాలు, ఉత్తర కర్ణాటకల్లో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఆవరించాయి. ఇంకా శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొని కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. ఆదివారం రాయలసీమలో అనేకచోట్ల, కోస్తాలో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, చాలా రోజులుగా మధ్యభారతం, తర్వాత ఉత్తరాదిలో కొనసాగిన రుతుపవన ద్రోణి రెండు రోజుల్లో దక్షిణాది వైపు రానున్నది. దాని తూర్పుభాగం నాలుగైదు రోజులు దక్షిణాది వైపు కొనసాగే అవకాశం ఉంది.

గుండెజబ్బుకు ముందే.. హెచ్చరికలు

పలు సంకేతాలను ఇచ్చే శరీరం.. వాటిని గమనించకపోతే ముప్పు.. వైద్య నిపుణుల హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బు.. గుండె పోటు..! ఒకప్పుడు నడివయసు దాటిన తర్వాత వచ్చే హృదయ సంబంధ రుగ్మతలు ఇప్పుడు చిన్నవయసు వారినీ వదిలిపెట్టట్లేదు. పట్టుమని మూడు పదు లు కూడా దాటని యువత గుండెపోటుతో చనిపోతున్న ఉదంతాలు ఇటీవల పెరుగుతున్నాయి. పనిభారం, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం.. కాలంతో పాటు పరుగులు తీసేలా వృత్తి, ఉద్యోగాలకు అంకితమవ్వడం వంటివి యువతలో గుండెపోటుకు కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. అయితే.. ఇదేమీ అకస్మాత్తుగా జరిగిపోదని.. అలసిన గుండె ఆగిపోవడానికి ముందు శరీరం పలు హెచ్చరికలు జారీ చేస్తుందని.. వాటిని పెడచెవిన పెడితే ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిమ్‌లో ట్రెడ్‌మిల్‌పై నడుస్తూనే కుప్ప కూలిపోవడం.. బ్యాడ్మింటన్ ఆడుతూ ఉన్నఫళంగా పడిపోవడం.. కన్నడ సినీనటుడు పునీత్ డెడ్‌లిఫ్ట్ చేస్తూ చనిపోవడం వంటి ఘటనలు.. శరీరం ఇచ్చే సంకేతాలను నిర్లక్ష్యం చేయడం వల్ల జరిగినవేనని చెబుతున్నారు.

ఇవీ సంకేతాలు..

గుండెపోటు రావడానికి ముందు చాలా సంకేతాలు కనిపిస్తాయని.. విపరీతమైన నీరసం వాటిలో ప్రధాన లక్షణమని వైద్యులు చెబుతున్నారు. ఆ నీరసం రోజంతా కష్టపడి పనిచేయడం వల్లనో, పని ఒత్తిడితో అలసిపోవడం వల్లనో వచ్చిందని భావిస్తారని, కానీ అది గుండె పోటుకు కూడా సిగ్నల్ కావొచ్చని పేర్కొన్నారు. నీరసంతోపాటు.. కడుపులో మంట.. ఛాతీ నొప్పి, కళ్లు మసకబారడం, ఆయాసం, బీపీ తగ్గడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. రక్తంలో క్రమంగా కాల్షియం పెరిగి, గడ్డ కట్టి రక్తనాళాలు బ్లాక్ అవ్వడంతో కొందరిలో గుండె వైఫల్యం సంభవిస్తుందని.. ఇలా రక్తనాళాలు బ్లాక్ అవుతుంటే.. కడుపులో మంట, ఛాతీ నొప్పి వస్తాయని వైద్యులు వివరించారు. చాలా మంది దీన్ని గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి.. సొంత వైద్యం చేసుకోవడమో.. మెడికల్ దుకాణానికి వెళ్లి మందులు తీసుకోవడమో చేస్తుంటారని.. మరికొందరైతే సోడా, శీతల పానీయాలతో సరిపెట్టుకోవడానికి ఇష్టపడతారని, అలా 7-8 నెలలపాటు పట్టించుకోకుండా ఉంటే.. ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పరీక్షలు తప్పనిసరి

వయసుతో సంబంధం లేకుండా.. పై లక్షణాలు కనిపించినవారు వైద్యులను సంప్రదించి ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు చేయించుకోవాలని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. 40-45 ఏళ్లు దాటినవారు తప్పనిసరిగా ఈ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. కొంత మందిలో గుండె నొప్పికి సంబంధించిన లక్షణాలు పైకి కనిపించవని, అలాంటి వారి గుండె కవాటాల్లో ఇబ్బందులు ఉంటాయని వివరించారు. ఈ పరీక్షలు చేయించుకోవడం వల్ల గుండె పనితీరును తెలుసుకోవచ్చని, గుండెలో విద్యుత్తు ప్రేరేపణలు అసాధారణంగా ఉంటే హృదయ స్పందనలు ఎక్కువగా ఉంటాయని గుర్తుచేస్తున్నారు. దీంతో ఉన్నఫళంగా హృదయ స్పందనలు పెరిగి.. మరణానికి దారి తీస్తుందని చెబుతున్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారైనా లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీఏ1సీ వంటి పరీక్షలు తప్పనిసరి గా చేయించుకోవాలని.. ఎప్పటికప్పుడు రక్తపోటును చెక్ చేసుకుని అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అధిక రక్తపోటును, మధుమేహాన్ని నియంత్రణలో పెట్టుకోవడం ద్వారా గుండెజబ్బులకు దూరంగా ఉండొచ్చని వివరిస్తున్నారు.

ఈ లక్షణాలుంటే.. జాగ్రత్తపడాలి



గుండెపోటుకు ముందు ఆయాసం రావడం, బీపీ తగ్గడం వంటి సంకేతాలు కనిపిస్తాయి. గుండెలో ఇన్ఫెక్షన్ ఉంటే తీవ్ర జ్వరం వస్తుంది. కడుపు, ఛాతీలో నొప్పి ఉంటుంది. ఛాతీలో నొప్పి ఇతర భాగాలకు పాకుతుంది. కొందరికి ఎడమ చేతి వద్ద ఒక చోట నొప్పి మొదలై.. మెల్లిగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తుంది. మరికొందరిలో చెమటలు బాగా పడతాయి. ఇంకొందరిలో.. మెట్లు ఎక్కినా, కొద్ది దూరం నడిచినా ఆయాసం వస్తుంది. ఉదయం పూట ఆయాసం, అకస్మాత్తుగా కళ్లు మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించాలి.

- డాక్టర్ రాజేశ్ దేశ్‌ముఖ్, కార్డియోథొరాసిక్, వ్యాస్కులర్ సర్జన్, కామినేని ఆస్పత్రి

గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి..



ఓ పేషెంట్ వయసు 37 ఏళ్లు.. కడుపులో మంట వస్తుండడంతో గ్యాస్ట్రిక్ సమస్యగా భావించాడు. పది రోజులు గడిచినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మా దగ్గరకు వచ్చాడు. పరీక్షలు చేయగా అతనికి పెద్ద స్థాయిలో గుండెపోటు వచ్చిందని నిర్ధారణ అయ్యింది. గుండెపోటు అంటే.. చాలా మంది తీవ్రమైన నొప్పి అని, చాలా సేపు వస్తుందని భావిస్తారు. చిన్న నొప్పులను ఎవరు పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తారు. దాని ప్రభావం మాత్రం గుండెపై తీవ్రంగా ఉంటుంది. ఛాతీలో పట్టేసినట్లు అనిపించడం, ఆయాసం, గుండెదడ, నాలుగు అడుగులు వేయలేక ఇబ్బంది పడడం వంటి లక్షణాలను గుండె నొప్పి సిగ్నల్స్‌గా భావించాలి.

- డాక్టర్ శివప్రసాద్, చీఫ్ ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్ట్, వన్ కార్డియాక్ సెంటర్ ఆస్పత్రి

డాలర్ డ్రీమ్స్‌తోపాటు జీవన నైపుణ్యాలు అవసరం

- అమరావతి రైతుల విజయగాథ యువతకు స్ఫూర్తిదాయకం: జస్టిస్ ఎన్వీ రమణ


స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ ఎన్వీ రమణ

గుంటూరు(విద్య), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నేటి తరం యువతకు చదువు పూర్తికాగానే ఉద్యోగం సాధించి అమెరికా వెళ్లి డాలర్స్ సంపాదించాలనే ఆలోచనతోపాటు జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను సమర్థంగా ఎదుర్కొనే జీవన నైపుణ్యాలు, శ్రమించే తత్వం అవసరమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ స్పష్టం చేశారు. గుంటూరు సమీపంలోని చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన పదవ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తమ హక్కుల కోసం ఐదేళ్లు పోరాడిన అమరావతి రైతుల విజయ గాథ యువతకు స్ఫూర్తి కావాలన్నారు. ఆత్మనూన్యత, అభద్రతాభావం, అశాంతి, నిర్వేదంలో తెలుగు సాహిత్యం చదివితే స్వాంతన కలుగుతుందని తెలిపారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి మాట్లాడుతూ సాంకేతిక రంగంలో ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఏపీ నిట్ స్నాతకోత్సవం


విద్యార్థికి పట్టా అందజేస్తున్న రమణారావు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని టాటా సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న సూచించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో 7వ స్నాతకోత్సవం నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2021-25లో బీటెక్ పూర్తిచేసుకున్న 667 మంది విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీ పూర్తి చేసిన 29 మందికి డాక్టరేట్ పట్టాలను అందజేశారు. రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు డిజిటల్ టెక్నాలజీలే ప్రధాన శక్తిగా మారనున్నాయన్నారు.

అది దేవస్థానమా? శ్మశాన వాటికా?

- ధర్మస్థల ట్రస్టుపై విరుచుకుపడిన సీపీఐ నారాయణ



తిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థల ట్రస్టుపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విరుచుకుపడ్డారు. తమ కార్యాలయ ఉద్యోగి కుమార్తె వివాహానికి హాజరైన నారాయణ శనివారం ఉదయం శ్రీవారి ఆలయ ప్రాంతాన్ని సందర్శించారు. ధర్మస్థలలో మిస్టరీ మరణాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మస్థల ట్రస్టు 60 నుంచి 70 ఏళ్లుగా ఓ కుటుంబం చేతిలోనే ఉందన్నారు. ఆ ట్రస్టుకు ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తిని రాజ్యసభ సభ్యుడిగా కూడా బీజేపీ నామినేట్ చేసిందని పేర్కొన్నారు. అయితే 1980 నుంచి ఇప్పటివరకు దాదాపు 500 మంది అమ్మాయిలను రేప్ చేసి చంపేశారన్నారు. ఈ విషయాన్ని ఓ స్కావెంజర్ బయటపెట్టాడని, ప్రజలు ఆందోళన చేపట్టిన క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు సిట్ ఏర్పాటు చేసిందన్నారు. కాంపౌండ్ లోపల తవ్వే కొద్దీ పుర్రెలు, ఎముకలు బయటపడుతున్నాయని, అది శ్మశాన వాటికా లేదా పవిత్రమైన దేవస్థానమా అంటూ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పలు రైళ్లు రద్దు.. గమ్యాల కుదింపు

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి సెక్షన్‌లో మూడో లైను నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ శనివారం తెలిపారు. మరికొన్నింటి గమ్యాలను కుదించామని, ఇంకొన్నిటిని రీషెడ్యూల్ చేశామని పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 27 వరకు విశాఖ-రాయ్‌పూర్ ప్యాసింజర్ (58528), విశాఖ-కోరాపుట్ ప్యాసింజర్ (58538), విశాఖ-భవానిపట్న ప్యాసింజర్ (58504). ఈ నెల 20 నుంచి 28 వరకు రాయ్‌పూర్-విశాఖ ప్యాసింజర్ (58527), కోరాపుట్-విశాఖ ప్యాసింజర్ (58537), భవానీపట్న-విశాఖ ప్యాసింజర్ (58503)ను రద్దు చేశారు. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు గుంటూరు నుంచి విజయనగరం వరకు, తిరుగు ప్రయాణంలో రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) ఈ నెల 20 నుంచి 27 వరకూ విజయనగరం నుంచి గుంటూరుకు నడుస్తాయి.

మొక్కు తీర్చుకునేందుకు తిరుమల వెళుతూ.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి దుర్మరణం


- ముందు వెళుతున్న లారీని ఢీకొన్న 'తుఫాన్'
- మృతుల్లో మూడేళ్ల చిన్నారి.. మృతులంతా పల్నాడు జిల్లా వాసులు



లారీని ఢీకొట్టి తిరగబడిన తుఫాన్ వాహనం

ఉలవపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉలవపాడు వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, మూడేళ్ల చిన్నారి ఉన్నారు. కుమారుడి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు తిరుమలకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనం ముందు వెళుతున్న లారీని అతివేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేశునిపాడు గ్రామానికి చెందిన నంబుల వెంకటేశ్వర్లు, సుభాషిణి దంపతుల కుమారుడు అభిరామ్(3)కు శ్రీవారి సన్నిధానంలో పుట్టు వెంట్రుకలు తీసేందుకు 11 మంది కుటుంబసభ్యులతో శుక్రవారం రాత్రి బయలుదేరారు. ఉలవపాడు సమీపంలో చాగొల్లు వద్ద తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నంలో వీరి వాహనం లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో నరసమ్మ (55), సుభాషిణి (30) అక్కడికక్కడే మృతిచెందారు. అభిరామ్, రుక్మిణి, ఎర్రం శ్రీనివాసరావు (60) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కావలిలో చికిత్స పొందుతూ అభిరామ్ మృతిచెందాడు. రుక్మిణి, శ్రీనివాసరావులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళుతూ కుమారుడు మృతి

- విషయం తెలిసి ఆగిన తండ్రి గుండె


శ్రీను


మణి శంకరం

తాళ్లపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ రోజు చెల్లితో రాఖీ కట్టించుకుందామని బయలుదేరిన అన్న ప్రమాదంలో మృతిచెందాడు. ఈ విషయం తెలిసి అతని తండ్రి గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో పండుగ రోజే ఆ కుటుంబంలో విషాదం నిండింది. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన గుండేపల్లి మణిశంకరం(30), తండ్రి గుండేపల్లి శ్రీను(58) ఆకుకూరల వ్యాపారం చేస్తారు. శనివారం చెల్లితో రాఖీ కట్టించుకునేందుకు మణిశంకరం బైక్‌పై దేవరపల్లి మండలం యాదవోలు బయలుదేరాడు. గోపాలపురం మండలం వెంకటాయపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడి మృతి వార్త తెలియడంతో శ్రీను కుప్పకూలిపోయాడు. గుమ్మం వద్దే ఫోన్ పట్టుకుని మృతిచెందాడు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారం చేపట్టి 14 నెలలైనా మేనిఫెస్టోలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదార్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ఆరోపించారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్టీయూ ప్రాంతీయ సమావేశం శనివారం విశాఖలో జరిగింది. సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి, బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కూటమి వాటిని నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. స్కూలు అసిస్టెంట్లకు ఎంఈవో-1 బాధ్యతలు అప్పగించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ గత పది నెలలుగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపులు జరగడం లేదన్నారు.

హ్యాపీ టోల్‌గేట్!

పంద్రాగస్టు నుంచే అమల్లోకి ఫాస్టాగ్ వార్షిక పాస్

- ఒకసారి రూ.3 వేలు కడితే చాలు.. ఏడాదిపాటు
- దేశవ్యాప్తంగా 200సార్లు టోల్‌గేట్ల మీదుగా వెళ్లొచ్చు
- కమర్షియల్ వెహికిల్స్‌కు లేదు



హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): టోల్‌చార్జీల మోతతో తల బొప్పి కట్టినవారికి గొప్ప ఊరట! ఉద్యోగ, వ్యాపారాల కోసం వరుస ప్రయాణాలు చేసే వారికి టోల్ భారం గణనీయంగా తగ్గనుంది. మునుపటి మాదిరిగా నెలకు టోల్‌చార్జీల రూపంలో వేలకు వేలు వదిలించుకోవాల్సిన పనిలేదు. ఈ మేరకు జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారుల కోసం కేంద్ర ప్రభుత్వం తీపికబురు తెచ్చింది. ఒకసారి రూ.3 వేలు కడితే చాలు దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్ల మీదుగా గరిష్ఠంగా 200సార్లు ప్రయాణించే అవకాశం!! 'వార్షిక పాస్' అనే పేరుతో ఈ పథకాన్ని ఫాస్టాగ్ యూజర్ల కోసం ఈ నెల 15 నుంచి అమల్లోకి తేనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న అన్ని టోల్‌గేట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పాస్‌ను 'రాజ్‌మార్గ్ యాత్ర' అనే మొబైల్ యాప్, లేదా జాతీయ రహదారుల అథారిటీ సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికార వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు. దరఖాస్తు చేసుకునేవారి వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు 'వాహన్ డేటాబేస్'లో అప్‌డేట్ అయి ఉండాలి. ఆ తర్వాత వాహనానికి అనుసంధా నం చేసిన ఫాస్టా గ్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. డబ్బులు చెల్లించిన తర్వాత 2 గంటల్లోగా వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుంది. అయితే ఈ పాస్ ప్రైవేటు వాహనాలకే వర్తిస్తుంది. వాణిజ్య(కమర్షియల్) వాహనాలు, ట్యాక్సీలకు వర్తించదు. అలాగే.. ఒక వాహనానికి జారీ చేసిన పాస్‌ను మరొ క వాహనానికి బదిలీ చేయడం కూడా వీలుకాదు. వాహన రిజిస్ట్రేషన్ నంబరు (వీఆర్ఎన్)తో రిజిస్టర్ చేసిన ఫాస్టాగ్‌పై మాత్రమే ఈ పాస్ వర్తిస్తుంది. చాసిస్ నంబరుతో రిజిస్టర్ చేసిన ఫాస్టాగ్‌లకు వర్తించదు. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ఇతర లోకల్, ప్రైవేట్ టోల్ ప్లాజాల వద్ద మాత్రం సాధారణ ఫాస్టగ్ మాదిరిగానే చార్జీలు వసూలు చేస్తారు. వార్షిక పాస్ తీసుకున్న వాహనదారులకు టోల్‌గేట్ దాటిన ప్రతిసారి ఒక ట్రిప్‌గా పరిగణిస్తారు. క్లోజ్డ్ టోల్ గేట్ వద్ద మాత్రం ఎంట్రీ-ఎగ్జిట్ కలిపి ఒకే ట్రిప్‌గా లెక్కిస్తారు. అయితే ఈ వార్షిక పాస్ కోసం మళ్లీ కొత్తగా ఫాస్టాగ్ రిజిస్టర్ చేసుకోవాల్సిన పనిలేదు. ఇప్పటికే ఉన్న ఫాస్టాగ్‌పైనే యాక్టివేట్ చేసుకోవొచ్చు. అయితే అది బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు. ఇప్పటికే ఫాస్టాగ్ వాలెట్‌లో బ్యాలెన్స్ ఉంటే దాన్ని ఉపయోగించి ఈ పాస్‌ను కొనుగోలు చేయలేరు.

ఎక్కువగా తిరిగే వారికి మేలు

వార్షిక పాస్ పథకం అనేది ఎక్కువగా ప్రయాణాలు చేసే వారికి ఎంతో ప్రయోజనం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన మధుకర్ తన ఆఫీసు అవసరాల దృష్ట్యా నెలలో కనీసం 2 సార్లు హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వెళ్తొస్తారు. వెళ్లేటప్పుడు నాలుగు టోల్‌గేట్లలో కలిపి దాదాపు రూ.400 వరకు ఖర్చవుతుంది. మర్నాడు అక్కడ పని ముగించుకొని (24 గంటల తర్వాత) తిరుగు ప్రయాణంలో మరో రూ.400 కట్టాలి. అంటే ఒక ట్రిప్‌కే రూ.800. అంటే.. నెలకు 4 టోల్‌గేట్ల మీదుగా 16 ట్రిప్పుల చొప్పున ఏడాదికి 192 ట్రిప్పులు అవుతాయి. ఇందుకు మదుకర్ రూ.19,200 కడుతున్నారు. ఆయన ఒకవేళ రూ.3వేలు కట్టి వార్షిక పాస్‌ను తీసుకుంటే రూ.16,200 మిగులుతాయి. ఈ పాస్ గురించి తెలిసి మధుకుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

"ప్రజల ప్రయాణ ఖర్చును తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకొస్తున్నాం. ఫాస్టాగ్ వినియోగంలో మరింత పారదర్శకత, వేగవంతమైన ప్రయాణాలకు ఇది దోహదం చేస్తుంది" అని కేంద్ర రవాణ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

'సృష్టి' మోసాలు..

10 కేసులు నమోదైనా పట్టించుకోని పోలీసులు

- ఆ అలసత్వంతో జోరుగా నమ్రత అక్రమాలు
- పరిశీలిస్తున్న హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ క్లినిక్‌పై గతంలోనే 10 దాకా కేసులు నమోదైనా.. పోలీసులు పట్టించుకోకపోవడంతోనే నమ్రత అరాచకాలు పెరిగిపోయినట్లు అధికారులు గుర్తించారు. పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకొనిసరోగసి పేరుతో డాక్టర్ నమ్రత సృష్టించిన అరాచకాలను చూసి అవాక్కవుతున్నారు. సికింద్రాబాద్ గోపాలపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్న సృష్టి ఫర్టిలిటీ మోసం కేసులో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. సృష్టి ఫర్టిలిటీపై గతంలోనే కేసులు నమోదైనా.. ఏడేళ్ల క్రితమే సృష్టి క్లినిక్ లైసెన్స్‌ను వైద్యాధికారులు రద్దు చేసినా.. నమ్రత అరాచకాలు ఆగలేదు. ఈ చర్యలతో సృష్టి మోసాలకు కొంత వరకు తెరపడ్డా.. ఏపీలోని వైజాగ్‌కు మకాం మార్చిన నమ్రత.. అక్కడ కార్యకలాపాలను కొనసాగించారు. అక్కడ కూడా ఆమెపై కేసులు నమోదవగా.. కొవిడ్ సమయంలో పోలీసులను మేనేజ్ చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. దాంతో నమ్రత విజయవాడ, నెల్లూరుతోపాటు.. కర్ణాటక, ఒడిసా, కోల్‌కతాల్లోనూ బ్రాంచిలను ఏర్పాటు చేసి.. అక్రమాల దందాను కొనసాగించారు.

అప్పుడే స్పందించి ఉంటే..

సృష్టిలో నమ్రత అక్రమాలపై తెలుగు రాష్ట్రాల్లో నమోదైన కేసులను పోలీసులు, వైద్యాధికారులు పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. అప్పట్లోనే నమ్రతపై చర్యలు తీసుకుని ఉంటే.. అక్రమాలకు ఎప్పుడో తెరపడి ఉండేదని తెలుస్తోంది. దీంతో హైదరాబాద్ పోలీసులు విశాఖలోని మహారాణిపేట, టూటౌన్, గుంటూరు, హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ, గోపాలపురం ఠాణాల్లో నమోదైన కేసులపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ కేసులో బలమైన ఆధారాలను సేకరించనున్నట్లు సమాచారం. తెలంగాణలో క్లినిక్ లైసెన్సు రద్దవ్వడంతో నమ్రత ఇతర ప్రాంతాల్లోనే తనదందాపై దృష్టి సారించేవారు. సికింద్రాబాద్‌లో దంపతులకు కేవలం కౌన్సెలింగ్ ఇచ్చేవారు. వైజాగ్‌లోనే అంతా జరిగేది. విశాఖకు దంపతులను తీసుకెళ్లి.. అక్కడ వీర్యం, అండాలను సేకరించేవారు. దాన్ని సరోగసి తల్లి గర్భంలోకి చేర్చి, ఆమె నిర్వహణ ఖర్చుల పద్దులను చూపిస్తూ.. అంతా సవ్యంగానే జరుగుతోందని నమ్మబలికేవారు. ఒప్పందం ప్రకారం.. 9 నెలల తర్వాత ఆ దంపతులకు చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాల నుంచి కొనుగోలు చేసే శిశువులను అంటగట్టేవారు. ఇలా 80 శిశువులను అంటగట్టినట్లు సమాచారం.

ఆర్టీఈ కోటా సీట్లకు అదనపు నోటిఫికేషన్

- మిగిలిన సీట్ల భర్తీకి 12 నుంచి దరఖాస్తులు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు విద్యాహక్కు చట్టం కింద కేటాయించిన 25 శాతం సీట్లలో ఈ ఏడాది కొన్ని సీట్లు మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో ఒకటో తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం శనివారం అదనపు నోటిఫికేషన్ జారీ చేసింది. అడ్మిషన్ల కోసం ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దరఖాస్తులను పరిశీలించి 21న విద్యార్థుల అర్హతను నిర్ధారిస్తారు. 25న లాటరీ ద్వారా ఫలితాలను ప్రకటిస్తారు. 31న పాఠశాలల్లో అడ్మిషన్లను ఖరారు చేస్తారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌కు కొనసాగింపుగా ఈ అదనపు నోటిఫికేషన్ జారీ చేసినట్టు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

400 కోట్లతో పేదలకు 10 వేల ఇళ్లు

- తల్లి ఆశయం కోసం కేజీఎఫ్ బాబు నిర్ణయం
- సహకరించాలని ప్రభుత్వ అధికారులకు లేఖ


కేజీఎఫ్ బాబు

బెంగళూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తన తల్లి ఆశయాన్ని నెరవేర్చేందుకు బెంగళూరు నగర పరిధిలో రూ.400 కోట్లతో 10 వేల ఇళ్లను పేదలకోసం నిర్మించనున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త కేజీఎఫ్ బాబు (యూసుఫ్ షరీఫ్) వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంలో ఇప్పటికే బీబీఎంపీ చీఫ్ కమిషనర్ మహేశ్వర రావు, ఇతర అధికారులకు లేఖలు పంపామని తెలిపారు. గడిచిన శాసనసభ ఎన్నికలలో పోటీ చేసినప్పుడు పేదలకు ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చానని, అందుకు అనుగుణంగానే ప్రాజెక్టును ప్రారంభించదలిచానని పేర్కొన్నారు. ఆ రూ.400 కోట్లు తమ అనుబంధ సంస్థల నిధులనే ఉపయోగిస్తామని వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తికి బీబీఎంపీ, ఐటీ, నగర పోలీసు శాఖలు సహకరించాలని కోరారు. ఉమ్రా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు అనుబంధంగా ఉమ్రా డెవలపర్స్, అఫ్నాన్ కన్‌స్ట్రక్షన్స్, జామ్ జామ్ బిల్డర్స్, జుమేరా కన్‌స్ట్రక్షన్స్, జై డెవలపర్స్ వంటి కంపెనీలు తమకు అనుబంధంగా ఉన్నాయని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

30 ఏళ్ల క్రితం అమలు చేసిన జన్మభూమి పథకానికీ పీ–4కీ పోలిక లేదు. మీరు ఇన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తే మార్గదర్శులుగా ఎంపికవుతున్న వారికి కోపం రాకుండా ఉంటుందా? జిల్లా కలెక్టర్లకు టార్గెట్లు విధించడం వల్ల వారు వివిధ శాఖల అధికారులకు ఆ టార్గెట్లు పంచుతున్నారు. ఇప్పుడు గ్రామ స్థాయిలో కూడా మార్గదర్శులను ఎంపిక చేయమంటున్నారట! ఇందుకోసం రెవెన్యూ అధికారులను ప్రయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులపై కూడా వ్యతిరేకత ఏర్పడుతోంది. గ్రామాలలో రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో మనకు తెలిసిందే. రైతులను ఆదుకోవడానికి 'అన్నదాత సుఖీభవ' అమలు చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు బంగారు కుటుంబాల బాధ్యత అప్పగించాలని అనుకోవడం ఏమిటి? ఇలాంటి తల తిక్క పనుల వల్లే కదా ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడేది? ఈ నెల 19న ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ లోపు చంద్రబాబు మేల్కొని పీ–4 అమలు వల్ల తనకు లాభమా? నష్టమా? అన్నది సమీక్షించుకోవడం మంచిది.

పీ-4 పిచ్చిలో చంద్రబాబు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పుడప్పుడూ నేల విడిచి సాము చేయాలని ఉబలాటపడుతుంటారు. ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ తలమాసిన సలహాలు ఇవ్వడానికి ఎవరో ఒకరు తయారవుతారు. ఆచరణ సాధ్యం కాని ఇలాంటి ఆలోచనలంటే చంద్రబాబుకు మా చెడ్డ ఇష్టం. ఈ బలహీనతను గుర్తించిన కొందరు ప్రతి టర్మ్‌లో పక్కన చేరి దిక్కుమాలిన ప్రణాళికలు రూపొందించి ఆయనను అందులోకి లాగుతారు. దీంతో పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు ఆయనకు రాజకీయంగా నష్టం జరుగుతుంది. ఏ నాయకుడైనా ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి గానీ, ప్రజలకు దూరమయ్యే సలహాలు, సూచనలు ఎవరు అందించినా పట్టించుకోకూడదు. జగన్‌రెడ్డి పాలనలో అష్టకష్టాలు పడి చివరకు జైలుకు కూడా వెళ్లిన చంద్రబాబు నాయుడు, ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. దీంతో గతంలో చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వనని, 1995–1999 మధ్య కాలంలో తాను ఎలా వ్యవహరించానో ఇకపై అలాగే వ్యవహరిస్తానని ఆయన నమ్మబలికారు. 1999–2004 మధ్య కీర్తి కండూతికి అలవాటు పడిన ఆయన సంస్కరణల పేరిట ప్రజలకు దూరమయ్యారు. ప్రజా నాయకుడిగా కాకుండా రాష్ట్రానికి సీఈవో అని పిలిపించుకోవడానికే ఇష్టపడ్డారు. దీంతో 2004లో అధికారం కోల్పోయిన ఆయన రాష్ట్ర విభజన తర్వాత 2014లో గానీ తిరిగి అధికారంలోకి రాలేకపోయారు. ఆ సమయంలో రియల్ టైం గవర్నెన్స్ అంటూ రాజకీయాలను విడిచిపెట్టి సమావేశాలు, సమీక్షలతో గడిపేశారు. ప్రత్యర్థుల రాజకీయ ఎత్తుగడలను పట్టించుకోలేదు. ఫలితంగా 2019లో 23 సీట్లకే పరిమితం అయ్యారు. జగన్మోహన్‌రెడ్డి స్వయం కృతాపరాధంతో 2024లో చంద్రబాబు కూటమి ఎగిరిన మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. ఈ పర్యాయం అయినా ఆయన ప్రాక్టికల్‌గా, రాజకీయ నాయకుడిగా మారి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తారని అందరూ ఆశించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత అనుభవాలు మరచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఊదరగొట్టారు. దీనిపై విమర్శలు రావడంతో ఈ మధ్య తన ధోరణిని మార్చుకున్నారు. ఇంతలోనే ఆయన పీ–4 అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఈ దిక్కుమాలిన సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు గానీ 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసే పీ–4 విధానాన్ని అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్నారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ తమ లక్ష్యమని ఆయన చెప్పుకొంటున్నారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న 20 శాతం పేదలను రాష్ట్రంలో ఉన్న పది శాతం ధనవంతులు ఆదుకోవాలి, ఆయా కుటుంబాలను సదరు ధనవంతులు దత్తత తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారు. లబ్ధి పొందే కుటుంబాలను 'బంగారు కుటుంబాలు', దత్తత తీసుకొనే ధనికులను 'మార్గదర్శులు' అని ముద్దుగా పేర్లు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు పది లక్షల 92 వేల బంగారు కుటుంబాలను, లక్షా 67 వేల మంది మార్గదర్శులను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయాల్సిన కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చివేశారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ అన్న లక్ష్యం ఆచరణ సాధ్యమా? అని కనీస ఆలోచన చేయకుండా మార్గదర్శులకు బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు.

చెంపదెబ్బ.. గోడదెబ్బ!

పేదరికం లేని సమాజం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఉంటుందా? మన దగ్గర ఎలా సాధ్యం అన్న సందేహం ఎందుకు కలగలేదో తెలియదు. ప్రభుత్వాన్ని భ్రష్టుపట్టించే ఇలాంటి సలహాలు ఇచ్చినవారి జ్ఞానం ఏపాటిదో దీన్ని బట్టి అర్థమవుతోంది. 1995లో ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అప్పట్లో దీనికి మంచి స్పందన వచ్చింది. ఆయా గ్రామాల్లో పుట్టి పెరిగి ఉన్నత స్థానాలకు చేరినవారు ప్రేరణ పొంది తమ స్వగ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)' పథకాన్ని తీసుకురాలేదు. ఆ తర్వాత కార్పొరేట్ కంపెనీలు తమ లాభాల్లో రెండు శాతం మొత్తాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఎంపిక చేసిన కార్యక్రమాలకు విధిగా ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. దీంతో లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలు, సంస్థలు తమ లాభాల్లో రెండు శాతాన్ని సమాజ హితం కోసం ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడు ఈ పథకం అమలులో ఉండగానే వ్యక్తులకు లబ్ధి చేకూర్చే పీ–4 పథకాన్ని చంద్రబాబుకు ఎవరు అంటగట్టారు? నిజానికి సీఎస్‌ఆర్ నిబంధన లేనప్పుడు కూడా మనసున్న దాతలు ముందుకు వచ్చి పేదలను ఆదుకున్నారు. విద్య–వైద్య రంగాలకు తమ వంతు సాయం చేసేవారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయాల్సిన సహాయాన్ని నిర్బంధం చేయాలనుకోవడమే తప్పు. ప్రభుత్వం–ప్రైవేట్–ప్రజల భాగస్వామ్యంతో కూడినదే పీ–4. దీంతో ఇది కలగాపులగంగా మారింది. ముందుగా ఈ పథకం వల్ల ప్రభుత్వానికి రాజకీయంగా జరిగే నష్టం విషయానికి వద్దాం. రాష్ట్రంలో పేదరికంలో ఉన్న కుటుంబాల సంఖ్య ఎంత? అన్నది ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటే రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను కట్టే మరికొందరిని మినహాయిస్తే మిగతా అందరూ పేదరికంలో ఉన్నట్టే! వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోంది. ఈ లెక్కన కనీసం కోటి కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయవలసి ఉంటుంది. ప్రస్తుతానికి పదకొండు లక్షల కుటుంబాలను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. అలా అయితే మిగతా 89 లక్షల కుటుంబాల పరిస్థితి ఏమిటి? వారంతా ప్రభుత్వానికి దూరం కారా? ఏ పథకాన్నయినా అందరికీ వర్తింపజేసినప్పుడే రాజకీయంగా ఫలితాలు లభిస్తాయి. అరకొరగా అమలు చేస్తే ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. తాను స్వయంగా 250 బంగారు కుటుంబాలను కుప్పంలో దత్తత తీసుకుంటానని చంద్రబాబు చెప్పారు. అలా అయితే కుప్పం నియోజకవర్గంలో ఉన్న మిగతా పేద కుటుంబాలు కినుక వహించవా? కాగా, బంగారు కుటుంబాల ఎంపిక కూడా శాస్త్రీయంగా జరగడం లేదు. కొన్నిచోట్ల మార్గదర్శిగా గుర్తించిన వారికంటే అధిక ఆస్తులు కలిగి ఉన్న వారిని కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేర్చారు. ఒక మార్గదర్శికి కొన్ని కుటుంబాల వంతున ప్రభుత్వం కేటాయిస్తుంది. బంగారు కుటుంబాల సంఖ్య పెరిగేకొద్దీ మార్గదర్శుల సంఖ్య కూడా పెరగాల్సి ఉంటుంది. దీంతో జిల్లా స్థాయి అధికారులకు మార్గదర్శుల సంఖ్య విషయంలో టార్గెట్ పెట్టారు. బంగారు కుటుంబాల ఎంపిక గందరగోళంగా ఉందనుకుంటే మార్గదర్శుల ఎంపికకు కూడా టార్గెట్లు విధించడంతో సహాయం చేయాలనుకున్న వారు కూడా ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు. దీంతో ప్రభుత్వం పరిస్థితి 'చెంపదెబ్బ–గోడదెబ్బ'గా మారుతోంది. బంగారు కుటుంబంగా ఎంపిక కాని వారు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టకుండా ఉంటారా? అదే సమయంలో తమను బలవంతంగా మార్గదర్శులుగా ఎంపిక చేయడాన్ని దాతలు కూడా ఆక్షేపిస్తున్నారు. మద్యం షాపులు నడిపే వారిని, చిన్నా చితకా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని కూడా మార్గదర్శులుగా ఎంపిక చేస్తున్నారు. స్వచ్ఛందంగా సాగాల్సిన కార్యక్రమాలలో ప్రభుత్వం తలదూరిస్తే ఇలాగే ఏడుస్తుంది. బంగారు కుటుంబాల ఎంపిక బాధ్యతను గ్రామ సచివాలయాలకు కూడా అప్పగించారట. వారు తమ గ్రామంలో నిరుపేద కుటుంబాలు ఉన్నాయా అని పరిశీలించి ఎంపిక చేయకుండా ఎమ్మెల్యేల నుంచి వస్తున్న జాబితాలను పైస్థాయి అధికారులకు పంపుతున్నారు. ఇప్పటివరకు ఎంపికైన బంగారు కుటుంబాలలో 26 శాతం వరకు అనర్హులని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. లోతుగా పరిశీలిస్తే ఇంకెంత మంది అనర్హులు తేలుతారో తెలియదు. లబ్ధిదారులుగా మారబోతున్న బంగారు కుటుంబాలకు ఏ అవసరాలు ఉంటాయో తెలుసుకోవడానికి ప్రాథమిక సర్వే చేయగా 31 శాతం మంది ఉద్యోగాలు కావాలని, 22 శాతం మంది వైద్య సహాయం కావాలని, 9 శాతం మంది వ్యాపారం చేసుకోవడానికి పెట్టుబడి కావాలని కోరగా, మిగతా వారు తమ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అంటే, ఒక బంగారు కుటుంబం భారాన్ని మొత్తం మార్గదర్శి భరించాలన్నమాట. ఆర్థికంగా

కొంత మంది ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు. వారిని ఎలా కట్టడి చేయాలో కూటమి భాగస్వామ్య పక్షాలు ఆలోచించుకోవాలి. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగితే దిద్దుబాటు చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. ప్రజలు ఎదురొచ్చి మీ పని తీరు బాగోలేదని ఎప్పుడూ చెప్పరు. చెప్పాల్సిన రోజే చెబుతారు.

ఉన్నత స్థానంలో ఉన్నవారు పేదరికంలో ఉన్న తమ రక్త సంబంధీకులను కూడా పట్టించుకోని రోజులివి! ఏదైనా ఒక పథకానికి రూపకల్పన చేసే ముందు అది ఎంతవరకు ఆచరణ సాధ్యం? సదరు పథకం వల్ల ప్రజలకు జరిగే మేలెంత? ప్రభుత్వానికి రాజకీయంగా కలిగే ప్రయోజనం ఎంత? అని బేరీజు వేసుకోవాలి కదా? ప్రజలతో సంబంధం లేకుండా క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలియనివారు ఇచ్చే సలహాలను గుడ్డిగా ఆచరించి అమలు చేస్తే నష్టం తప్పదు. ఇటు పేదలను పూర్తి స్థాయిలో సంతృప్తిపరచలేని విధంగా, అటు మార్గదర్శులుగా ఎంపిక చేస్తున్న వారికి నిర్బంధంగా బాధ్యతలు అప్పగించడం వల్ల ఉభయభ్రష్టత్వం తప్పదు.

ప్రకృతి విరుద్ధ ఆలోచన!

పేదలను ఆదుకోవడం వేరు. పేదరికమే లేకుండా చేయడం వేరు. ఇలాంటి ఆలోచనే ప్రకృతి విరుద్ధం. పేదరికం



లేని సమాజం సృష్టించడం అంత సులువైతే సంపన్న దేశాల్లోనూ పేదరికం ఎందుకు ఉంటోంది. అక్కడ కూడా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు కదా! నిర్బంధ విధానం ఏదీ కూడా సక్సెస్ కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు పీ–4ను పట్టుకొని వేలాడుతున్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులను పిలిపించుకొని గంటలకొద్దీ చర్చలు జరుపుతున్నారు. సదరు సమావేశాలలో ఒకరిద్దరు పారిశ్రామికవేత్తల గొప్పదనాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావిస్తుండటంతో మిగతా వారు చిన్నబుచ్చుకుంటున్నారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశాలకు వెళ్లిన వారిలో పలువురు ఇదెక్కడి తద్దినం అని తిట్టుకుంటున్నారు. బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారికి సంక్షేమ పథకాలు ఆపేస్తారా? అంటే అదీ లేదు. అంటే, వారికి డబుల్ బొనాంజా అన్న మాట! అలాంటప్పుడు మిగతా వారికి కడుపు మంట ఉండటం సహజం. 30 ఏళ్ల క్రితం అమలు చేసిన జన్మభూమి పథకానికీ దీనికీ పోలిక లేదు. మీరు ఇన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తే మార్గదర్శులుగా ఎంపికవుతున్న వారికి కోపం రాకుండా ఉంటుందా? జిల్లా కలెక్టర్లకు టార్గెట్లు విధించడం వల్ల వారు వివిధ శాఖల అధికారులకు ఆ టార్గెట్లు పంచుతున్నారు. ఈ క్రమంలోనే టీచర్లు కూడా మార్గదర్శులుగా మారాలంటూ కొన్నిచోట్ల ఉత్తర్వులివ్వడాన్ని చూశాం. దీనిపై విమర్శలు రావడంతో అధికారులు వెనక్కు తగ్గారు. ఇప్పుడు గ్రామ స్థాయిలో కూడా మార్గదర్శులను ఎంపిక చేయమంటున్నారట! ఇందుకోసం రెవెన్యూ అధికారులను ప్రయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులపై కూడా వ్యతిరేకత ఏర్పడుతోంది. గ్రామాలలో రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో మనకు తెలిసిందే. రైతులను ఆదుకోవడానికి 'అన్నదాత సుఖీభవ' అమలు చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు బంగారు కుటుంబాల బాధ్యత అప్పగించాలని అనుకోవడం ఏమిటి? ఇలాంటి తల తిక్క పనుల వల్లే కదా ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడేది? ఈ నెల 19న ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ లోపు చంద్రబాబు మేల్కొని పీ–4 అమలు వల్ల తనకు లాభమా? నష్టమా? అన్నది సమీక్షించుకోవడం మంచిది. ముఖ్యమంత్రి మెప్పు కోసం ఎవరెవరో ఏవేవో సలహాలు ఇస్తుంటారు. అలా వచ్చే సలహాలలో వేటిని పరిగణనలోకి తీసుకోవాలి? వేటిని విస్మరించాలి? అన్న ఇంగితం ప్రభుత్వానికి ఉండాలి కదా? ఈ పథకం అమలు పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన సంస్థకు వైస్ ఛైర్మన్‌గా సి.కుటుంబరావు అనే ఆయనను నియమించారు. ఆయన ముఖ్యమంత్రి మెప్పు పొందడం కోసం జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు పోస్తు చేసి టార్గెట్లు విధిస్తున్నారని చెబుతున్నారు. మార్గదర్శుల ఎంపిక కోసం వ్యాపారులు, ఇతర సంపన్న వర్గాలతో ప్రభుత్వపరంగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశాలకు వెళుతున్న ముఖ్యమంత్రి గంటలకొద్దీ సమయం వెచ్చిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఖర్చు తప్పితే పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు అసలు పనులు వదిలేసి మార్గదర్శుల వేటలో బిజీగా ఉంటున్నారు. మంత్రివర్గ సమావేశంలో కూడా ఈ పథకం గురించి చర్చించిన దాఖలాలు లేవు. స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి చేయాల్సిన పనులను ప్రభుత్వ కార్యక్రమాలుగా మార్చడమే తప్పు. విచిత్రం ఏమిటంటే, మంత్రులు గానీ, సీనియర్ అధికారులు గానీ ఈ పథకం మంచిచెడులను ముఖ్యమంత్రికి చెప్పలేకపోతున్నారు. ఈ కారణం వల్లనే ఆచరణ సాధ్యం కాని పథకాలు పురుడుపోసుకుంటాయి. చివరికి రాజకీయంగా మూల్యం చెల్లించుకుంటారు.

ఏ పథకాన్నయినా అందరికీ వర్తింపజేసినప్పుడే రాజకీయంగా ఫలితాలు లభిస్తాయి. అరకొరగా అమలు చేస్తే ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. తాను స్వయంగా 250 బంగారు కుటుంబాలను కుప్పంలో దత్తత తీసుకుంటానని చంద్రబాబు చెప్పారు. అలా అయితే కుప్పం నియోజకవర్గంలో ఉన్న మిగతా పేద కుటుంబాలు కినుక వహించవా? కాగా, బంగారు కుటుంబాల ఎంపిక కూడా శాస్త్రీయంగా జరగడంలేదు. కొన్నిచోట్ల మార్గదర్శిగా గుర్తించిన వారికంటే అధిక ఆస్తులు కలిగి ఉన్న వారిని కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేర్చారు. ఒక మార్గదర్శికి కొన్ని కుటుంబాల వంతున ప్రభుత్వం కేటాయిస్తుంది. బంగారు కుటుంబాల సంఖ్య పెరిగేకొద్దీ మార్గదర్శుల సంఖ్య కూడా పెరగాల్సి ఉంటుంది. దీంతో జిల్లా స్థాయి అధికారులకు మార్గదర్శుల సంఖ్య విషయంలో టార్గెట్ పెట్టారు. బంగారు కుటుంబాల ఎంపిక గందరగోళంగా ఉందనుకుంటే మార్గదర్శుల ఎంపికకు కూడా టార్గెట్లు విధించడంతో సహాయం చేయాలనుకున్న వారు కూడా ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు. దీంతో ప్రభుత్వం పరిస్థితి 'చెంపదెబ్బ–గోడదెబ్బ'గా మారుతోంది. బంగారు కుటుంబంగా ఎంపిక కాని వారు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టకుండా ఉంటారా?

అరాచకానికి అడ్డుకట్ట పడాలి!

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఫోకస్ చేయాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. దారి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెడతారని ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తారన్న నమ్మకం ప్రజలకు ఆయనపై ఉంది. ఈ దిశలో ఫలితాలు రావాలంటే సమయం పడుతుంది. ప్రజలు కూడా అర్థం చేసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకొంటున్నారు. మంచి ప్రభుత్వంలో ప్రజలను పీడించకూడదు. కూటమి తరపున ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు ప్రజాకంటకులుగా మారారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేల కంటే అరాచకంగా వ్యవహరిస్తున్నారన్న భావన ఇప్పుడిప్పుడే ప్రజల్లో ఏర్పడుతోంది. నియోజకవర్గాలలో ఏ పనులు జరగాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. ఏ పని కోసం అధికారుల వద్దకు వెళ్లినా ఎమ్మెల్యే గారితో చెప్పించండి అని అంటున్నారు. అధికారులు రొటీన్‌గా చేయాల్సిన పనులకు ఎమ్మెల్యే సమ్మతి ఎందుకు? రిజిస్ట్రేషన్లు జరగాలన్నా, మున్సిపాలిటీలలో ఇంటి ప్లాన్ ఆమోదం పొందాలన్నా కూడా ఎమ్మెల్యేల జోక్యం ఏమిటి? ఇక రెవెన్యూ వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యం సంగతి చెప్పాల్సిన పనిలేదు. లేఔట్లు వేసి వ్యాపారం చేయాలన్నా, భూ వినియోగ మార్పిడి జరగాలన్నా ఎమ్మెల్యేలకు కప్పం కట్టాలా? మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి మహాప్రభో అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు కనిపించిన వారినందరినీ వేడుకుంటున్నారు. ఎమ్మెల్యేలు మాత్రం తమ నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేద్దామనుకుంటున్న వారిని 'మా సంగతి ఏమిటి?' అని వేధిస్తున్నారు. ప్రభుత్వపరమైన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరించడం వంటివి ఇవాళ కొత్త కాదు. కొంతమంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తామే చక్రవర్తులం అన్నట్టుగా భావిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో కేసు కట్టాలన్నా ఎమ్మెల్యే అనుమతి ఉండాలా? ఈ దుష్ట సంస్కృతి నానాటికీ వికృత రూపం సంతరించుకుంటోంది. ఇలాంటి చెత్త పనులు చేయడం వల్లనే గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్నవారు ఓడిపోయారు అని తెలిసి కూడా ఆత్మపరిశీలన ఎందుకు చేసుకోరో తెలియదు. కేవలం ఐదేళ్ల కాలానికే తాము ఎన్నికయ్యామన్న స్పృహ లేకుండా విర్రవీగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. తమ ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకొనే ప్రయత్నాన్ని కూటమి నాయకులు వెంటనే చేయాలి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఫీల్‌గుడ్ భావన ఉందో లేదో తెలుసుకోవాలి. అలాంటి భావన లేని పక్షంలో సంక్షేమ పథకాలు అమలు చేసినా, అభివృద్ధి చేసినా ఫలితం ఉండదు. ప్రస్తుతానికి కొంత మంది ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు. వారిని ఎలా కట్టడి చేయాలో కూటమి భాగస్వామ్య పక్షాలు ఆలోచించుకోవాలి. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగితే దిద్దుబాటు చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. ప్రజలు ఎదురొచ్చి మీ పని తీరు బాగోలేదని ఎప్పుడూ చెప్పరు. చెప్పాల్సిన రోజే చెబుతారు. పీ–4 పథకం విషయమే తీసుకుందాం. బంగారు కుటుంబాల బాధ్యత తీసుకోవడానికి ఎంపిక అవుతున్న మార్గదర్శుల అభిప్రాయం తెలుసుకొనే ప్రయత్నం చేస్తే ఆ పథకం విషయంలో ముందుకు వెళ్లాలో లేదో తెలిసిపోతుంది. ఉపాధి కల్పించండి అని వ్యాపార, పారిశ్రామికవేత్తలను కోరడం వేరు. దత్తత తీసుకొని వారి ఆలనా పాలనా మొత్తం చూడాలని కోరడం ఏమిటి? ప్రజలను పని సంస్కృతికి దూరం చేయడం వల్ల జరుగుతున్న అనర్థాలను తెలుగు రాష్ట్రాలు అనుభవిస్తున్నాయి. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు కూడా దొరకడం లేదు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాలకు చెందినవారు వచ్చి మన దగ్గర పనులు చేసుకుంటున్నారు. వారు కూడా లభించని రోజున పరిస్థితి ఏమిటో ఊహించుకోండి. పని సంస్కృతిని పెంపొందించకుండా కూర్చోబెట్టి పెట్టాలనుకోవడం బాధ్యతారాహిత్యం. మన పిల్లల్ని అలాగే పెంచుతామా? చంద్రబాబుతో వచ్చిన తంటా ఏమిటంటే, ఆయన ఏది పట్టుకుంటే దాని వెనకాలే పరిగెడతారు. ఇంకోవైపు చూడరు. 1999–2004 మధ్య ప్రజలను సమాయత్తం చేయకుండా సంస్కరణలను అమలుచేసి దెబ్బతిన్నారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో పేదరికమే ఉండకూడదన్న పాట పాడుతున్నారు. అలా చెయ్యడం సాధ్యం అని ఎవరు చెప్పారో తెలియదు గానీ వారి పేరు తెలుసుకోవాలని ఉంది. గత ప్రభుత్వం ఎందుకు అధికారం కోల్పోయిందో ఒక పుస్తకంలో రాసుకుంటే, ఇప్పుడు తాము ఏం చేయాలో, ఏమి చేయకూడదో, ప్రజలు తమ నుంచి ఏమి ఆశిస్తున్నారో కూటమి నాయకులకు తెలుస్తుంది. అలా కాకుండా నేల విడిచి సాము చేస్తామని మంకుపట్టు పడితే పర్యవసానాలకు కూడా సిద్ధం కావాలి. ఫలానా వారికి, ఫలానా జిల్లాలో పీ–4 బాధ్యత అప్పగిస్తున్నానని చంద్రబాబు ఆ మధ్య ప్రకటించారు. ఒకరో ఇద్దరో వారు ఏ స్థాయి పారిశ్రామికవేత్తలైనా ఒక జిల్లాలో పేదరికం లేకుండా చేయగలరా? అది అంత సులువైతే అంతటి మహత్తర సలహా ఇచ్చినవారిని సన్మానించాల్సిందే. ప్రపంచ దేశాలకు కూడా మీరు ఆదర్శం అవుతారు. దిక్కుమాలిన సలహాలు ఇచ్చేవారి విషయంలో కూటమి నేతలు జాగ్రత్తగా ఉండాలి. సలహాలు ఇచ్చేవారు సేఫ్‌గానే ఉంటారు. ఆచరణ సాధ్యంకాని సలహాలను అమలు చేస్తే మునిగేది కూటమి పార్టీ నాయకులే.

ప్రజల మనసెరిగి మెలగాలి!

రాజధాని అమరావతి విషయంలో కూడా గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై వెంటనే దృష్టిసారించాలి. లేని పక్షంలో మీపై పూలు చల్లిన రైతులే రాళ్లు విసిరినా ఆశ్చర్యం లేదు. సీఆర్‌డీఏ నిబంధనల గురించి రైతులకు పూర్తిగా తెలియదు. తెలిస్తే వారు ఆందోళన చేస్తారు. నమ్మిన రైతులను అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం మంచిది కాదు. తన కళ్లకు గంతలు కట్టాలనుకుంటున్న వారి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అలెర్ట్‌గా ఉండాలి. అంతా నాకు తెలుసులే అని అనుకుంటే అది ఆయన ఇష్టం. నేల విడిచి సాము చేసే ప్రయత్నాలకు స్వస్తి చెప్పి ప్రభుత్వ వ్యవహారాలలో, అంటే అనుమతుల మంజూరులో విచక్షణాధికారాలను రద్దు చేయడంతో పాటు ఎమ్మెల్యేల జోక్యం లేకుండా చేయగలిగితే ప్రజలు హర్షిస్తారు. ప్రజల్లో ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్న భావన కలిగేలా పాలనా సంస్కరణలు తీసుకువచ్చి వేధింపుల నుంచి ప్రజలను విముక్తి చేయడంపై చంద్రబాబు దృష్టి సారించాలి. ప్రజల మెప్పు పొందినప్పుడే రాజకీయంగా మేలు జరుగుతుంది. ప్రజల మనసెరిగి వ్యవహరించండి!

సాహిత్య భావుకుని మేధో దీప్తిధార


నివాళి

విశిష్ట సాహిత్య కృషి చేసిన అరుదైన ధీమంతుడు కోడూరి శ్రీరామమూర్తి. సాహిత్య విమర్శ, కథ, నవల, బాల సాహిత్యం, పరిశోధన, పత్రికా రచనలో తనదైన ముద్ర వేసిన మేధావి కోడూరి. గాంధేయవాద చింతకుడే అయినా భగత్‌సింగ్ విప్లవాదర్శాలు, మానవేంద్రనాథ్ రాయ్ నవ్యమానవవాదం, వల్లభ్ భాయ్ పటేల్ రాజనీతిజ్ఞత గురించి కూడా తెలుగువారికి స్ఫూర్తిదాయకంగా చెప్పిన విశాల భావుకుడు కోడూరి. ప్రపంచ మేధావులైన బెర్ట్రాండ్ రస్సెల్, హెన్రీ డేవిడ్ థోరో, జాన్ రస్కిన్, జాన్ స్టువర్ట్‌మిల్ వంటి వారి గురించి తెలుగులో మొదటిసారిగా విలువైన రచనలు చేసిన అపూర్వ ఆలోచనాశీలి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కడవరకూ తాను నమ్మిన మానవతావాద సిద్ధాంతానికి సాహిత్య రంగంలో చోటు కల్పించి, మనసా వాచా కర్మణా మనిషి ఉన్నతికి పాటుపడిన రచయిత కోడూరి శ్రీరామమూర్తి.

1941, సెప్టెంబరు 29న రాజమండ్రిలో దేశభక్తుల కుటుంబంలో కోడూరి జన్మించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా రాజమహేంద్రవరంలో మొదటిసారి తన స్వగృహంపై జాతీయ జెండా ఎగరవేసిన దేవతా శ్రీరామమూర్తి ఆయన తాతగారు. ప్రభుత్వం తనపై పెట్టిన అక్రమకేసుల్ని ఎదుర్కొని 'జెండా ఎగరేయడం నా జన్మహక్కు' అని దేవతా శ్రీరామమూర్తి స్వయంగా కోర్టులో వాదించుకుని కేసు గెలిచారు. ఆయన స్ఫూర్తితో రాజమహేంద్రి వాసుల గృహాలు మువ్వన్నెల జెండాతో రెపరెపలాడాయి. దేవతా శ్రీరామమూర్తిని 'జెండా ప్లీడరు' అని రాజమహేంద్రీయులు గౌరవించేవారు. దేశభక్తుడైన తాతగారి పేరే సాహితీవేత్త అయిన మనవడి పేరు.

కోడూరి శ్రీరామమూర్తి తండ్రి పుల్లేశ్వరరావు. తల్లి లీలావతిదేవి. బాల సాహిత్య సృజనలో కీర్తిగాంచిన తల్లి లీలావతి ప్రభావంతో మన కోడూరి చిన్న వయసులోనే 'నేనూ–నా చెల్లెలు' అనే రచన చేశారు. శ్రీరామమూర్తి విద్యార్థి దశ నుంచీ గాంధేయవాది. రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంతి సందర్భంగా 14 అధికారిక భాషల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన పుస్తక రచన పోటీల్లో కోడూరికి మొదటి బహుమతి వచ్చింది. అప్పటికి ఆయన వయసు కేవలం 19 ఏళ్ళు మాత్రమే. కోడూరి రచనా వ్యాసంగం అలా ప్రారంభమయింది.

అమెరికన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ వారి ప్రోత్సాహంతో పలు అనువాదాలు చేసిన శ్రీరామమూర్తి 'ఉదయరేఖ' అనే సాహిత్య పత్రికను స్వయంగా నిర్వహించారు. మూడు దశాబ్దాలకు పైగా బొబ్బిలి కళాశాలలో ఆర్థిక శాస్త్రం బోధించారు. అప్పట్లో కోడూరి శ్రీరామమూర్తి వ్యాసాలు 'భారతి'లో ఎక్కువగా వస్తుండేవి అంటే ఆయన సాహిత్య వ్యాసంగానికి ఆనాడే ఎంతటి గుర్తింపు లభించిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన రాసిన, 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' నాటికి నేటికి కూడా ఆ అంశం మీద తెలుగులో ఉన్న ఏకైక ఉద్గ్రంథం. ఆయన నవల 'నీటిలో నీడలు' వాషింగ్టన్‌లోని కాంగ్రెస్ లైబ్రరీలో ఎంపిక చేసి ఉంచిన అరుదైన తెలుగు పుస్తకాల్లో ఒకటి. వెలుగు వెన్నెల అనే వ్యాస సంపుటి, తెలుగు కథ నాడు– నేడు, మా మంచి తెలుగు కథ, రాగమాలిక, తెర తీయగరాదా కథా సంపుటి, బాలసాహిత్యంలో రవికవి, మహనీయుల జీవితంలో కథ కాని కథలు మొదలైనవి ఆయన ఇతర రచనలు. హేతు చింతనతో కూడిన జిజ్ఞాస కోడూరి రచనల్లో సువ్యక్తమవుతుండేది. వ్యక్తిగత నమ్మకాలతో సంబంధం లేకుండా శాస్త్రీయ దృష్టితో చరిత్రని, సాహిత్యాన్ని, సమాజాన్ని సమీక్షించడం కోడూరి ప్రత్యేకత. గాంధీజీ ప్రతిపాదించిన నూతన విద్యావిధానం, నైతిక ప్రవర్తనావళి, పౌర చైతన్యం, సామాజిక న్యాయం, సహాయ నిరాకరణోద్యమం, సహకార సంఘాలు, సర్వోదయ సిద్ధాంతం వంటివి యువత లోతుగా అధ్యయనం చేయాలని కోడూరి ఆశించేవారు.




కోడూరి శ్రీరామమూర్తి
29 సెప్టెంబర్ 1941 – 5 ఆగస్టు 2025

గాంధీ జీవితం, బోధనల గురించి కోడూరి తన జీవిత పర్యంతం సమున్నతమైన కృషి చేశారు. మహాత్మాగాంధీని బహుముఖ కోణాలలో ఆవిష్కరించిన తొలి తెలుగు రచయిత కోడూరి. కేవలం స్వాతంత్ర్య సమరయోధుడుగా మాత్రమే కాక ఒక సత్యాన్వేషిగా, పాత్రికేయుడిగా, పర్యావరణవేత్తగా, దార్శనిక ఆలోచనశీలిగా, రాజకీయవేత్తగా ఎన్నో రూపాల్లో మనకు తెలియని మహాత్ముడి గురించి ఆయన విస్తృతంగా రాశారు. బహుశా మరే ఇతర భారతీయ భాషా సాహిత్యంలో కూడా మహాత్మాగాంధీ గురించి ఇంత విలక్షణంగా వివరించినవారు ఎవరూ ఉండరేమో? అలనాటి 'ఆంధ్రజ్యోతి' వార పత్రికలో 'గాంధీజీ కథావళి' రాశారు. 'నేటికీ గాంధేయ మార్గం ఎలా అవసరమో' చెబుతూ ఒక సుప్రసిద్ధ దినపత్రికలో ఒక వ్యాస పరంపర రాశారు. గాంధీజీ దృక్పథానికి కట్టుబడి మొత్తం పదిహేను వరకూ పుస్తకాలు రాశారు.

'ఇప్పుడు నా వయస్సు ఎనిమిది దశాబ్దాలు దాటి తొమ్మిదో దశాబ్దంలో దాదాపుగా సగానికి వొచ్చింది. జారిపోకుండా ఉన్న జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుందామనే ఉద్దేశంతో ఆత్మకథ వ్రాయడం ప్రారంభించాను. ఇది చాలా విలువైనదని చెప్పడం లేదు. కానీ, ఒక తరంలో జీవించిన, ఇంకా జీవిస్తున్న ఒక వ్యక్తి జ్ఞాపకాలు కాబట్టి కొత్త తరం పాఠకులకు కొంతైనా ఉపయోగకరంగా ఉండవచ్చునని ఇది రాస్తున్నాను...' అంటూ 'తెగిన జ్ఞాపకాలు' పేరిట స్వీయ చరిత్ర మొదలుపెట్టిన కోడూరి శ్రీరామమూర్తి ఆగస్టు 5న సాయంత్రం అస్తమించారు. అముద్రితంగా ఉండిపోయిన ఆయన విశేష పరిశోధన 'స్వాతంత్ర్యానంతర యుగంలో వచన సాహిత్యం : సంప్రదాయం, ప్రయోగం'ను వెన్వెంటనే వెలుగులోకి తీసుకురావలిసిన అవసరమున్నది.

కోడూరి శ్రీరామమూర్తి సాత్విక స్వభావి. నైతిక విలువలతో నిండారిన, విప్పారిన సార్థక జీవితం ఆయనది. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, ఫ్రెంచ్ విప్లవం మొదలైన చారిత్రక అంశాలపై సాధికారికంగా రచించగల, ఉపన్యసించగల అరుదైన తెలుగు సాహిత్యకారుడు. జీవన సహచరి భారతి ఆకస్మిక మరణం అంతిమ దశలో ఆయన్ని కుంగదీసింది. ఆ దిగులుతోనే చివరివరకూ రచనా వ్యాసంగానికే అంకితమై అక్షరాలతోనే సహజీవనం చేస్తూ అంతిమ శ్వాస విడిచారు. రాజకీయ విప్లవాలు, భావ ఉద్యమాలు అన్నింటిపట్లా స్నేహపూరిత దృక్పథంతో వ్యవహరించిన కోడూరి నికార్సయిన ప్రజాస్వామ్యవాది. ఆయన మరణంతో గాంధేయవాదానికి సంబంధించిన ఒక ప్రత్యేక చింతనాశీలిని తెలుగు సమాజం కోల్పోయింది.

• గౌరవ్



పంచాయతీల్లో.. పైసల్లేవ్



ఖాళీ ఖజానాతో పాలకవర్గాల్లో **అయోమయం**

బ్లీచింగ్ కొనడానికీ అందుబాటులో లేని నిధులు

అడపాదడపా వర్షాలు.. అడుగంటిన పారిశుధ్యం.. దోమలు.. తాగునీరు కలుషితం.. ప్రబలుతున్న వ్యాధులు.. జ్వరాలతో పల్లెల్లో పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ఇప్పటికే బాపట్ల జిల్లాలో పలు గ్రామాల్లో డెంగీ జ్వరాలతో మరణాలు సంభవించగా , పలువురు చికిత్స పొందుతున్నారు. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ అక్కడక్కడ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కనీసం బ్లీచింగ్ కొనుగోలు చేసి రోడ్లపై చల్లి కొంతైనా పారిశుధ్యం మెరుగుపరచాలను కున్నా పంచాయతీల్లో నిధులు లేవని సర్పంచ్‌లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఎనిమిది నెలల క్రితం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను కూడా మళ్లించుకుని మొండిచేయి చూపుతోందని పంచాయతీ పాలకవర్గాలు వాపోతున్నాయి. నిధులను విడుదల చేయాలని ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించడంలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పల్లెల్లో పారిశుధ్యం అధ్వానం.. ప్రబలు తున్న వ్యాధులు
- కేంద్ర నిధుల మళ్లింపుతో వట్టిపోయిన పంచాయతీ ఖజానాలు
- 8 నెలలుగా ఆర్థిక సంఘం నిధుల కోసం సర్పంచ్‌ల ఎదురుచూపు
- ఇప్పటికే డెంగీ జ్వరాలతో వణికిపోతున్న బాపట్ల జిల్లావాసులు

రూ.70.52 కోట్లు మళ్లింపు

కేంద్ర ప్రభుత్వం ఎనిమిది నెలల క్రితం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు రూ.70.52 కోట్లు విడు దల చేసింది. అయితే ఈ నిధులను రాష్ట్ర ప్రభు త్వం దారిమళ్లించింది. పల్నాడు జిల్లాకు రూ.30.78 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23.35 కోట్లు గుంటూరు జిల్లాకు రూ.16.39 కోట్లను పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది.

(పొన్నూరు, ఆంధ్రజ్యోతి) పల్లెల్లో పారిశుధ్యం క్షీణించి దోమల వ్యాప్తి అధికమైంది. గ్రామీణులు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాలతో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుదలను ఉద్యమంలా చేపట్టి ప్రజలకు అంటువ్యాధులు రాకుండా కావాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. అయితే నిధులు లేక పనులు చేపట్టలేక పంచాయతీ పాలకవర్గాలు మిన్నకుంటున్నాయి. కూటమి (మిగతా 6వ పేజీలో)



ఈపూరు మండలం ఎర్రబాలెంలో రోడ్డుపై నిలిచిన నీరు



గ్రామస్థులతో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

అభివృద్ధే లక్ష్యంగా పాలన

- ఐదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రం అధోగతి
- తొలి అడుగులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

మేడికొండూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన సాగిస్తోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావుతో కలిసి సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మేడికొండూరులో శనివారం పెమ్మసాని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలను ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. తొలి ఏడాదిలోనే అభివృద్ధి దిశలో రాష్ట్రం దూసుకుపోతుందన్నారు. పేరేచర్ల, కొండమోడు రహదారి విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా రూ.55 వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, గుంటుపల్లి సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షులు నాగబాబు, జానీ బేగం, సర్పంచ్‌లు పూల నాగమణి, దేవరకొండ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



తెలుగు సాహిత్యం యువత జీవన నైపుణ్యాలకు దిక్సూచి

- సుప్రీం కోర్టు విశ్రాంత సీజే జస్టిస్ ఎన్వీ రమణ

8

ఓఎల్‌ఎక్స్‌లో.. జగనన్న ఇల్లు

- రూ.6 నుంచి 12 లక్షల వరకు ధర పెట్టి అమ్మకం
- అప్పు చేసి కట్టుకున్నా సౌకర్యాలు లేని కాలనీలో ఉండలేక..



₹ 9,00,000
జగన్ అన్న కాలనీ నేలపాడు తెనాలి

- నేలపాడు లేఅవుట్‌లో ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టిన ఓ ఇల్లు

తెనాలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేరుస్తాం.. కాలనీలు కాదు.. ఊళ్లను సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నాం.. రూ.15 లక్షల ఆస్తిని పేదలకు అందిస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. అయితే జగన్ పాలన పోయింది.. కానీ జగనన్న కాలనీలను, అందులోని నివాసితుల గోడు ఎవరికీ పట్టడంలేదు. స్థలం వచ్చిందని అప్పులు చేసి కలల గృహాన్ని నిర్మించుకున్న ఎందరో అక్కడ కనీస సౌకర్యాలు లేక బిక్కుబిక్కుమంటూ ఉండలేక అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేక లేఅవుట్లలో పలువురు ఇళ్లు అమ్ముకోగా కొందరు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తెనాలి ప్రాంతంలోని నేలపాడు లేఅవుట్‌లో ఓ లబ్ధిదారుడు తన ఇంటిని ఏకంగా ఓఎల్‌ఎక్స్ యాప్‌లోనే అమ్మకానికి పెట్టడాన్ని పలువురు విచిత్రంగా చూస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పలు జగనన్న కాలనీల్లో అక్కడక్కడ కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ అప్పులు కట్టలేక, కనీస సౌకర్యాలు లేని, దోమలు, విషసర్పాలు, అపరిశుభ్రత మధ్య ఆ ఇంట్లో నివాసం ఉండలేక అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లను కూడా పలువురు లబ్ధిదారులు ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టేస్తున్నారు. అయితే అమ్మకాలు జరుగుతున్నది తక్కువే అయినా, గతంలోకంటే కొంత వరకు అమ్మకాలు బాగేనే సాగుతున్నాయని దళారులు చెబుతున్నారు. తక్కువ ధరకు కొని పెట్టుకుంటే, భవిష్యత్‌లో ఎంతోకొంత రేటు పెరగకపోతుందా అన్న ఆలోచనతో కొందరు కొనుగోలు చేస్తున్నారు. ఇంటిని బట్టి రూ.9 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు రేటుపెట్టి అమ్మకాలకు దిగుతున్నారు. ఇల్లు కట్టకుండా ఉన్న ఖాళీ స్థలం అయితే రూ.3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి రేటుపెట్టి అమ్మేస్తున్నారు.

మొక్కు తీర్చేందుకు వెళ్తూ..

అనంత లోకాలకు



లారీని ఢీకొట్టి తిరగబడిన తుఫాన్ వాహనం

- కొత్తగణేషునిపాడుకు చెందిన ఐదుగురి మృతి
- ఉలవపాడు వద్ద లారీని ఢీకొట్టిన తుఫాన్ వాహనం




మృతిచెందిన శ్రీనివాసరావు, సుభాషిణి (పాత చిత్రాలు)

మాచవరం, పిడుగురాళ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మనవడి పుట్టి వెంట్రుకలు తిరుమలలో వెంకన్నకు సమర్పించాలని మొక్కుకున్నారు. దీంతో ఆ మొక్కు చెల్లిం చేందుకు తిరుమలకు బయల్దేరిన వారిలో ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేషునిపాడు నుంచి 11 మంది తుఫాన్ వాహనాన్ని అద్దెకు తీసుకుని శుక్రవారం రాత్రి తిరుమలకు బయల్దేరారు. మార్గమధ్యలో జరి గిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలతో పాటు మూడేళ్ల చిన్నారి కూడా ఉంది. ఈ సంఘటనతో కొత్తగణేషునిపాడు గ్రామంలో ఒక్కసారిగా విషాదచాయలు అలు ముకున్నాయి. ఎవరిని పలుకరించినా కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన నంబుల రామ్మూర్తి మూడేళ్ల మనవడు అభినయకృష్ణ పుట్టి వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు డ్రైవర్‌తో పాటు 11 మంది కుటుంబసభ్యులతో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తుఫాన్ వాహనంలో ఇంటి నుంచి బయల్దేరారు. అర్ధరాత్రి 1:30 గంటలకు నెల్లూరు జిల్లా ఉలవపాడు సమీపానికి వెళ్లగా అక్కడ లారీని వీరి వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో తుఫాన్ వాహనం పల్టీలు కొట్టి బోర్లా పడింది. ఈ సంఘటనలో రామ్మూర్తి భార్య వెంకట నరసమ్మ(55), చిన్నకోడలు సుభాషిణి (33), మనువడు అభినయ్‌కృష్ణ(3) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రామ్మూర్తి పెద్దకోడలు రుక్మిణి(40), వియ్యంకుడు పిడుగురాళ్ల మండలం పెదఅగ్రహారం గ్రామానికి చెందిన యర్రం శ్రీనివాసరావు (60)లను చికిత్స నిమిత్తం కావలికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మ, హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాద సమాచారాన్ని స్థానికులు ఫోన్‌లో కొత్తగణేషునిపాడులోనే బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామస్థులు, బంధువులు సంఘటనా స్థలానికి తరలివెళ్లారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

డ్రైవర్ నిద్రే కారణమా..?

తుఫాన్ వాహనం సత్తెనపల్లికి చెందిన వారిది. ఈ వాహనాన్ని రామ్మూర్తి అద్దెకు మాట్లాడుకున్నారు. అయితే రాత్రి ప్రయాణం కావడంతో డ్రైవర్ నిద్రలోకి జారి ఉంటాడని ఇదే ప్రమాదానికి కారణమని కొందరు అనుమానిస్తున్నారు. వేగంగా వెళ్తుండగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న లారీ కన్పించకపోవడంతో అయినా ప్రమాదం జరిగి ఉంటుందని మరికొందరి వాదన.

ప్రాణాలతో బయటపడిన చిన్నారి

మృతి చెందిన సుభాషిణి కొత్తగణేషునిపాడు గ్రామంలో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు పిడుగురాళ్ల మండలం అగ్రహారంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. వీరి తొమ్మిది నెలల పాప ప్రాణాలతో బయట పడగా భార్య, తల్లి, వదిన, మామ చనిపోవడంతో ఆయన ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

ఫోన్‌లో పరామర్శించిన యరపతినేని

ప్రమాద సంఘటన విషయాన్ని తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బంధువులతో మాట్లాడి వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృత దేహాలకు పోస్టుమార్టం త్వరగా నిర్వహించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. అలాగే టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఉలవపాడు ఆసుపత్రికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పారు.



నేలమట్టం!

గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ కూల్చివేత పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ పనులకు అంకురార్పణ జరగగా శనివారం ఉదయం నుంచి భారీ యంత్రంతో కూల్చివేత కొనసాగుతోంది.

మూడో లైన్ నిర్మాణం..
పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గిరిజనుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

8

అంబేడ్కర్ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

● 102 సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

యడ్లపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతులలో ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ శనివారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 5, 6, 9, 10 తరగతుల్లో మొత్తం 102 సీట్లు ఖాళీ ఉన్నట్లు వెల్లడించారు. 5వ తరగతిలో 62 సీట్లకు.. ఎస్సీ-31, బీసీ-2, ఎస్టీలకు-39, 6వ తరగతిలో ఎస్సీ-2, బీసీ-2, 9వ తరగతిలో ఎస్సీ-3, బీసీ-1, ఎస్టీ-4 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతిలో ఎస్సీ-15, బీసీ-1, ఎస్టీ-11, ఓసీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయ, కుల ధ్రువ పత్రాలు తీసుకుని స్వయంగా హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానాస్పద మృతి


రాజేంద్ర ప్రసాద్ మృతదేహం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ శివయ్య శనివారం తెలిపారు. మండల పరిధిలోని ఓలేరు శివారులోని జాతీయ రహదారి వెంబడి..ఖాళీ ఇళ్ల స్థలాల్లో ఓ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందిందన్నారు. సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా.. రేపల్లెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మద్దుల రాజేంద్ర ప్రసాద్ (58)గా గుర్తించారు. గ్యాస్ ప్రసాద్‌గా అతను సుపరిచితుడని.. మృతదేహం పక్కన గుళికలు, శీతల పానియాలు కూడా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల కారణాలు తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు.

ఎరువుల కొరత లేకుండా తక్షణ చర్యలు

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు

గుంటూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు సూచించారు. గుంటూరు కొర్రు రోడ్డులోనున్న డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, కార్యాలయ మేనేజర్ శ్రీనివాస్ ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల కొరత లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డెల్టా ప్రాంతంలో వరి, పల్నాడు ప్రాంతంలో ప్రత్తి పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయశాఖ సూచనల మేరకు ఎమ్మార్పీకి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులు కూడా అవసరానికి మించి ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించి భూమిని నిస్సారం చేయవద్దని చైర్మన్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా యూరియా, డీఏపీ రైతుల అవసరాలకు అనుగుణంగా కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కోరినట్లు తెలిపారు. ఈ మేరకే కేంద్ర మంత్రి కూడా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మాట్లాడి రాష్ట్రానికి అత్యధిక మొత్తంలో కేటాయింపులు చేశారని తెలిపారు.


బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, మేనేజర్ శ్రీనివాస్‌తో చైర్మన్ హరిబాబు

బిడ్డను అమ్మబోతూ..పట్టుబడింది

● గతంలో బాబును, ఇప్పుడు పాపను ● పట్టుకున్న పోలీసులు, ఆరుగురిపై కేసు నమోదు


బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలను ఓ తల్లి విక్రయిస్తున్న ఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది. పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణంలోని 11వవార్డు ఇందిరానగర్ కాలనీకి చెందిన దోనేపూడి వెంకటేశ్వరమ్మ గతేడాది తన మగ బిడ్డను రూ.లక్షన్నరకు విక్రయించి పోలీసులకు పట్టుబడింది. అప్పట్లో కేసు కూడా నమోదైంది. ఇదిలా ఉండగా రెండు నెలల పాపను మరోసారి విక్రయించి రేపల్లె పట్టణంలో బీట్ కానిస్టేబుళ్లకు పట్టుబడింది. వెకంటేశ్వరమ్మ బిడ్డను విక్రయిస్తుందనే విషయం.. బాపట్లలో దళారీగా వ్యవహరిస్తున్న జాను అనే మహిళ నగరం మండలం ప్రజ్ఞంకు చెందిన కొండలుకు సమాచారం ఇచ్చింది. అతను అవనిగడ్డలో ఉంటున్న లక్ష్మీ అనే మహిళకు చెప్పాడు. ఆమె అవనిగడ్డ దగ్గర పోలూరుకు చెందిన భగవద్గీత అనే మహిళకు చెప్పింది. దీంతో భగవద్గీతకు.. బిడ్డలు లేకపోవడంతో కొనటానికి సిద్ధపడింది. రూ.2 లక్షలు ఇచ్చి.. బిడ్డను తీసుకుంది. బిడ్డకు మరొక బేరం రావడంతో దళారీగా ఉన్న జాను బిడ్డ తల్లితోపాటు నూరు అనే మరొక మహిళను పంపించి బిడ్డను తీసుకురమ్మని చెప్పింది. శుక్రవారం రాత్రి వీరిద్దరు రేపల్లె వెళ్లి బిడ్డను ఇవ్వమని గొడవపడుతుండగా బీట్ పోలీసులు గమనించి విచారించగా అసలు విషయం బయట పడింది. దీంతో వారు బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తంకు సమాచారం ఇచ్చారు. ఆయన సీఫార్డ్ కోఆర్డినేటర్ బి.కిషోర్‌తో వెళ్లి బిడ్డతోపాటు తల్లి వెంకటేశ్వరమ్మ, నూర్‌లను తీసుకొచ్చారు. బిడ్డను బాలికాసదన్‌లో సంరక్షణలో ఉంచారు. వెంకటేశ్వరమ్మ, నూర్‌లను సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో పెట్టారు. శనివారం సాయంత్రం డిస్ట్రిక్ చైల్డ్‌ప్రొటెక్షన్ యూనిట్‌లో పనిచేస్తున్న స్పెషలైజ్డ్ ఎడాప్టెడ్ ఏజెన్సీ వర్కర్ శైలజ, సీఫార్డ్ సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్ కలిసి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గతేడాది బిడ్డను విక్రయించిన కేసులో నిందితురాలిగా ఉండి మళ్లీ.. మరోబిడ్డను విక్రయించడం గమనార్హం.



బాపట్ల పట్టణంలోని బాలికాసదన్

కమ్మజన సేవ సమితి సేవలు అభినందనీయం

● పారిశ్రామికవేత్త మాదల చైతన్య
● వసతి గృహానికి రూ.20 లక్షల విరాళం


పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మాదల చైతన్య

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న కమ్మ జన సేవ సమితి సేవలు అభినందనీయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త మాదల చైతన్య అన్నారు. స్థానిక కుందుల రోడ్డు, బాలికల వసతి గృహ ఆవరణలో సమితి గౌరవ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు రూ.20 లక్షల విరాళాన్ని ఆయన అందజేశారు. చైతన్య మాట్లాడుతూ ఉన్నత విద్య ను బాలికలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న సమితి సేవలలో భాగస్వామ్యం అవ్వడం అదృష్టమన్నారు. ప్రతిభ ఉన్నప్పటికి పేదరి కం అడ్డంకిగా మారి ఉన్నత విద్యను అభ్యసించలేక పోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని విరాళం అందజేస్తున్నట్లు చెప్పారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మాదల చైతన్య విద్యార్థులకు సేవ చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. జేకేసీ రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు. మాదల రత్నగిరి బాబు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డ ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

డ్రంకెన్‌డ్రైవ్.. మాజీ సర్పంచ్ పై లాఠీతో దాడి

● బంధువుల రాస్తారోకో ● రెండు గంటలు ట్రాఫిక్ సమస్య


రోడ్డు పై రాస్తారోకో చేస్తున్న బాధితుడి బంధువులు, గాయపడిన శ్రీనివాసరావు

బెల్లంకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి ఎస్ఐ ఆలురెడ్డి, సిబ్బంది మండలంలోని నాగిరెడిపాలెం గ్రామ సమీపంలో గంగమ్మ గుడి వద్ద డ్రంక్ డ్రైవ్ శనివారం సాయంత్రం నిర్వహించారు. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కె.శ్రీనివాసరావు స్వగ్రామం నాగిరెడ్డిపాలేనికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. పోలీ సులు లాఠీని అడ్డం పెట్టి ఆపేందుకు యత్నించారు. వాహనం ఆపకుండా వెళ్తున్నాడనే అనుమానంతో..ఓ కానిస్టేబుల్ అతని మొఖంపై లాఠీతో తీవ్రంగా గాయపరిచారు. రక్తస్రావంతో శ్రీనివాసరావు గ్రామానికి బంధువులకు సమాచారం ఇవ్వడంతో.. అందరూ కలసి మెయిన్ రోడ్డుపై రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. బెల్లంకొండ ఎస్ఐ, పోలీసు సిబ్బంది అక్కడికి వచ్చి నచ్చజెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. క్రోసూరు, సత్తెనపల్లి సీఐలు సురేష్, కిరణ్ సర్ది చెప్పినా వారు వినలేదు. తనపై దాడి చేసిన కానిస్టేబుల్ ఎవరో తెలియాలంటూ.. సీఐని ప్రశ్నించారు. దాడి చేసిన సిబ్బందిని వెంటనే తెలుసుకుంటామని, పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుకుందామని చెప్పటంతో బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. నాగిరెడ్డిపాలెంలో ఉన్న మద్యం షాపును బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు మార్చారు. దీంతో పోలీసులు మద్యం షాపు సమీపంలోని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రాస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పొలం పనులు చేసుకొనే రైతులు, కూలీలు కొందరు పని అనంతరం సాయంత్రం మద్యం తీసుకుంటారు. పోలీసులు వారినే టార్గెట్‌గా డ్రంక్ డ్రైవ్ పేరుతో కేసులు నమోదు చేసి, ఇబ్బందులు పెడుతున్నారని స్థానికులు అంటున్నారు.

గురుకుల పాఠశాలలో..

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని సంగడి గుంట (పొన్నూరు రోడ్డు)లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనారిటీ)లో 5వ తరగతి చదివేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బాలశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మిగిలిన సీట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. ఎస్సీ 9, ఎస్టీకు 10 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 14 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 16 న పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 87126 25039, 63020 18886, 86888 63345 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ తెలిపారు. సుమారు 35-40 సంవత్సరాలు వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. మృతి కారణాలు తెలియరాలేదని, బ్లూ రంగు గడుల షర్ట్, నలుపు రంగు కాటన్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు సీఐ 86888 31325, ఎస్ఐ 8688 831329 సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

పంచాయతీల్లో పైసల్లేవ్

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను గత నవంబరులో పంచాయతీలకు జమ చేసింది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని పాలకవర్గాల సంతోషం ఎంతోకాలం నిలవలేదు. రెండో విడత నిధులు విడుదలలో తీవ్రజాప్యం జరుగుతుండటంతో పాలకవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు మళ్లించుకుంది. నిధుల కోసం గతంలో మాదిరిగానే ఆందోళన బాట పట్టారు. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి కార్యాలయం వద్ద గత మంగళవారం ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. నిధులు జమ చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని సర్పంచ్‌లు స్పష్టం చేసినా ప్రభుత్వంలో స్పందనలేదు.

ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.,

HO : విశాఖపట్నం, BO : గుంటూరు
డోర్ నెం.133-161, ఆర్ఆర్ఆర్ ప్లాజా, కనకదుర్గ గుడి ఎదురుగా, ఎమ్.జి. ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు. ఫోన్ : 0863-2255646.
TRUST - GROWTH

అనుబంధం [IV] **స్వాధీనత ప్రకటన**

(రూల్ 8(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (54 ఆఫ్ 2002) క్రింద **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., గుంటూరు బ్రాంచ్, గుంటూరు జిల్లా** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లో రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన **తేది.31.03.2025 నాటికి రూ.32,47,903.50 పై (అక్షరాల ముప్పై రెండు లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల మూడు రూపాయలు మరియు యాభై పైసలు మాత్రమే) + తేది.01.04.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి) తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : 1) మెస్సర్స్ BSR కాటన్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి బండి జ్యోతి, భర్త : బండి శ్రీనివాసరావు,** ఫ్లాట్ నెం.ఎఫ్2, ఫ్రెండ్స్ ఎన్‌క్లేవ్, భాష్యం హాస్టల్ రోడ్డు, ఎంజి ఇన్నర్ రింగ్ రోడ్, ఫేజ్-1 గుంటూరు, గుంటూరు జిల్లా-522034. **హామీదారులు : 2) శ్రీ బండి శ్రీనివాసరావు, తండ్రి : బండి జోగయ్య,** ఫ్లాట్ నెం.ఎఫ్2, ఫ్రెండ్స్ ఎన్‌క్లేవ్, భాష్యం హాస్టల్ రోడ్డు, ఎమ్‌జి ఇన్నర్ రింగ్ రోడ్, ఫేజ్-1 గుంటూరు, గుంటూరు జిల్లా-522034. **3) శ్రీమతి బండి జ్యోతి, భర్త : బండి శ్రీనివాసరావు,** ఫ్లాట్ నెం.ఎఫ్2, ఫ్రెండ్స్ ఎన్‌క్లేవ్, భాష్యం హాస్టల్ రోడ్డు, ఎమ్‌జి ఇన్నర్ రింగ్ రోడ్, ఫేజ్-1 గుంటూరు, గుంటూరు జిల్లా-522034. **4) శ్రీ గాజుల చైతన్యకుమార్, తండ్రి : గాజుల సూర్యప్రకాశరావు,** ఫ్లాట్ నెం.101, 7వ లైన్, విజయపురి, గుంటూరు, గుంటూరు జిల్లా-522006. **5) శ్రీ గండల వెంకటేశ్వరరావు, తండ్రి : జి.కృష్ణ,** హెచ్ నెం.10-18, జొన్నలగడ్డ, గుంటూరు, గుంటూరు జిల్లా-522034 వార్లను కోరుతూ **తేది.06.03.2025 న డిమాండ్ నోటీసును** జారీ చేసినారు.

ఋణగ్రహీతలు/హామీదారులు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్సు యొక్క 8వ రూల్తో కలిపి చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.05.08.2025** న దిగువ వివరించిన ఆస్తిపై స్వాధీనత తీసుకొన్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలు/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **తేది.31.03.2025 నాటికి రూ.32,47,903.50 పై (అక్షరాల ముప్పై రెండు లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల మూడు రూపాయలు మరియు యాభై పైసలు మాత్రమే) + తేది.01.04.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి) **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., గుంటూరు బ్రాంచ్, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

(ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 (8) లోని నిబంధనలు గమనించవలెను)

స్థిరాస్థి వివరములు

1వ ఐటమ్ ఒరిజినల్ రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.6518/2023, తేది.10.10.2023 : గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ ఏరియా, గోరంట్ల గ్రామ డి నెం.471 నందు ఎకరా 11-33 సెంట్లులోని ఎకరా 2-00 సెంట్లు భూమిలోని ప్లాన్ ప్రకారం ఫ్లాట్ నెం.24 నందు ఇందులో విస్తీర్ణం 619-233 చ॥గ॥లు దక్షిణం వైపున 501 చ॥గ॥లులోని పవన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కలదు. **హద్దులు : షెడ్యూల్-ఎ : తూర్పు :** ఇతరుల ఫ్లాట్లు స్థలం హద్దు, **దక్షిణం :** 33 అ॥ల వెడల్పు రోడ్డు హద్దు, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు హద్దు, **ఉత్తరం :** బేతంశెట్టి వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి స్థలం హద్దు. **షెడ్యూల్-బి :** విస్తీర్ణం 501 చ॥గ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 40 చ॥గ॥లు లేదా 33.44 చ॥మీ॥లులోని పవన్ రెసిడెన్సీ యొక్క 4వ అంతస్తు నందు ఫ్లింత్ ఏరియా 1250 చ॥అ॥లుతో ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.403 అన్ని సదుపాయాలు మరియు ఇందులో సాధారణ మరియు ఉమ్మడి హక్కులు, ఈజిమెంట్ సౌకర్యాలు మొ॥వి హక్కులతో కలదు. **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** కామన్ కారిడార్ & మెట్లు, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

2వ ఐటమ్ ఒరిజినల్ రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.6519/2023, తేది.10.10.2023: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ ఏరియా, గోరంట్ల గ్రామ డి నెం.471 నందు ఎకరా 11-33 సెంట్లులోని ఎకరా 2-00 సెంట్లు భూమిలోని ప్లాన్ ప్రకారం ఫ్లాట్ నెం.24 నందు ఇందులో విస్తీర్ణం 619-233 చ॥గ॥లు దక్షిణం వైపున 501 చ॥గ॥లులోని పవన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కలదు. **హద్దులు : షెడ్యూల్-ఎ : తూర్పు :** ఇతరుల ఫ్లాట్లు స్థలం హద్దు, **దక్షిణం :** 33 అ॥ల వెడల్పు రోడ్డు హద్దు, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు హద్దు, **ఉత్తరం :** బేతంశెట్టి వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి స్థలం హద్దు. **షెడ్యూల్-బి :** విస్తీర్ణం 501 చ॥గ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 30 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥లులోని పవన్ రెసిడెన్సీ యొక్క 3వ అంతస్తు నందు ఫ్లింత్ ఏరియా 900 చ॥అ॥లుతో ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.301 అన్ని సదుపాయాలు మరియు ఇందులో సాధారణ మరియు ఉమ్మడి హక్కులు, ఈజిమెంట్ సౌకర్యాలు మొ॥వి హక్కులతో కలదు. **హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్ & మెట్లు, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

తేది : 05.08.2025
స్థలం : గుంటూరు

సం/- అధీకృత అధికారి
ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లి.,
గుంటూరు బ్రాంచ్, గుంటూరు జిల్లా

గుంటూరు సిటీ వార్తలు



కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించిన కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి శ్రీకారం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన 52వ డివిజనలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరంలో ఏడాదిలో చారిత్రాత్మకమైన అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి పనులను వద్దాయని, ఇది ఈ ప్రాంత ప్రజలకు వరమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గుంటూరు నగరం అభివృద్ధి తలమానికంగా నిలుస్తోందని చెప్పారు. డ్రైనేజ్ ప్రాజెక్టుల నిర్మాణంతో ముంపు ప్రాంత వాసుల కష్టాలు తీరబోతున్నాయని తెలిపారు. ఇది నిబద్ధత, చిత్తశుద్ధి గల నాయకుల కృషి వల్లే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కాదు.. మహిళల ఆర్థిక రక్షణ

మహిళల జీవనోపాధి మెరుగుపరిచి, ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నామని, ఇది కేవలం కుట్టుశిక్షణ మాత్రమే కాదని, వారి జీవితాలకు రక్షణ అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని లాల్ జాన్ బాషా షాదీఖానా, క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్, జానీ కాలనీలోని ఎలిమెంటరీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 420 మందికి శిక్షణ ఇస్తున్నామని అన్నారు. 90 రోజుల శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని, తద్వారా వారి కాళ్లపై వారు నిలదొక్కుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లబుడ్డిలు చిట్టిబాబు, దాసరి రాజా మాస్టర్, డిప్యూటీ మేయర్ సజీలా, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, కార్పొరేటర్ యల్లావుల అశోక్, ముఖ్ర తదితరులు పాల్గొన్నారు.

భారీ మట్టి గణపతి విగ్రహం ఏర్పాటు అభినందనీయం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకొని గుంటూరులో 99 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆయన కార్యాలయంలో ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన వైస్టర్లు, పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన నల్లమట్టి, ఎర్రమట్టితో పాటు హాని కలిగించని రంగులతో ఈ విగ్రహాన్ని రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. విగ్రహ తయారీలో గంగా, కృష్ణా, గోదావరి నదుల పవిత్ర నీటిని వాడుతున్నారన్నారు. అమరావతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇన్నర్ రింగు రోడ్డు, విజయ డిజిటల్ షోరూం వద్ద ఉన్న మైదానంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంప్రదాయ హోమాలు, పూజలు నిర్వహించి పండుగ రోజైన ఆగస్టు 27న విగ్రహాన్ని ప్రతిష్ఠ చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రిని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్టాల్స్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నీటి కూతురులతో ఈవెంట్లను నిర్వహిస్తామని అన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, తోట సాయి కృష్ణ, జాకీర్, దామోదర్, మంతెస్వామి, దుర్గారెడ్డి, విజయగౌరి పాల్గొన్నారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్న నిర్వాహకులు

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సంఘాలన్నీ ఏకం కావాలి

● బ్రాహ్మణ ఏకీకృత సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు విజయకృష్ణ

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి జెండాలన్నీ పక్కనపెట్టి బ్రాహ్మణ సంఘాలన్నీ ఏకం కావాలని బ్రాహ్మణ ఏకీకృత (వన్‌నెస్) సర్వీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయకృష్ణ పిలుపునిచ్చారు. బ్రాహ్మణుల సమస్యలు తెలుసుకొని వారిని పేదరికం నుంచి నిర్మూలించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణ జాగృతి యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. బ్రాడీపేట 2/14వ లైనులోని శంకర మఠం దేవస్థానం నుంచి జాగృత యాత్ర ప్రారంభం సందర్భంగా ఆయన ప్రసంగించారు. సమాజంలో అనేక మంది బ్రాహ్మణులు పేదరికంలో అట్టడుగున ఉండిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి బ్రాహ్మణ జాతిని ఆదుకోవటం కోసం గడపగడపకు వెళ్ళి వారి యోగక్షేమాలు కనుక్కొని అండగా నిలిచేందుకే జాగృతి యాత్ర చేపట్టామన్నారు. తహసీల్దార్ కోటంరాజు గోపాలకృష్ణ, హైకోర్టు న్యాయవాది కె.గోపాలకృష్ణ, కామేశ్వరి, లతా, మొక్కపాటి కృష్ణ, కె వరప్రసాద్ తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయకృష్ణ, పక్కన గోపాలకృష్ణ తదితరులు

కవులు, రచయితలను ప్రోత్సహించిన వెంకటరెడ్డి చిరస్మరణీయులు

● డాక్టర్ రామరాజు శ్రీనివాస్

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎందరో కవులు, కళాకారులను, రచయితలను తన సంస్థ ద్వారా ప్రోత్సహించిన జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్ దివంగత గుదిబండి వెంకటరెడ్డి చిరస్మరణీయులని రామరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామరాజు శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల దివంగతులైన జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్ గుదిబండ వెంకటరెడ్డి సంస్మరణ సభ శనివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో డాక్టర్ పట్టాభి కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామరాజు మాట్లాడుతూ గడచిన ఆరు దశాబ్దాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ తరపున వెంకటరెడ్డి వందలాది కార్యక్రమాలు నిర్వహించారన్నారు. గుడిబండ వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.తిరుమలేశ్వరరావు, సయ్యద్ జానీబాషా, బండికల్లు జమదగ్నీ, బొమ్మ ఉమామహేశ్వరరెడ్డి, నడింపల్లి వెంకటేశ్వరరావు తదితరులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నడింపల్లి వెంకటేశ్వరరావు తన సంస్థ ఎన్టీఆర్ కళాపరిషత్ ద్వారా ప్రతి ఏటా ఇద్దరు పేద కళాకారులకు గుదిబండి పేరిట చెరో 2 వేలను ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ముఖ్య అతిథి రామరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ వెంకటరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం క్రమం తప్పక జరుపుతామన్నారు. హైదరాబాద్ నుంచి కళా సంస్థల అధినేతలు బొప్పన నరసింహారావు, లంక లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి పంపిన సంతాప సందేశాలు చదివి వినిపించారు. కార్యక్రమంలో పింగళి భాగ్యలక్ష్మి, నరసింహరావు, ప్రసన్న కుమార్, చిక్కం శ్రీనివాస రావు తదితరులున్నారు.

విద్యాసంస్థలు సమయపాలన మార్చుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతిష్టాత్మకమైన శంకర్ విలాస్ వంతెన నిర్మాణం దృష్ట్యా శనివారం నుంచి పూర్తి స్థాయిలో రాకపోకలు నిలిపివేయడం జరిగిందని, నగరంలోని విద్యా సంస్థలు కూడా ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం ఏ (ఉదయం 8:30 నుంచి 4 గంటల వరకు), బి (9:15 నుంచి 4:45 గంటల వరకు) షిఫ్ట్‌లుగా టైమింగ్స్ మార్చుకొని సహకరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలోని విద్యా సంస్థల ప్రతినిధులు, స్కూల్, కాలేజి ఎడ్యుకేషన్ అధికారులు, జీఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో శనివారం సమన్వయ సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు వేగంగా జరుగుతున్న రీత్యా, ప్రత్యామ్నాయ రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని విద్యా సంస్థలను స్కూల్, ఇంటర్మీడియట్ కేటగిరిలుగా పరిగణలోకి తీసుకొని ఏ, బి షిఫ్ట్‌లుగా వర్కింగ్ టైమింగ్స్ మార్చుకోవాలని సూచిస్తున్నామన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణకు సూచించిన మార్గాల్లో ఆక్రమణలు తొలగించామన్నారు.

అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అందులో భాగంగా విద్యా సంస్థల్లో విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా థీం పై పెయింటింగ్స్, వ్యాసరచన, వక్తృత్వం, రంగోలి పోటీలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి స్కూల్‌లో హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్స్‌ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్లాస్టిక్ రహిత జెండాలను అన్ని విద్యా సంస్థలు, సంస్థలు, ఇళ్లపై ఎగురవేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అశోక్ కుమార్, మేనేజర్ బాలాజీ, బాషా, విద్యాశాఖ అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మిషన్ గ్రీన్‌తో పచ్చని పర్యావరణహిత నగరంగా గుంటూరు

నగరపాలక సంస్థ పరిధిలో మిషన్ గ్రీన్ గుంటూరు ద్వారా పచ్చని పర్యావరణహిత నగరంగా గుంటూరు రూపుదిద్దుకుంటుందని, కాలనీలు, అపార్టుమెంట్ అసోసియేషన్లు తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించుకోవడానికి ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. గోరంట్ల కోదండరామ నగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మొక్కలు నాటే కార్యక్రమంలో శనివారం కమిషనర్ పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఈ సీజన్లో నగరంలో దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కోదండరామ నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నరసింహారావు, జనరల్ సెక్రెటరి బి.హనోక్, బి.గోపికృష్ణ, ఏ.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల ఆప్యాయతకు నిదర్శనం రాఖీ పండుగ

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): అక్కా తమ్ముళ్ల .. అన్నా చెల్లెళ్ల ఆప్యాయతకి నిదర్శనం రాఖీ పండుగని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. రాఖీ పండుగని పురస్కరించుకొని శనివారం మహిళా కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్తలు మేయర్‌ని అశోక్‌నగర్‌లో గల ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి రాఖీలు కట్టి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమను ప్రతిబింబించే పండుగ అని, ఈ పండుగ రోజున తనకు రాఖీ కట్టిన మహిళా కార్పొరేటర్లకు, తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్తలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు.

కేంద్రమంత్రి, మేయర్‌కు రాఖీ కట్టిన ఎమ్మెల్యే గల్లా మాధవి

రక్షా బంధన్‌ను పురస్కరించుకుని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని), పెమ్మసాని రవిలకు ఎమ్మెల్యే గల్లా మాధవి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారు ఆమెను ఆశీర్వదించారు.

ఎమ్మెల్యే నసీర్‌కు....

రక్షా బంధన్ సందర్భంగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి శనివారం తూర్పు ఎమ్మెల్యే నసీర్‌కు రాఖీ కట్టారు.



మేయర్ రవీంద్ర, కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్‌లకు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే మాధవి

వెలకట్టలేని విలువలకు రాఖీ పండుగ ఓ చిహ్నం : కమిషనర్



కమిషనర్‌కి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారిస్ ఉమామహేశ్వరి

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఎల్లలు లేని ప్రేమ, ఆప్యాయతలకు, వెలకట్టలేని విలువలకు రాఖీ పండుగ ఓ చిహ్నమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ కి గుంటూరు బ్రహ్మా కుమారీస్ ఉమామహేశ్వరి రాఖీ కట్టి అభినందనలు తెలిపారు.

30 నుంచి ఏపీ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పికిల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా, ఏపీ పికిల్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులో ఈనెల 30, 31వ తేదీలలో 2వ ఏపీ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చీఫ్ ఇన్ పాటరన్ టి అరుణ్ కుమార్ తెలిపారు. స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని వీవీవీ హెల్త్ హబ్‌లో కరపత్రాలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. అండర్-14,16,19 బాల, బాలిక విభాగంలో ఓపెన్, 35 ప్లస్, 50, 60+, పురుషులు, మహిళలు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎన్.శ్రీధర్, న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, జీవీఎస్ ప్రసాద్, సభ్యులు శబరీష్, కృష్ణా జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి డి.గోపాలరావు, వి.నాగరాజు, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని మద్యం షాపులపై చర్యలు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జేకేసీ కాలేజీ రోడ్డులో వైన్ షాప్‌లోని మద్యాన్ని బార్‌లో అమ్ముతుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ టూ టౌన్ సీఐ ఏం యశోదరాదేవి శనివారం అన్నారు. ఆమె మాట్లాడుతూ డైరెక్టర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆదేశాల మేరకు స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆపిల్ రెస్టారెంట్ అండ్ బార్లు తనిఖీ చేయగా అందులో ఆపిల్ వైన్స్ కు సంబంధించిన సుంకం చెల్లించిన మద్యం సీసాలను గుర్తించారని తెలిపారు. స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ భాను సత్యనారాయణ, సిబ్బంది ఆపిల్ వైన్ షాప్, రెస్టారెంట్ అండ్ బార్ పై తదుపరి చర్యల నిమిత్తం ఎక్సైజ్ స్టేషన్ గుంటూరు-2 కి రిపోర్టు చేశారు. దీంతో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.యశోదరా దేవి, యాపిల్ బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసి డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ డాక్టర్ కే శ్రీనివాసులుకి, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ అరుణ కుమారికి తదుపరి చర్యల నిమిత్తం రిపోర్టు చేశారు. వెంటనే ఆపిల్ బార్ అండ్ రెస్టారెంట్ పై చర్యల నిమిత్తం లైసెన్స్‌ని సస్పెండ్ చేయడం జరిగిందని, అదేవిధంగా యాపిల్ వైన్ షాప్‌పై చర్యలు తీసుకున్నట్లు సిఐ యశోదరా దేవి తెలిపారు.

ప్రధానోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం బ్రాడీపేట శారదా నికేతన్‌లో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సీజే మణికుమార్, అధ్యక్షుడిగా ఆవుల తిరుమలేష్, కార్యదర్శిగా బి.సత్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ జిలాని బాషా, ట్రెజరర్‌గా పుట్టా అప్పారావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గుత్తా శ్రీనివాసరావు, జె.కమల ప్రసాద్, ఎం.ఏడుకొండలు, జోస్ మేరి మహిళా ప్రతినిధి ఎన్నికయ్యారు. తెనాలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.శ్రీధర్, బి.రాజీవ్ రతన్, గుంటూరు అధ్యక్ష కార్యదర్శులుగా టి.నగేష్, జయప్రద ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా కె.రాజారెడ్డి, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా జి.శ్రీనివాసరావు తదితరులు ఎన్నికయ్యారు.

స్ఫూర్తి ప్రదాత...ఏకలవ్యుడు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, మంచి సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఏకలవ్యుడు నిరూపించాడని జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న ఏకలవ్యుని విగ్రహానికి సంఘ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ ప్రారంభించారు. జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ఎం ఆదంఖాన్, దామర్ల ఆషా తదితరులు పాల్గొని షుగర్, బీపీ, థైరాయిడ్, గుండెతో పాటు ఇతర వైద్య సేవలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సంఘ గౌరవ అధ్యక్షుడు మేడా హనుమంతురావు, ఉయ్యాల వెంకటేశ్వర్లు, తోకల పాపారావు, రామకృష్ణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామి వారికి అభిషేకాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మి మందిరంలో కోటి కుంకుమార్చనలో భాగంగా శ్రావణ పూర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం శ్రీలక్ష్మి, నారాయణులకు పంచామృతాలు, తులసి, విశేష సుగంధ ద్రవ్యాలతో కనుల పండువగా అభిషేకాలు నిర్వహించారు. కోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్ని ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ శర్మ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే నసీర్ వీడియో కాల్ లీక్‌పై దర్యాప్తు

● ముగ్గురు గుర్తింపు.. విచారిస్తున్న పోలీసులు

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పు టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఓ మహిళతో మాట్లాడినట్లు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తాను, తన భర్త మాట్లాడుకున్న వీడియోను కొందరు తన ఫోన్ హ్యాక్ చేసి దానిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారంటూ బాధిత మహిళ కొత్తపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ వీడియో ఒరిజినలా మార్ఫింగ్ జరిగిందా అనేది తెలుసుకునేందుకు ఆ వీడియోను ఇప్పటికే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మరోవైపు ఆ వీడియో సోషల్ మీడియాలోకి తొలుత అప్‌లోడ్ చేసింది నల్లచెరువుకు చెందిన మల్లి, ఆయన తండ్రి, సూఫీ అనే మహిళ అని పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఆ వీడియో వారికి ఎలా వచ్చింది అనే దానిపై విచారణ జరుపుతున్నారు. మరికొందరు అనుమానితుల సెల్‌ఫోన్ ఐడీ అడ్రస్ సేకరించి దాని ద్వారా నిందితులను గుర్తించేందుకు చర్యలు ప్రారంభించారు. మరోవైపు నా ఫోన్ హ్యాక్ చేసి వీడియోలు మార్ఫింగ్ చేసి నా ఫోన్ ద్వారానే నాకు తెలియకుండా ఆయా వీడియోలు వైరల్ చేశారని తూర్పు నియోజకవర్గానికి చెందిన ఓ కార్పొరేటర్ ఏకంగా సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేయడం చర్చనీయాంశమైంది.

ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఈయూ ఉద్యోగుల నిరసన

గుంటూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శనివారం నినాదాలతో నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ విజయవాడ గవర్నర్‌పేట 1, 2 డిపోలతో పాటు పాతబస్టాండ్ వద్దనున్న 4.15 ఎకరాల ఆర్టీసీ భూమిని లులూ షాపింగ్‌మాల్‌కు కారు చౌకగా కట్టబెట్టటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రూ.400 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.160 కోట్లకు 99 ఏళ్ళకు లీజుకు ఇవ్వటాన్ని ఆక్షేపిస్తున్నామన్నారు. భూమిని లీజుకు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 137ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు-1 డిపో కార్యదర్శి కే రత్నాకర్, ఈయూ నాయకులు పీ.ప్రకాష్, ఎస్ఎస్ రెడ్డి, పి ప్రభాకర్, డీఎంకే రెడ్డి తదితరులున్నారు.

అవయవ దానంతో పది మంది జీవితాల్లో వెలుగులు

గుంటూరు మెడికల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్, శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి కోరారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో శనివారం నిర్వహించిన అవయవదాన వారోత్సవాల్లో ఆయన ప్రసంగించారు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత అవయవదానం చేస్తే పది మంది వ్యక్తులకు కొత్త జీవితం ప్రసాదించవచ్చని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి నర్సింగ్ పాఠశాల విద్యార్థినులు అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించే నాటికలు, ప్రదర్శనలు నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సిబ్బంది, నర్సింగ్ పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ, మాలలను విడదీసే కుట్రలను తిప్పికొట్టాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో మాదిగ, మాలలను విడదీసే కుట్రలను తిప్పికొట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేట, జయ గ్రాండ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ జాబితాలో ఉన్న అనేక ఉపకులాలను విడదీయవద్దని సుప్రీంకోర్టు, రాజ్యాంగం చెప్పినప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేపట్టడం దారుణమన్నారు. ఏపీలో అత్యధిక శాతం ఉన్న మాలల వర్గీకరణతో తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ అంశాన్ని వ్యతిరేఖిస్తూ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరవధిక దీక్ష నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రాల్లో ఉన్న మాలలు ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్, మాజీ సర్పంచ్ విప్పర్ల విజయభాస్కర్, స్టాలిన్, లతిత్, రేఖ పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో హర్ ఘర్ తిరంగా

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ కాలేజ్ రోడ్డులోని రైల్వే క్వార్టర్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైల్వే అధికారులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం సాయంత్రం రైల్వే అధికారులు క్వార్టర్స్‌లోని ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్నదన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చివేత.. ట్రాఫిక్ మళ్లింపు

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చివేత పనులు శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభించగా శనివారం కొనసాగాయి. చారిత్రక నేపథ్యం కలిగిన బ్రిడ్జిని కూల్చివేస్తుండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు తరలివచ్చి తిలకించి, జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ల్యాండ్‌మార్క్‌గా ఉన్న బ్రిడ్జి కనుమరుగవుతున్న నేపథ్యంలో పలువురు సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు. కూల్చివేత పనులతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే బ్రిడ్జిపైకి రాకపోకలు నిలిపివేశారు. వాహన రాకపోకలు దారిమళ్లించడంతో ఈ ప్రభావం నగరంలోని పలు ప్రాంతాలపై పడింది.

ప్రజలు సహకరించాలి : ఈస్ట్ ట్రాఫిక్ సీఐ

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రజలు సహకరించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత నేపథ్యంలో వాహనదారులు మూడు వంతెనల రహదారిని, కంకర గుంట ఫ్లైఓవర్, అండర్ పాస్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు.



అయ్యప్పస్వామి ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

పశ్చిమలో అభివృద్ధి, ఆధ్యాత్మికతకు సమ ప్రాధాన్యం

● ఎమ్మెల్యే గల్లా మాధవి

● అయ్యప్పస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడానికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ పనుల నేపథ్యంలో, బృందావన్ గార్డెన్స్‌లోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని పునఃస్థాపించేందుకు ఆలయ కమిటీ అంగీకరించింది. ఈ నేపథ్యంలో నూతన ఆలయ నిర్మాణానికి ఆమె శనివారం భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గడిచిన కొన్ని నెలల్లోనే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేశామన్నారు. రోడ్ల విస్తరణ, మెరుగైన డ్రెయినేజ్ వ్యవస్థలు, తాగునీటి సరఫరా లైన్ల విస్తరణ, ఆధునిక వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్యం మెరుగుదల వంటి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. కుందుల రోడ్డులో మున్సిపల్ స్థలంలో కొత్త అయ్యప్ప స్వామి ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో, విశాలమైన ప్రాంగణంతో త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమానికి కమిషనర్ పులి శ్రీనివాసులు, గుర్రం ప్రసాద్, స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, నియోజకవర్గ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మహేశ్‌బాబు సేవాగుణం హర్షనీయం

సినీనటుడు మహేశ్‌బాబు సేవాగుణం హర్షనీయమని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. పట్టాభిపురంలో శనివారం జరిగిన మహేశ్‌బాబు జన్మదిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌బాబు అభిమాన సంఘ నాయకుడు కొండబోయిన శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ 21వ డివిజన్ కార్యాలయం ప్రారంభం

పశ్చిమ నియోజకవర్గంలోని 21వ డివిజన్‌లో టీడీపీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే గల్లా మాధవి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు.

కేజేఎస్ఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు (తూర్పు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శనివారం కమ్మ జన సేవ సమితి (కేజేఎస్ఎస్) సర్వసభ్య సమావేశం, రానున్న మూడేళ్ల కాలానికి నూతన పాలకవర్గ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఎన్నిక కార్యక్రమాన్ని చల్లా రాజేంద్రప్రసాదు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షుడిగా సామినేని కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, ఉపాధ్యక్షులుగా చుక్కపల్లి రమేష్, మాదల రత్నగిరి బాబు, కార్యదర్శిగా కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, కోశాధికారిగా కావూరి రవిచంద్ర, సంయుక్త కార్యదర్శులుగా రాయపాటి గోపాలకృష్ణ, ఘంట పున్నారావు, సభ్యులుగా వడ్లమూడి శివరామకృష్ణయ్య, డాక్టర్ కొండబొలు కృష్ణప్రసాదు, కరణం పట్టాభి సీతారామయ్య, మర్రిపూడి సీతారామయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా గోరంట్ల పున్నయ్య చౌదరి, పెద్ది సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.



నూతనంగా ఎన్నికైన కమ్మజన సేవ సమితి పాలక వర్గ సభ్యులు

లివర్, జీర్ణకోశ వ్యాధులపై నేడు ఆరోగ్యసభ

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో అనేక మందిని బాధిస్తోన్న లివర్, జీర్ణకోశ వ్యాధులపై అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఆరోగ్యసభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాస్ట్రిక్ సమస్యలైన కడుపులో మంట, ఉబ్బరం, ఛాతిలో మంట, తీవ్రమైన కడుపునొప్పి, ఆకలిలేకపోవటం, వికారం, వాంతులు వంటి అనేక సమస్యలపై గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ పోసాని శ్రీనివాసరావు హాజరై ప్రసంగిస్తారన్నారు.


ఆగిపోయిన లిఫ్ట్ పనులు


వారసత్వ కేంద్రం

- పర్యాటక కేంద్రం మూత పడి ఆరేళ్లు
- శిథిలమవుతున్న కట్టడాలు..
- దుమ్ముకొట్టుకుపోతున్న శిల్పాలు
- పర్యాటక శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ

వారసత్వ కేంద్రంలో.. అలసత్వం ప్రదర్శన


ముసుగు వేసిన అమరావతి శిల్పాలు


నిరుప యోగంగా ఉన్న బయో టాయిలెట్లు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వారసత్వం కేంద్రం... పాలకుల అలసత్వానికి నిదర్శనగా మారింది. చారిత్రక శిల్పాలు ముసుగులు ధరించి.. దుమ్ము కొట్టుకుపోతున్నాయి. పర్యాటకులతో కళకళలాడాల్సిన కేంద్రం.. పావురాళ్ల వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. వారసత్వ కేంద్రంగా.. కేంద్ర ప్రభుత్వం గుర్తించి విడుదల చేసిన నిధులు ఖర్చు అయినా.. ప్రజలకు ప్రయోజనం లేకుండాపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో మూత పడిన కేంద్రం నేటికీ.. తెరుచుకోకపోవడం విస్మయానికి గురిచేసే అంశమైతే.. పర్యాటక శాఖ నిర్లక్ష్యానికి ఇది పరాకాష్టగా చేరింది. అమరావతిలోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న కాలచక్ర మ్యూజియంను గత టీడీపీ ప్రభుత్వంలో.. పర్యాటక సలహాదారు గల్లా అమరేశ్వర్ వారసత్వ కేంద్రంగా పేరు మార్చారు. సుమారు రూ.7.5 కోట్ల హెరిటేజ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి రావడంతో.. వారసత్వ కేంద్రం మూతపడింది. మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్పాలపై గుడ్డలు కప్పి ఉంచారు. నిర్మాణంలో ఉన్న పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆగిపోయిన పనులు పూర్తి చేస్తారని అనుకున్న స్థానికులకు నిరాశే ఎదురైంది. వారసత్వ కేంద్రంలో ప్రాచీన కళలకు ప్రోత్సాహం, ఆడిటోరియం, సెంట్రల్ ఏసీ, చిన్న పిల్లలకు వేసవిలో ప్లే స్కూల్ పేరుతో ప్రత్యేక హాలు కేటాయించారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ ఇక్కడ బయో టాయిలెట్లు, సోలార్ ప్యానల్స్, వర్షపు నీటి నిల్వ సౌకర్యాల కల్పనకు.. రూ.50లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ పనులు కూడా అర్థంతరంగా ఆగిపోయి ఆరు సంవత్సరాలు అవుతోంది. మూత పడిన ఈ కేంద్రంలో పావురాళ్ల వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. పర్యాటక శాఖకు చెందిన సామగ్రి కూడా ఇందులో భద్రపరచడంతో స్టోర్ రూంగా మారింది. వారసత్వ కేంద్రం బయట మాత్రం.. భారీ వాహనాలు, చిరు వ్యాపారుల దుకాణాలు దర్శనమిస్తాయి. ఇప్పటికైన పర్యాటక శాఖ అధికారులు స్పందించి వారసత్వ కేంద్రంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి పర్యా టకులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. అలాగే.. పెదకూరపాడు నియోజకవర్గంలోని పర్యాటక కట్ట డాల మనుగడకు, అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేసి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను ప్రజలు కోరుతున్నారు.

గిరిజనుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- గుంటూరులో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో పెమ్మసాని, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్, ఏకలవ్యుడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, వెన్నలకంటి రాఘవయ్య, చెంచులక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. దీక్షతో విలు విద్య నేర్చుకున్న ఏకలవ్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, పేదల కోసం అవిశ్రాంతమైన పోరాటం చేసిన వెన్నలకంటి రాఘవయ్యను గిరిజనులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో సీఎం కేంద్ర గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేశారని, గిరిజనులు సాగు చేస్తున్న అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. పార్లమెంట్ అవరణలోనూ అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేయించారన్నారు. నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ దుకాణాల కేటాయింపులో గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గిరిజనుల జనబా ప్రతిపాదికన రాజకీయంగా, అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు. బీసీ కార్పోరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు దేశానికి వెన్నుముక అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ విద్య ద్వారానే ప్రపంచాన్ని జయించవచ్చని, గిరిజనుల పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలన్నారు.ఈ సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు చంద్రానాయక్, కట్టా వెంకటేశ్వర్లు, బాపట్ల ఏసుబాబు, బాపట్ల బ్రహ్మయ్య, కొమరిగిరి సూరిబాబు, సంజయ్ బాబు, కృష్ణా నాయక్, కోటయ్య, తలపాల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా యూనిట్‌గా తీసుకొని గిరిజనులకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, అటవీ భూములు సాగులు చేసుకునేవారికి పట్టాలు ఇవ్వాలని, గిరిజన వసతి గృహాల్లో మాన్యువల్‌గా అడ్మిషన్లు నిర్వహించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలుకు ఆధార్ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. జిల్లాలో గిరిజన భవన్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. సభలో గిరిజన సంప్రదాయాన్ని తెలియచేసేలా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత స్థానిక కొత్తపేట నాజ్ సెంటరులో ఏకలవ్య, వెన్నలకంటి రాఘవయ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు మంత్రి పెమ్మసాని, కమిషనరు శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గిరిజన సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళీధర్, డిప్యూటీ మేయర్ సజీల, విద్యార్థులు పాల్గొన్నారు.


గుంటూరు నాజ్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, గిరిజన సంఘాల నాయకులు

తెలుగు సాహిత్యం యువత జీవన నైపుణ్యాలకు దిక్సూచి

- సుప్రీం కోర్టు విశ్రాంత సీజే జస్టిస్ ఎన్వీ రమణ

గుంటూరు(విద్య),ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మన తెలుగు సాహిత్యం, అద్భుత జీవన నైపుణ్య వాహిణి అని, ఆత్మన్యూనత, అభద్రత, అశాంతి, నైరాశ్యంలో ఉన్న యువతకు తెలుగు స్వాంతన చేకూర్చే అద్భుత సంజీవని అని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఉద్బోధించారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన పదవ స్నాతకోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వేమన శతకం, సుమతీ, కృష్ణ, దాశరధి శతం వంటివి చదితే ఎన్నో జీవన సత్యాలు, జీవన నైపుణ్యాలు తెలుస్తాయని విద్యార్థులకు సూచించార. శ్రీశ్రీ రచించిన మహా ప్రస్థానం వంటి గ్రంథాలు యువతకు స్ఫూర్తిని, మార్గనిర్దేశిస్తాయన్నారు. యువత తెలుగు సాహిత్యం గొప్పదనం తెలుసుకోవాలని సూచించారు. తమ హక్కుల కోసం అయిదేళ్ల పాటు పోరాటం చేసిన అమరావతి రైతుల విజయగాథ నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలవాలన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇదో మూస పద్ధతి..

పదవ తరగతి తర్వాత కార్పొరేట్ కళాశాలలో చేరడం అక్కడ జైలు లాంటి గదుల్లో విద్యనభ్యసించి ర్యాంకు సాధించడం.. తర్వాత ఇంజనీరింగ్ పూర్తిచేసి ఇతర దేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో డాలర్ల సంపాదించడం అనే మూస పద్ధతి కొనసాగుతోందని విశ్రాంత సీజే ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. దీనివల్ల యువత జీవితంలో అభివృద్ధి ఆగిపోతోందన్నారు. ఫలితంగా.. సృజనాత్మకంగా ఆలోచించడం, సిద్ధాంతాలను విస్తరింప చేయడం, జ్ఞానాన్ని పెంచుకోవడం జరగడం లేదని ఆం దోళన వ్యక్తం చేశారు.



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు

సమస్యల్ని అస్త్రాలుగా మార్చుకోవాలి: ఆచార్య మధుమూర్తి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి మాట్లాడుతూ విజన్ ఆంధ్ర - 2047 చదువే తమ ముందున్న లక్ష్యమని, ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ముందున్న సమస్యలను అవకాశాలుగా మార్చుకొని వాటికి పరిష్కార మార్గాలను సాధించాలన్నారు. యువత వ్యక్తిత్వ నైపుణ్యాలను మెరుగు పరుచుకొని నూతన ఆవిష్కరణల వైపు ఆలోచనలను చేయాలని, సాంకేతిక రంగంలో భారతదేశం పురోగతి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడ మిక్ అండ్ రీసెర్చి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు పి.గోపిచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2021 - 25 సంవత్సర 37వ బ్యాచ్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టం, కంప్యూటర్ సైన్స్ (డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ (ఇంటర్నెట్ అఫ్ థింకింగ్), ఇన్ఫర్మే షన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రిక ల్ అం డ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రి పూర్తి చేసుకున్న 1023 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ డిగ్రి పట్టాలను, 153 మందికి పీజీ పట్టాలను, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అతిథులు ప్రదానం చేశారు.

మూడో లైన్ నిర్మాణం

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

- రెండు రోజులు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి - దుగ్గిరాల, తెనాలి - చుండూరు మధ్యన మూడో రైలు మార్గం నిర్మాణ పనుల కారణంగా నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రెండు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12733 తిరుపతి - లింగంపల్లి.. నెల 17, 18 తేదీలు, 12734 లింగంపల్లి - తిరుపతి 18, 19 తేదీల్లో రద్దు చేశామన్నారు. 22708 తిరుపతి - విశాఖపట్టణం ఏసీ డబుల్ డెక్కర్ ఈ నెల 13, 15, 17 తేదీల్లో.. 22707 విశాఖపట్టణం - తిరుపతి ఏసీ డబుల్ డెక్కర్‌ని ఈ నెల 14, 16, 18 తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు.

8 రోజుల పాటు డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లు గుంటూరు వరకే..

17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు, 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు వరకే ప్రయాణిస్తాయని డీఆర్ఎం తెలిపారు. ఈ రెండు రైళ్లను గుంటూరు - రేపల్లె మధ్యన రద్దు చేసినటు పేర్కొన్నారు. వీటి జోడి రైళ్లు 17626 రేపల్లె - వికారబాద్, 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు నుంచి బయలు దేరుతాయని తెలిపారు.

11 రోజులు.. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు విజయవాడ నుంచి మంగళగిరి మీదగా గుంటూరు వచ్చి లింగంపల్లికి బయలుదేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి మంగళగిరి మీదగా విజయవాడ అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది.

వందేభారత్ కొంచెం ఆలస్యంగా...

20702 తిరుపతి - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18 తేదీల్లో తెనాలి నుంచి నేరుగా విజయవాడ వెళ్లి అక్కడి నుంచి గుంటూరుకు వచ్చి సికింద్రాబాద్‌కు బయలుదేరుతుంది. దీని వల్ల కొంత ఆలస్యమవుతుంది. 20701 సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ కూడా గుంటూరు నుంచి విజయవాడ వెళ్లి అక్కడి నుంచి తిరుపతికి బయలుదేరుతుంది.

శబరి, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లు కాజీపేట మార్గంలో...

17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18 తేదీల్లో తెనాలి నుంచి విజయవాడ, కాజీపేట మీదగా సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18న కాజీపేట, విజయవాడ, తెనాలి మీదగా ప్రయాణిస్తుంది. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి చెన్నై ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18, 19 తేదీల్లో, 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ చెన్నై ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18, 19, 20 తేదీల్లో కాజీపేట మార్గంలో ప్రయాణిస్తాయి.

7 నుంచి రెగ్యులర్ మార్గంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్ నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం చర్లపల్లి నుంచి లింగంపల్లికి నేరుగా ప్రయాణిస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 7 నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణించనుంది. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ పైన పేర్కొన్న తేదీ నుంచి చర్లపల్లికి సాయంత్రం 6.05కి, సికింద్రాబాద్‌కు 6.20కి, బేగంటపేటకు 6.35, లింగంపల్లికి రాత్రి 7.40కి చేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వచ్చే నెల 7 నుంచి లింగంపల్లిలో ఉదయం 6.15కి బయలుదేరి బేగంటపేకు 6.35కి, సికింద్రాబాద్‌కు 6.55, చర్లపల్లికి 7.15కి చేరుకొని గుంటూరు మీదగా విశాఖపట్టణం బయలుదేరి వెళతుంది.

విద్యార్థి ప్రతిభా వాణి!

- 72 పేజీల బుక్‌లెట్‌లోనే అన్ని పరీక్షల సమాధానాలు
- విద్యార్థి విద్యా ప్రమాణాలు తెలియజేస్తుంది
- ఎఫ్ఏ-1 నుంచి అమలుకు విద్యాశాఖ సిద్ధం

సత్తెనపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఈ 72 పేజీల బుక్‌లెట్ విద్యార్థుల ప్రతిభకు కొలమానం కానుంది. ఒక విద్యార్థి ఏ సబ్జెక్టులో మెరుగ్గా ఉన్నాడు.. ఏ పాఠ్యాంశంలో వెనుకబడి ఉన్నాడో... ఈ సమాధాన పుస్తకమే తెలియజేస్తుంది. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు.. సంవత్సర పరీక్షలకు ముందు.. నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ విధానాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులకు పరీక్ష పత్రాలు ఇచ్చి.. జవాబులను టావులు, లేదా ఇతర తెల్ల కాగితాల్లో రాయిస్తారు. ఈ జవాబు పత్రాలు విద్యార్థులు మార్కులు చూసుకున్నంత వరకే ఉంటాయి. ఆ తర్వాత ఒక మూలకు చేరుతాయి. విద్యా సంవత్సరం ముగింపులో.. అన్ని పరీక్షల జవాబు పత్రాలను ఒక చోటకి చేర్చి చూసినప్పుడు.. పరీక్షకు పరీక్షకు మధ్య.. విద్యార్థి ప్రమాణాలు ఏ మేరకు మెరుగుపడ్డాయో తెలుస్తుంది. ఇప్పుడు ఇదే పనిని పాఠశాల విద్యాశాఖ చేస్తోంది.



బుక్‌లెట్

ఎఫ్ ఏ 1 నుంచి ప్రారంభం..

ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఎఫ్-ఏ 1 నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు జవాబులు రాయడానికి 72 పేజీలతో కూడిన ఈ బుక్‌లెట్ ఇవ్వనున్నారు. ఒక తరగతిలో ఎన్ని పాఠ్యాంశాలు ఉంటాయో అన్నింటికీ ఒక్కో బుక్‌లెట్ ఇస్తారు. ప్రశ్న పత్రాల్లోని జవాబులు ఈ బుక్‌లెట్‌లో రాయాలి. ఇలా అన్ని పరీక్షల జవాబులను ఈ బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థుల పఠన పురోగతి, ప్రమాణాలను ఒకే చోట అందుబాటులో ఉంటాయని విద్యాశాఖ అధికారులు చెపుతున్నారు. పరీక్షకు..పరీక్షకు మధ్య విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో తెలుస్తుంది. విద్యార్థుల రాసిన జవాబులను దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు రిమార్కులను అక్కడే సూచించాల్సి ఉంటుంది. ఉదాహరణకు విద్యార్థి ఒక ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకుండా.. మరో జవాబు రాస్తే అది కచ్చితంగా తప్పు అవుతుంది. దానికి ఉపాధ్యాయులు సున్నా మార్కులు వేస్తారు. అలా ఎందుకు ఇచ్చారో.. ఉపాధ్యాయులు జవాబు పక్కనే రిమార్క్స్ చెప్పాల్సి ఉంటుంది. ఈ విధానం విద్యార్థి విద్యా ప్రమాణాలు తెలియజేస్తుందని స్థానిక ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

నేలమట్టం!



భారీ యంత్రంతో కొనసాగుతున్న ఆర్వోబీ కూల్చివేత

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి) కూల్చివేత పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ పనులకు అంకురార్పణ జరగగా శనివారం ఉదయం నుంచి భారీ యంత్రంతో కూల్చివేత కొనసాగుతోంది. అరండల్‌పేట, బ్రాడీపేట వైపున బ్రిడ్జి కూల్చివేతని కాంట్రాక్టు ఏజెన్సీ మొదలు పెట్టింది. రెండో శనివారం సెలవుదినం కావడంతో ట్రాఫిక్ సమస్య ప్రభావం నగరంలో అంతగా కనిపించ లేదు. సోమవారం విద్యా సంస్థల బస్సులన్నీ రోడ్ల పైకి వచ్చిన తర్వాతే బ్రిడ్జి కూల్చివేత వల్ల ఏ ప్రాంతంలో సమస్యలు తలెత్తుతాయో స్పష్టమవుతుంది. ట్రాఫిక్ మళ్లిం పునకు.. ఇక్కడ ప్రత్యామ్నాయం లేదు. ఇందుకు కారణం ఈ బ్రిడ్జి కిందనే గుంటూరు రైల్వే యార్డు ఉంది. ఏ చిన్న సమస్య తలెత్తినా రైళ్లన్నీ నిలిచిపోతాయి. కొంచెం దూరమైనప్పటికీ మూడొంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ/ఆర్వోబీ, ఇన్నర్‌రింగు రోడ్డు మీదగా రాకపోకల ను మళ్లిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రెండేళ్ల కాల వ్యవధిని నిర్దేశించుకొన్నారు. ఆలోపు పూర్తి చేయాలంటే పనులు వేగవంతంగా జరగాలి. రోజురోజుకు పురోగతి ఉండాలి. ఇప్పటికే ఇరువైపులా రెండు పిల్లర్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మరో 19 పిల్లర్లను నిర్మించాలి. రీఇన్‌ఫోర్స్‌డ్ వాల్ వరకు తొలుత బ్రిడ్జిని తొలగిస్తున్నారు. ఆ తర్వాత పాత బ్రిడ్జి పిల్లర్లను ఒక్కొక్కటిగా తొలగించేందుకు నిర్ణయించారు. మరోవైపు బ్రాడీపేట ఒకటో లైను నుంచి లాడ్జి సెంటర్ వరకు రోడ్డుని 120 అడుగులకు విస్తరిస్తున్నారు. దీనిపై కొందరు కోర్టులో కేసులు వేశారు. అయినప్పటికీ కార్పొరేషన్ ముందుగా కన్‌సెంట్ ఇచ్చిన వారి భవనాలను తొలగిస్తోంది. ప్రజాప్రయోజనాల రీత్యా ఈ నిర్ణయం తీసుకొన్నందున అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తోంది. కాగా ఈ బ్రిడ్జి డిజైన్‌ని వ్యతిరేకిస్తున్న వారు కోర్టులో న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్		
అంధేరా	హిందీ సిరీస్	ఆగస్టు 14
జియో హాట్‌స్టార్		
సారే జహాసే అచ్ఛా	హిందీ చిత్రం	ఆగస్టు 13
జీ 5		
టెహ్రాన్	హిందీ చిత్రం	ఆగస్టు 14
జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ	మలయాళ చిత్రం	ఆగస్టు 15
ఈటీవి విన్		
కానిస్టేబుల్ కనకం	తెలుగు సిరీస్	ఆగస్టు 14
సోనీ లివ్		
కోర్ట్ కచేరీ	హిందీ సిరీస్	ఆగస్టు 13
బుక్ మై షో		
సర్	హిందీ సిరీస్	ఆగస్టు 11


జలుబు చేయకుండా.. ఇలా...

మనలో చాలామందికి వర్షాకాలంలో తరచూ జలుబు చేస్తూ ఉంటుంది. దీంతో జ్వరం, తలనొప్పి, దగ్గు, తుమ్ములు వేధిస్తుంటాయి. అలాకాకుండా ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



- అనుకోకుండా వర్షంలో తడిసినప్పుడు ఇంటికి రాగానే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. శరీరాన్ని, శిరోజాలను కాటన్ తువాలుతో తడిలేకుండా తుడుచుకోవాలి.
- శరీరాన్ని వెచ్చగా ఉంచే దుస్తులు ధరించాలి.
- అప్పుడే వండిన వేడి ఆహారాన్ని తీసుకోవాలి. ఫ్రిజ్‌లో ఉంచిన చల్లని నీళ్లు తాగకూడదు. మంచినీటిని కొద్దిగా వేడి చేసుకుని తాగడం మంచిది. పలుచగా తయారుచేసిన పప్పు, మిరియాల చారు లాంటివాటిని భోజనంలో చేర్చుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.
- రాత్రి పడుకునేముందు కొద్దిగా పసుపు కలిపిన గోరువెచ్చని పాలు లేదా తులసి-అల్లం టీ లాంటి వేడి పానీయాలు తాగితే ఊపిరితిత్తుల్లో శ్లేష్మం చేరదు. వేడి వేడి పాలలో అరచెంచా మిరియాలపొడి కలుపుకుని తాగినా జలుబు దరిచేరదు.
- వర్షం వల్ల వాతావరణంలో హానికారక బ్యాక్టీరియాలు, వైరస్‌లు త్వరగా వ్యాప్తిచెందుతూ ఉంటాయి. వీటివల్ల రోగనిరోధక శక్తి బలహీనమై పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. వీటినుంచి బయటపడేందుకు నారింజ, దానిమ్మ, జామ లాంటి సి విటమిన్ అధికంగా ఉన్న పండ్లు తినాలి. బొప్పాయి, కివి పండ్లు కూడా మేలు చేస్తాయి. తరచూ నిమ్మ, ఉసిరిని ఆహారంలో చేర్చుకున్నా మంచి ఫలితం ఉంటుంది.
- ఉదయం లేవగానే జలుబు చేసిందనిపిస్తే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడి కలుపుకుని తాగితే ఉపశమనంగా అనిపిస్తుంది. ఒక కప్పు గ్రీన్ టీ తాగినా ప్రయోజనం ఉంటుంది.

విన్నర్



ఈసారి జాతీయ చలనచిత్ర అవార్డుల్లో 'గాంధీ తాత చెట్టు'లో నటించిన స్టార్ డైరక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డికి జాతీయ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది. సంగీతం అంటే తనకున్న ఇష్టాన్నీ, అమ్మానాన్నలతో తనకున్న అనుబంధాన్నీ పంచుకుంది.

నాకు కోపం వస్తే నాన్నకు కంగారే

జాతీయ అవార్డు వచ్చిందని ముందుగా ఎవరు చెప్పారు?

నేను అమెరికాలో చదువుకుంటున్నా. అందువల్ల భారత్‌లో పగలు అయితే మాకు రాత్రి. నేను పడుకొని ఉంటే అమ్మ ఫోన్ చేసి... "నేషనల్ అవార్డులు ప్రకటిస్తున్నారు... చూడు" అని చెప్పింది. స్క్రీన్ మీద నా పేరు కనిపించినప్పుడు ముందు నమ్మబుద్ధి కాలేదు. నాకు అవార్డు వచ్చిందనే విషయాన్ని అర్థం చేసుకోవటానికి కొంత సమయం పట్టింది.

'గాంధీ తాత చెట్టు' సినిమాలో తొలి షాట్ గుర్తుందా? కెమెరా ముందు నిలబడటానికి భయమేసిందా?

అది ఒక మాంటేజ్ షాట్. అందులో నేను స్కూలుకు వెళ్తూ ఉంటా. మొదటిసారి కెమెరా ముందు నిలబడినప్పుడు నాకు అంత భయం వేయలేదు. ఎందుకంటే నేను చిన్నప్పటి నుంచీ నాన్నతో షూటింగ్స్‌కు వెళ్లేదాన్ని. సెట్స్‌లో వందల మంది ఉంటారు. ఆ వాతావరణం ఎలా ఉంటుందో నాకు తెలుసు. అందువల్ల నాకు ఇబ్బంది అనిపించలేదు. అంతేకాకుండా ఈ సినిమాలో నా స్నేహితులుగా నటించిన నిహాల్ ఆనంద్, భానుప్రకాష్ షూటింగ్ సమయంలో మంచి ఫ్రెండ్స్ అయిపోయారు. దాంతో షూటింగ్ ఫన్‌గా సాగింది. అంతేకాకుండా అమ్మ కూడా నాతో ఎప్పుడూ ఉండేది. నాన్న ఆ సమయంలో 'పుష్ప2'లో బిజీగా ఉన్నారు. అందువల్ల అప్పుడప్పుడూ షూటింగ్‌కు వచ్చేవారు.

చాలా కష్టమనిపించిన సీన్ ఏదైనా ఉందా?

క్లైమాక్స్‌లో నేను ఒక చెట్టు దగ్గర ఏడుస్తూ ఉంటా. బ్యాక్‌గ్రౌండ్‌లో 'రఘుపతి రాఘవ రాజారాం' పాట వస్తూ ఉంటుంది. సరిగ్గా ఆ సమయంలోనే వాన పడింది. దాంతో సీనంతా బాగా సెట్ అయింది. ఇక్కడ ఈ సినిమాకు సంబంధించి కొంత చెప్పాలి. నాకు చిన్నప్పటి నుంచీ మ్యూజిక్ అంటే ఇష్టం. మూడేళ్ల కిందట అమ్మ నాకు ఈ సినిమా కథ చెప్పింది. నాకు చాలా నచ్చింది. డైరక్టర్ నన్ను గాంధీతాత వేషం వేయమని అడిగారు. నేను చేయగలనా.. లేదా అనే సందేహం కలిగింది. భయం వేసింది. నాన్న ధైర్యం చెప్పారు. ఇక డైరక్టర్ మల్లాది పద్మావతి కూడా నాకు చాలా సపోర్ట్ ఇచ్చారు.

నువ్వు అమ్మ పిల్లవా.. నాన్న పిల్లవా..?

అలా అడిగితే కష్టం. నేను నాన్న పిల్లనే. మా ఇద్దరికీ మ్యూజిక్ అంటే ఇష్టం. నాకు ఏదైనా పాట నచ్చితే నాన్నకు షేర్ చేస్తా. నాన్నకు నచ్చితే నాకు షేర్ చేస్తారు. మా ఇద్దరినీ ఎప్పుడూ మ్యూజిక్ కలుపుతూనే ఉంటుంది. అయితే ఏదైనా చెప్పాలంటే మాత్రం మొదట అమ్మకే చెబుతాను. నాన్న ఎప్పుడూ పనిలో బిజీగా ఉంటారు. అందువల్ల ఆయనకు తరువాత చెబుతాను.

నువ్వు మ్యూజిక్ కోర్సులో ఎందుకు చేరావు?

నాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ఐదేళ్ల వయస్సు నుంచీ పాడుతూ ఉండేదాన్ని. ఇంటికి ఎవరైనా వస్తే... అమ్మ నన్ను ఏదైనా పాడమని అడిగేది. నేను పాడేదాన్ని. అలా వయస్సుతో పాటు నాకు సంగీతం పట్ల ప్రేమ కూడా పెరుగుతూ వచ్చింది. అందుకే అమెరికాలో మ్యూజిక్ కోర్సులో చేరాను. నా హైస్కూలు అయిపోయిన తర్వాత కాలేజీలో కూడా మ్యూజిక్‌కు సంబంధించిన కోర్సులోనే చేరతాను. సంగీతం నాకు చాలా నేర్పింది. జీవితం పట్ల నాకున్న అభిప్రాయాలను మార్చింది.

నీకు ఇష్టమైన పాటలు, సినిమాలు?

తెలుగులో... 'నాన్నకు ప్రేమ'తో సినిమాలో 'లవ్ మీ ఎగైన్..' పాట నాకు చాలా ఇష్టం. ఇంగ్లీషులో అయితే చాలా పాటలున్నాయి. 'సీతారామం, రంగస్థలం' సినిమాలంటే చాలా ఇష్టం. 'బేబీ, మ్యాడ్ స్క్వేర్' చూశాను. చాలా బాగున్నాయి.

ఏవైనా పాటలు రికార్డు చేశావా?

ఇంకా లేదు. నేను చదువుతున్న స్కూల్లో మ్యూజికల్ ప్రొడక్షన్స్ జరుగుతూ ఉంటాయి. గత ఏడాది మా స్కూల్లో... 'వికెడ్' అనే మ్యూజికల్ ప్రోగ్రామ్ చేశాం. అందులో ఒక సోలో పాడాను. ఒక పాట కండక్ట్ కూడా చేశాను. 2023లో ఒక మ్యూజికల్ ప్రోగ్రామ్ చేశాం. దానికి 'మోస్ట్ కాంట్రిబ్యూషన్ అవార్డు' వచ్చింది.

నాన్న పెద్ద డైరక్టర్ కదా.. ఎవరైనా తనని పొగుడుతుంటే ఎలా అనిపిస్తుంది?

నాన్నకు పనే ప్రపంచం. పని కోసం ప్రాణం పెడతాడు. బన్నీ మామ, తారక్ అంకుల్, చరణ్ అంకుల్ కలిసినప్పుడు నాన్న గురించి ఇదే చెబుతూ ఉంటారు.

అమ్మానాన్నల మీద కోపం వస్తే ఏం చేస్తావు?

నేను ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాను. కానీ కోపం వస్తే మాత్రం సైలెంట్ అయిపోతాను. రూమ్‌లోకి వెళ్లి కూర్చుంటాను. నాకు కోపం వచ్చిందనే విషయం అమ్మానాన్నలకు తెలుస్తుంది. అమ్మ అయితే ముందే పసిగట్టేస్తుంది. కొద్దిసేపు తర్వాత మళ్లీ బయటకు వచ్చేస్తా. అప్పుడు అమ్మ లాజికల్‌గా అన్నీ వివరిస్తుంది. నాన్న అయితే... "ఏమైంది పండు.. ఏం జరిగింది..' అని కంగారుపడిపోతాడు. నా కోపం తీరటానికి నాకు పెద్ద డిమాండ్స్ ఏమీ ఉండవు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



- ప్రస్తుతం నాకున్న క్లోజ్‌ఫ్రెండ్ నా ఫోన్. మా స్కూల్లో ఉన్న అమ్మాయిలందరూ నా ఫ్రెండ్సే. నేను అందరితో బాగా మాట్లాడతాను. కలివిడిగా ఉంటా. కానీ పార్టీలంటే పెద్ద ఇష్టం ఉండదు. లౌడ్ మ్యూజిక్, తెలియని వ్యక్తులు ఉన్న ప్రదేశాలకు వెళ్లను.
- చాలామంది 'మేము ఫార్మల్‌గా ఉంటాం. సినిమా ఫ్యామిలీలు అలాగే ఉంటాయి' అనుకుంటారు. కానీ మేము దానికి పూర్తి ఆపోజిట్‌గా ఉంటాం. మా ఇంట్లో చాలామంది ఉంటారు. అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటాం. నాకు... తమ్ముడికి మధ్య మంచి బాండింగ్ ఉంది. నాకు ఈ అవార్డు వచ్చినప్పటి నుంచీ నేను ఏంమాట్లాడినా... 'నేషనల్ అవార్డు విన్నర్ కదా..' అంటూ ఆటపట్టిస్తున్నాడు.
- నేను సోషల్ మీడియాలో చురుకుగా లేను. నా ఫోన్‌లో ఒక యాప్ ఉంది. అది సోషల్ మీడియాను బ్లాక్ చేస్తుంది. అందువల్ల నాకు సోషల్ మీడియా చూసే అవకాశమే ఉండదు.
- ప్రస్తుతం స్కూలుకు సెలవులు ఉన్నాయి. అందువల్ల నాకు అవార్డు వచ్చిందన్న విషయం ఇంకా స్కూల్లో ఎక్కువమందికి తెలియదు. స్కూలువాళ్లకు అమ్మ మెయిల్ పెట్టిందనుకుంటా. వాళ్లకు అందిన వెంటనే ఇన్‌స్టాలో పెడతారు.
- నాకు యానిమేషన్ సిరీస్‌లంటే చాలా ఇష్టం. 'జుట్సు కైసెన్, బెసెర్క్, హైకూ' ఎంతో నచ్చాయి.



వీటినీ రోజూ శుభ్రం చేయాలి

ప్రతిరోజూ వంటింట్లో ఎన్నో వస్తువులు వాడతాం. వాటిలో కొన్నింటిని పైపైన మాత్రమే శుభ్రం చేస్తాం. దాంతో వాటి మీద బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. కాబట్టి వాటిని ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం..

- **చాపింగ్ బోర్డు:** రోజూ కూరగాయలను కోసిన తరువాత చాపింగ్ బోర్డును నీటితో కడిగేసి పక్కన పెట్టేస్తారు. ఇలా చేయడం వలన అది పూర్తిగా శుభ్రం అవ్వదు దాంతో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. కాబట్టి రోజూ సబ్బు నీటితో చాపింగ్‌బోర్డును శుభ్రం చేయాలి. వారానికోసారి బ్లీచ్‌తో కూడా శుభ్రం చేయాలి.
- **సిలికాన్ బ్రష్‌లు:** సిలికాన్ స్పూన్లు. స్పాచులాలు, బ్రష్‌లు వాడుతుంటాం. వీటిమీద కంటికి కనిపించని సన్నని రంధ్రాలుంటాయి. వాటిని వాడేటప్పుడు నూనె లాంటివి ఆ సన్నని రంధ్రాల్లోకి చేరతాయి. వీటిని కూడా పైపైన శుభ్రం చేస్తారు. వీటిని గోరువెచ్చని నీటిలో ఉంచి సబ్బు నీటితో శుభ్రం చేస్తే ఆ అవశేషాలు తొలగిపోతాయి.
- **రబ్బర్ వాచర్లు:** ఏదో ఒకదాని కోసం తరచూ మిక్సీని వాడతాం. అయితే వాడిన తరువాత జార్‌లను శుభ్రం చేస్తారు. కానీ మిక్సీ గిన్నె మూతకు ఉండే వాచర్‌ను తీసి శుభ్రం చేయరు. దాంతో ఆ మధ్యలోకి బ్యాక్టీరియా చేరుతుంది. కాబట్టి వాడిన ప్రతిసారీ మిక్సీ జార్ మూత వాచర్లు తీసి శుభ్రం చేయాలి.
- **ఫ్రిడ్జ్ హ్యాండిల్:** ఫ్రిజ్‌ను లోపల ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తాం. కానీ హ్యాండిల్‌ను మాత్రం శుభ్రం చేయరు. దాంతో ఆ పనులు చేస్తూ ఈ పని చేస్తూ ఫ్రిడ్జిని తెరవడం వలన హ్యాండిల్ జిడ్డుగా, మురికిగా మారుతుంది. కాబట్టి దానిని కూడా తరచూ శుభ్రం చేస్తుండాలి.

వెనిగర్‌ను ఇందుకూ వాడొచ్చు..

సలాడ్‌లు, కొన్ని రకాల వంటల్లో వెనిగర్‌ను వాడుతుంటాం. వెనిగర్‌ను వంట గదిలో ఇంకా చాలా రకాలుగా కూడా వాడొచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం..

- మాంసం ముక్కలకు కొంచెం వెనిగర్ రాస్తే అవి త్వరగా ఉడుకుతాయి. అలాగే మాంసం మీద ఉండే హానికర బ్యాక్టీరియాను కూడా వెనిగర్ తొలగిస్తుంది.
- వంట గదిలోని వస్తువులను శుభ్రం చేయడంలోనూ వెనిగర్ బాగా పనిచేస్తుంది. చాపింగ్ బోర్డు, జిడ్డు అంటిన స్టీల్ వస్తువులను వెనిగర్ కలిపిన నీటితో శుభ్రం చేస్తే మంచి ఫలితముంటుంది.
- మార్కెట్ నుంచి తెచ్చుకునే కూరగాయలు, ఆకుకూరలు, పళ్ల మీద క్రిమి సంహారక మందుల అవశేషాలు ఉంటాయి. ఎంత శుభ్రం చేసినా అవి వదిలిపోవు. అలాంటప్పుడు నీటిలో కొంచెం వెనిగర్ కలిపి శుభ్రం చేస్తే ఆ అవశేషాలు వదిలిపోతాయి.



నవ శకం

మహిళా శక్తి... గుర్రాలపై గస్తీ

అశ్వాన్ని అధిరోహించి... గస్తీ కాయాలంటే మగ పోలీసులేనా..? మేమూ తక్కువేం కాదంటున్నారు మహిళా కానిస్టేబుళ్లు. గుర్రపు స్వారీలో శిక్షణ పొంది... మెరికల్లా తయారై... 'సిటీ మౌంటెడ్ పోలీస్ విభాగం'లో భాగం అయ్యారు. అశ్వదళంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళా బృందంగా చరిత్ర సృష్టించారు. అసమానతలను దాటి... అవమానలను భరించి... అనుకున్నది సాధించిన ఈ పదిమంది మౌంటెడ్ పోలీస్ మహిళా టీమ్‌పై 'నవ్య' ప్రత్యేక కథనం.

'చీపుర్లు అమ్ముకోక చదువెందుకు' అన్నారు...

నాపేరు ఎం.రేణుక. మాది హైదరాబాద్. అమ్మానాన్నలు భీమా, వెంకటేష్... చీపుర్లు అమ్ముతూ మమ్మల్ని పోషించేవారు. మేం చదువుకొంటామంటే... 'చీపుర్లు అమ్ముకునేవాళ్లకు చదువెందుకు' అని కొంతమంది హేళన చేశారు. దాంతో మా మామయ్య భగవాన్ నన్ను, అక్కను చేరదీశాడు. ఇద్దరినీ కష్టపడి చదివించాడు. అక్క ఎంబీబీఎస్ చదివి డెంటిస్టు అయ్యింది. ఎంబీఏ చదివిన నేను బ్యాంకు ఉద్యోగం చేయాలనుకున్నాను. అనుకోకుండా కానిస్టేబుల్ ఉద్యోగానికి అప్లై చేశాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. పోలీస్ ఉద్యోగం వచ్చిందని తెలియగానే ఆ రోజు చదువు వద్దన్నవారి నోళ్లు మూతపడ్డాయి.

పోలీసులంటే ఇంత భయమా అనిపించేది...

నా పేరు టి.సుభద్ర. మాది కడప. అమ్మానాన్నలు ఓబుల్ రెడ్డి, మహాలక్ష్మి. వ్యవసాయం చేస్తారు. మేం ముగ్గురం అమ్మాయిలం... ఒక అన్నయ్య. నాన్న వ్యవసాయం చేస్తూనే మమ్మల్ని చదివించారు. నేను బీపీఈడీ చేశాను. మాది రాయలసీమ. నాన్న ఎప్పుడూ ఏదో ఒక గొడవలో పోలీస్ స్టేషన్‌లకు వెళ్లాల్సి వచ్చేది. స్టేషన్‌కు వెళ్లినప్పుడు పోలీసులకు ఇచ్చే గౌరవం, వాళ్లు ఊళ్లోకి వస్తున్నారంటే భయపడి ఎక్కడివాళ్లు అక్కడ గప్‌చుప్‌గా ఉండటం గమనించాను. అప్పుడు అనిపించేది... 'పోలీసులంటే ఇంత భయపడతారా' అని. అందుకే నేను పోలీస్ అయి మా నాన్నకు ఇబ్బందులు లేకుండా చూడాలని అనుకునేదాన్ని. మొదటి నుంచీ ఆటల్లో చురుగ్గా ఉండేదాన్ని. తైక్వాండో నేర్చుకున్నాను. ఇంటర్‌లో ఉన్నప్పుడు హరియాణాలో జరిగిన 'ఆలిండియా అండర్-16 తైక్వాండో' పోటీల్లో పాల్గొన్నాను. డిగ్రీ అయిపోగానే తెలంగాణలో వచ్చిన నోటిఫికేషన్ చూసి అప్లై చేశాను.



కమిషనరేట్ చరిత్రలోనే...

సిటీ పోలీస్ కమిషనరేట్ చరిత్రలో ఎప్పుడూ ఎవరూ చేయలేని ఎన్నో పనులు ఇప్పుడు చేస్తున్నాం. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. భద్రత, బందోబస్తుల్లోనూ మహిళల భాగస్వామ్యం ఉండాలని ఇటీవల 35మంది ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లతో స్వాట్ (స్విఫ్ట్ విమెన్ యాక్షన్ టీమ్) బృందాన్ని ఏర్పాటు చేశాం. వాళ్లు నేర్చుకున్న ఆత్మరక్షణ విద్య చూసి షాకయ్యాను. అప్పుడే నిర్ణయించుకున్నాం... అశ్వదళంలోనూ మహిళల భాగస్వామ్యం ఉండాలని. అందుకు తగ్గట్టుగా మొదటి బ్యాచ్‌గా పదిమందిని ఎంపిక చేశాం. అద్భుతంగా హార్స్ రైడింగ్‌లో శిక్షణ పొందారు.

- సీవీ ఆనంద్,
హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్

ఏం సాధించాం అనేదే ముఖ్యం...

నా పేరు జి.అఖిలాయాదవ్. నాన్న హెడ్ కానిస్టేబుల్. చిన్నప్పటి నుంచి నాన్న ఉద్యోగాన్ని గమనిస్తున్నాను. నేను పీజీ డిప్లమా ఇన్ క్లినికల్ న్యూట్రిషన్ చేశాను. మెడికల్ ఫీల్డ్ వైపు వెళ్దామనుకున్నా. కానీ నాన్న పోలీస్ డిపార్టుమెంట్ వైపు ప్రయత్నించమన్నారు. నాన్న ఆధ్వర్యంలోనే శిక్షణ తీసుకున్నా. మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను.

నాన్న చెప్పారు... చదువు ఆపద్దని...

నా పేరు మర్రి హవంతిక. మేం ముగ్గురు సంతానం. నాన్న రవీందర్ ఆటోడ్రైవర్. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు అమ్మ గుండెపోటుతో చనిపోయింది. చెల్లి, తమ్ముడు, నాన్న ఇబ్బంది పడతారని చదువు మానేద్దాం అనుకున్నా. కానీ నాన్న ఒప్పుకోలేదు. 'అమ్మ లేదని చదువు మానొద్దు. ఆ చదువే రేపటి నీ భవిష్యత్తు' అని చెప్పారు. నాన్న ఆటో నడిపి కష్టపడి మా ముగ్గురినీ చదివించారు. నేను గురుకులాల్లో చదివి బీకాం పూర్తి చేశాను. చెల్లి బీటెక్, తమ్ముడు ఇంటర్ చదువుతున్నారు.

ఫుట్‌బాల్ ఛాంపియన్ అవ్వాలనుకున్నా...

నా పేరు మోనాలిక. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ చదివాను. నాన్న వేణు... ఫిలిం ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్. నాకు చిన్నప్పటి నుంచీ ఆటలు, యోగా అంటే ఇష్టం. స్కూల్లో ఫుట్‌బాల్ ఛాంపియన్‌ని. 2018లో అండమాన్ నికోబార్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాను. ఫుట్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనుకున్నా. స్పోర్ట్స్ బ్యాక్ గ్రౌండ్ ఉందికదా అని పోలీస్ ఉద్యోగానికి అప్లై చేశాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

ఇద్దరు పిల్లలు... అయినా...

నా పేరు బి.అఖిల. మాది హైదరాబాద్‌లోని బోడుప్పల్. నాన్న ఆటో డ్రైవర్. అమ్మ కూలీ పనులు చేస్తుంది. మా ఇళ్లలో 10వ తరగతిలోనే పెళ్లి చేసి పంపిస్తారు. నాకూ అలాగే జరిగింది. నాకు పెళ్లై 13 ఏళ్లు. ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు 7వ తరగతి, చిన్నవాడు 5వ తరగతి చదువుతున్నారు. పెళ్లయిన కొద్ది రోజులకే అత్తారింట్లో నరకం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూశాను. ఈ నరకం నుంచి బయటపడాలంటే ఇంకా చదువుకొని ఉద్యోగం సాధించాలని అనుకున్నాను. అందుకు భర్త, అత్తామామలు, ఆడపడచు ఒప్పుకోలేదు. అయినా పట్టు విడవకుండా, అమ్మానాన్నల సహకారంతో దూరవిద్యలో బీఏ పూర్తి చేశాను. ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరాను. ఎస్సై ఉద్యోగం వస్తే భర్త, అత్తింటివారికి గట్టి సమాధానం చెప్పాలనుకున్నా. అప్పుడే కానిస్టేబుల్ ఉద్యోగానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. చెంగిచెర్ల గ్రౌండ్‌లో ఫిట్‌నెస్ ప్రాక్టీస్ ప్రారంభించాను. అక్కడ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి సార్ పరిచయం అయ్యారు. ఆయన ఈవెంట్స్‌కు సంబంధించిన మెళకువలు నేర్పించారు. కోచింగ్ ఇచ్చారు. అమ్మమ్మను వెంట తీసుకెళ్లి తెల్లవారుజామున 4 గంటల నుంచే ప్రాక్టీస్ చేసేదాన్ని. నా కష్టం వృథా పోలేదు. అనుకున్నట్లుగానే ఉద్యోగం సాధించాను.



• శ్రీనివాస్ చింత, హైదరాబాద్



బ్యాంకింగ్ సేవల్లో సమస్యలున్నాయా!

ఆర్‌బీఐకి ఫిర్యాదు చేస్తే సరి

ప్రస్తుతం రోజువారీ జీవితంలో ఆర్థిక లావాదేవీలు నిత్య కృత్యమై పోయాయి. అవి బ్యాంకుల ద్వారా కావచ్చు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) లేదా డిజిటల్ పేమెంట్స్ కావచ్చు. టెక్నాలజీ పుణ్యమాని వీటి సేవలు ఎంత సులభమయ్యాయో.. అదే సమయంలో సమస్యలూ పెరిగిపోతున్నాయి. ఈ సమస్యలపై సంబంధిత సంస్థలకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన ఉండదు. ఉన్నా.. అది మొక్కుబడిగానే ఉంటోంది. అయితే వీటన్నిటికి పరిష్కారం చూపేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రత్యేకంగా ఒక ఆన్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. లావాదేవీలు లేదా ఇతరత్రా బ్యాంకింగ్ సమస్యలు ఏమైనా ఉంటే ఖాతాదారులకు తన కంప్లయెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆర్‌బీఐ పరిష్కారం చూపుతోంది. ఆ వివరాలు మీకోసం..

ఎప్పుడు ఫిర్యాదు చేయాలి?

సేవల్లో లోపాలు ఉంటే ముందు సంబంధిత బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ లేదా డిజిటల్ పేమెంట్ చానల్ పార్ట్‌నర్‌కే ఫిర్యాదు చేయాలి. ఆ ఫిర్యాదును సంబంధిత సంస్థలు నెల రోజుల్లోగా పరిష్కరించాలి. ఈ నెల రోజుల్లో వాటి నుంచి సమాధానం రాకపోయినా, వచ్చినా వారి సమాధానం మీకు సంతృప్తికరంగా లేకపోయినా నేరుగా cms.rbi.org.in పోర్టల్ ద్వారా ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయవచ్చు.

ఏ వివరాలు ఇవ్వాలి?

ఫిర్యాదులో మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, సమస్య ఉన్న బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ వివరాలు, సమస్య వివరాలు ఇవ్వాలి. సమస్య పరిష్కారం కోసం ఆయా సంస్థలతో మీరు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఫిర్యాదు రిఫరెన్స్ నంబర్లు, స్క్రీన్ షాట్ల వివరాలను కూడా అప్‌లోడ్ చేయాలి. ఈ వివరాల ఆధారంగా మీకు ఒక రిఫరెన్స్ నంబరు జనరేట్ అవుతుంది.

పరిష్కార ప్రక్రియ

మీ ఫిర్యాదు అందిన వెంటనే ఆర్‌బీఐ.. పరిష్కారం కోసం సంబంధిత సంస్థలకు పంపిస్తుంది. సంబంధిత సంస్థలు దీనికి నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వాలి. సమాధానం రాకుంటే అంబుడ్స్‌మన్ రంగంలోకి దిగుతుంది. ఇందుకు మీ నుంచి మరింత సమాచారం అవసరమైతే అడుగుతుంది. అవసరమనుకుంటే సంబంధిత సంస్థ, ఫిర్యాదు చేసిన ఖాతాదారుడి మధ్య అంబుడ్స్‌మన్ మధ్యవర్తిత్వం వహించి సమస్య పరిష్కరిస్తుంది. సీఎంఎస్ పోర్టల్ ద్వారా అందే ఫిర్యాదుల్లో చాలా వరకు నెల రోజుల్లో పరిష్కారమవుతాయి. మధ్యవర్తిత్వం విఫలమైతే అంబుడ్స్‌మన్ నిర్ణయం తీసుకుంటుంది. ఆ నిర్ణయం మీకు అంగీకారమైతే సంబంధిత సంస్థలు నెల రోజుల్లోగా కచ్చితంగా దాన్ని అమలు చేయాలి.

నచ్చకపోతే?

అంబుడ్స్‌మన్ తీర్పు ఫిర్యాదుదారుడికి నచ్చితే సరి. లేకపోతే తీర్పు వెలువడిన నెల రోజుల్లోగా ఆర్‌బీఐకే చెందిన అప్పిలేట్ అథారిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. ఈ సంస్థ తీర్పు కూడా నచ్చకపోతే ఫిర్యాదుదారుడు కన్స్యూమర్ కోర్టు లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు.

అంతా ఉచితం

ఆర్‌బీఐ సీఎంఎస్ పోర్టల్ సేవలు పూర్తిగా ఉచితం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు లేదా పేమెంట్ చానల్స్ ఆఫీసు మెట్లు ఎక్కకుండానే మీ ఫిర్యాదులను ఈ పోర్టల్ ద్వారా ఉచితంగా పరిష్కరించుకోవచ్చు. కాకపోతే అన్ని సాక్ష్యాలు పక్కాగా ఉండాలి.

వేటిపై ఫిర్యాదు చేయవచ్చు?

బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ పరిధిలోకి వచ్చే ఈ కింది అంశాలన్నిటిపైనా ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయవచ్చు.

- సేవా లోపాలు
- చెల్లింపుల్లో ఆలస్యం లేదా అసలు చెల్లించకపోవడం
- పొరపాటుగా డెబిట్ చేసిన మొత్తాన్ని తిరిగి బదిలీ చేయకపోవడం
- ఏటీఎం లేదా యూపీఐ లావాదేవీలు విఫలమవడం
- మీ ఖాతా నుంచి అనధికారికంగా డెబిట్ చేయడం
- రుణాల మంజూరు, చెల్లింపుల్లో సమస్యలు

త్వరలో పబ్లిక్ ఇష్యూకి ఎస్‌బీఐ ఎంఎఫ్, జనరల్ ఇన్సూరెన్స్

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. తన రెండు అనుబంధ సంస్థలను స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేసేందుకు సిద్ధమవుతోంది. బ్యాంక్ అనుబంధ సంస్థలైన ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ సంస్థలను పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి తీసుకువచ్చే విషయాలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. శనివారం నాడిక్కడ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్.. ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ శాఖలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఈ రెండు అనుబంధ సంస్థలను మార్కెట్లో లిస్టింగ్ చేసే విషయాన్ని చురుగ్గా పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే ఎప్పటిలోగా వీటిని లిస్ట్ చేయాలనే దానిపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదన్నారు. ఎస్‌బీఐ కింద మొత్తం 18 నాన్ బ్యాంకింగ్ అనుబంధ సంస్థలున్నాయని, వీటిల్లో జీవిత బీమా, బీమాయేతర, మ్యూచువల్ ఫండ్స్ వంటి సంస్థలు ప్రపంచ స్థాయి ఆర్థిక సర్వీసులు అందిస్తున్నాయని తెలిపారు. ఈ అనుబంధ సంస్థల్లో ఎస్‌బీఐ రూ.6,500 కోట్లు పెట్టుబడిగా పెడితే ప్రస్తుతం వీటి విలువ రూ.4 లక్షల కోట్లకు చేరుకుందని శెట్టి వివరించారు.


సుంకాల ప్రభావం పరిమితమే..

అమెరికా గరిష్ఠ సుంకాల ప్రభావం భారత్‌పై అంతగా ఉండదని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి తెలిపారు. భారత్ నుంచి అమెరికా సహా వివిధ దేశాలకు పెద్దఎత్తున ఎగుమతులు జరుగుతున్నాయని, దీంతో సుంకాల ప్రభావం తక్కువగా ఉంటుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. రసాయనాలు, టెక్స్‌టైల్స్, వజ్రాభరణాలు, ఆక్వా రంగంపై మాత్రమే ఈ సుంకాల ప్రభావం అధికంగా ఉండనుందని, అయితే ఈ రంగాలకు ఎస్‌బీఐ ఇచ్చిన రుణాలు కూడా చాలా పరిమిత స్థాయిలోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ రంగాలకు ప్రభుత్వం ఉపశమనం కల్పించాలని నిర్ణయిస్తే అప్పటి పరిస్థితుల ఆధారంగా తాము ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు.

హెల్త్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక శాఖలు

ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హెల్త్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక శాఖలను ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పట్టణాల్లో మొత్తం 30 ప్రత్యేక శాఖలను ప్రారంభించినట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ నవీన్ చంద్ర ఝా వెల్లడించారు. అందరికీ ఆరోగ్య బీమా అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. భవిష్యత్‌లో వీటిని దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. సంస్థకు చెందిన అన్ని రకాల బీమా ఉత్పత్తులు ఈ శాఖల్లో అందుబాటులో ఉంటాయని ఝా తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	505
వరంగల్	462	గోదావరి	500
చిత్తూరు	523	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	104
వరంగల్	95	గుంటూరు	109
కరీంనగర్	95	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	82
కర్నూలు	95	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	87
గోదావరి	104		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,03,310 ▲	94,700 ▲	1,27,000 ▲
విజయవాడ	1,04,100 ▼	97,500 ▼	1,18,400 ▼
విశాఖపట్నం	1,03,040 ▼	94,450 ▼	1,27,000 ▲
రాజమండ్రి	1,03,040 ▼	94,450 ▼	1,18,500 ▲
ప్రొద్దుటూరు	1,01,100 ▲	93,010 ▲	1,17,800 ▲
ముంబై	1,00,940 ▲	92,460 ▲	1,14,730 ▼

వారంటీలో ఉన్న వస్తువులు రిపేర్‌కు వస్తే..?

ఇదీ GST



రాంబాబు గొండాల

సాధారణంగా మొబైల్, టీవీ, ఫ్రిడ్జ్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కానీ, కారు, బైక్ లాంటి ఆటోమొబైల్స్ లేదా ఇతర యంత్ర పరికరాలు 'వారంటీ'లో విక్రయిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో కొనుగోలు చేసిన వస్తువులు వారంటీ గడువు లోపు పాడయినట్లయితే డిస్ట్రిబ్యూటర్ లేదా సర్వీస్ సెంటర్లలో ఆయా వస్తువులకు ఉచితంగా మరమ్మతులు చేయటం, అవసరమైతే పాడయిన విడిభాగాలను ఉచితంగా మార్చటం వంటివి చేస్తుంటారు. అయితే ఆయా విడిభాగాల మీద సంబంధిత ఉత్పత్తిదారుడు (కంపెనీ) గానీ, సర్వీస్ సెంటర్ గానీ జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందా? లేదంటే ఆయా విడిభాగాలకు సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను రివర్స్ చేయాల్సి ఉంటుందా? అలాగే సర్వీస్ సెంటర్‌కు, ఉత్పత్తిదారుడికి మధ్య జరిగే లావాదేవీల మీద జీఎస్‌టీ ఎలా చెల్లించాలి? కస్టమర్ దగ్గర నుంచి అదనంగా ఏమైనా వసూలు చేస్తే దాన్ని ఎలా చూపాలి మొదలైన విషయాలు తెలుసుకుందాం.

ఈ వారంటీకి సంబంధించిన రిపేర్లు రెండు రకాలుగా ఉంటాయి. కంపెనీనే రిపేర్లు చేపట్టటం లేదా ఆయా కంపెనీల తరఫున సంబంధిత డిస్ట్రిబ్యూటర్లు లేదా సర్వీస్ సెంటర్లు ఈ రిపేర్లు చేపట్టటం. ఈ రెండు సందర్భాల్లోనూ ఏవేనీ విడిభాగాలను ఉచితంగా మార్చటం జరుగుతుంటే ఆ విడిభాగాల మీద ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. అలాగే ఆయా విడిభాగాల మీద తీసుకున్న ఐటీసీని కూడా రివర్స్ చేయనవసరం లేదు. కాకపోతే, కస్టమర్ నుంచి ఏమైనా సర్వీస్ చార్జీ కింద లేదా ఇతర కారణాలతో అదనపు రుసుము వసూలు చేస్తే దాని మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

అయితే కంపెనీల తరఫున డిస్ట్రిబ్యూటర్ లేదా సర్వీస్ సెంటర్లలో రిపేర్లు జరుగుతుంటే సంబంధిత డిస్ట్రిబ్యూటర్‌కు, ఆయా కంపెనీల మధ్య లావాదేవీలను ఎలా అర్థం చేసుకోవాలి? ఇందులో కూడా వివిధ రకాల లావాదేవీలు ఉంటాయి. మొదటిది, ఏదేనీ విడిభాగాలను మార్చాల్సి వస్తే.. డిస్ట్రిబ్యూటర్, సంబంధిత కంపెనీకి ఇండెంట్ పెట్టి ఆయా విడిభాగాలను ఉచితంగా తెప్పించుకుంటారు. అలాంటి సందర్భంలోనూ సంబంధిత కంపెనీ ఆ విడిభాగాల మీద కూడా ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఆయా విడిభాగాలకు సంబంధించి ఎలాంటి ఐటీసీ కూడా రివర్స్ చేయాల్సిన అవసరం లేదు. అలాకాకుండా డిస్ట్రిబ్యూటర్ తన దగ్గర ఉన్న విడిభాగాలను లేదా బయట నుంచి కొనుగోలు చేసిన విడిభాగాలను వాడి కంపెనీకి బిల్లు (ఇన్వాయిస్) పెట్టినట్లయితే, ఆ బిల్లు మీద సంబంధిత డిస్ట్రిబ్యూటర్ జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, అలా చెల్లించిన జీఎస్‌టీని నియమ నిబంధనలకు లోబడి కంపెనీలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు.

అలాగే డిస్ట్రిబ్యూటర్ లేదా సర్వీస్ సెంటర్ సర్వీస్ చార్జీల కింద ఏదేనీ రుసుమును కంపెనీ నుంచి వసూలు చేస్తే దాని మీద కూడా జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. ఆ జీఎస్‌టీని పైన తెలిపినట్లు ఆయా కంపెనీలు ఐటీసీ తీసుకోవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే పైన చెప్పిన లావాదేవీలు ఉచితంగా అందించినంత వరకు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. అయితే, కొన్ని సందర్భాల్లో కంపెనీలు ఈ లావాదేవీలకు సంబంధించి క్రెడిట్ నోట్స్‌ను డిస్ట్రిబ్యూటర్స్‌కు ఇవ్వటం జరుగుతుంది. అలాంటప్పుడు క్రెడిట్ నోట్స్‌కు సంబంధించిన నియమ నిబంధనలను ఇరువైపుల పాటించాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బరోడా బీఎన్‌పీ పారిబా గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్

బరోడా బీఎన్‌పీ పారిబా అసెట్ మేనేజ్‌మెంట్ ఇండియా.. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను ప్రారంభించింది. దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు, బంగారం సంబంధిత అసెట్స్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరుల కోసం ఈ కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో అయితే రూ.500 పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14.

కోటక్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. మార్కెట్ క్యాపిటలైజేషన్, గడచిన ఆరు నెలల్లో రోజువారీ టర్నోవర్ టర్నోవర్ ఆధారంగా కంపెనీలను ఎంపిక చేసుకుని ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఈ నెల 11.

స్పోర్ట్స్



ఫేవరెట్లు శ్రీశంకర్, అన్ను

నేడు వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్

భువనేశ్వర్: భారత్ తొలిసారి ఆతిథ్యమిస్తున్న వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ ఈవెంట్‌కు ఇక్కడి కళింగ స్టేడియం గ్రాండ్‌గా ముస్తాబైంది. ఆదివారం జరిగే ఈ పోటీల్లో ఆతిథ్య భారత్ సహా 15 దేశాల నుంచి 150 మందికిపైగా అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. త్వరలో జరిగే టోక్యో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హతే లక్ష్యంగా అనేకమంది అథ్లెట్లు టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ మాజీ విజేత నీరజ్ చోప్రాతోపాటు తెలుగమ్మాయి, స్ప్రింటర్ జ్యోతి యర్రాజీ, స్టీపుల్ చేజర్ అవినాశ్ సబ్లేలాంటి స్టార్లు గైర్హాజరవుతున్నా.. మిగతా టాప్ అథ్లెట్లు అన్నూ రాణి, మురళీ శ్రీశంకర్ భారత్ నుంచి ఫేవరెట్లుగా పోటీపడుతున్నారు. మహిళల జావెలిన్ త్రోయర్ అన్నూ రాణి ఈనెల ఆరంభంలో పోలెండ్ మీట్‌లో విజేతగా నిలిచి జోరు మీదున్నది. ఇక, శ్రీశంకర్ ఇటీవల వరుసగా మూడు అంతర్జాతీయ టైటిళ్లు నెగ్గి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు. 200 మీటర్లలో జాతీయ రికార్డు గ్రహీత అనిమేశ్ కుజుర్, లాంగ్ జంప్‌లో షైలీ సింగ్, అన్సీ షోజన్, పురుషుల జావెలిన్ త్రోలో సచిన్ యాదవ్, 800 మీటర్లలో మహ్మద్ అఫ్జల్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో, 4.400 మీటర్ల రిలే మిక్స్‌డ్ ఈవెంట్లలో పోటీలుంటాయి.

వారియర్స్ బోణీ

- ఏపీఎల్‌లో లయన్స్ పరాజయం
- అశ్విన్ హెబ్బర్ సెంచరీ మిస్
- రాయల్స్‌పై సన్ షైనర్స్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో తుంగభద్ర వారియర్స్ బోణీ కొట్టింది. ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో వారియర్స్ ఏడు వికెట్లతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై గెలిచింది. తొలుత లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 109 పరుగులే చేసింది. అభిషేక్‌రెడ్డి (40), త్రిపురాన విజయ్ (22) మినహా ఎవరూ రాణించలేదు. వారియర్స్ బౌలర్లలో తోషిత్ యాదవ్ మూడు, స్టీఫెన్, సిద్ధార్థ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో వారియర్స్ కేవలం 12.2 ఓవర్లలో 114/3 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ మహీప్‌కుమార్ (57 నాటౌట్), ఓపెనర్ జ్ఞానేశ్వర్ (40) రెండో వికెట్‌కు 84 పరుగులు జోడించి జట్టుకు విజయాన్నందించారు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో విజయవాడ సన్ షైనర్స్ ఏడు వికెట్ల తేడాతో రాయల్స్ ఆఫ్ రాయలసీమను ఓడించింది. మొదట రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 196 పరుగులు చేసింది. పైలా అవినాష్ (96) అదరగొట్టగా, గిరినాథరెడ్డి (49 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. షైనర్స్ బౌలర్లు మోహన్, నరసింహరాజు చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో సన్‌షైనర్స్ 16.5 ఓవర్లలోనే 200/3 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ (98) కొద్దిలో సెంచరీ చేజార్చుకోగా, తేజ (77 నాటౌట్) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

అర్జున్ రెండో విజయం

- చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్



చెన్నై: స్టార్ ఆటగాడు అర్జున్ ఇరిగేసి చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్‌లో రెండో విజయాన్ని నమోదు చేశాడు. మాస్టర్స్ కేటగిరిలో తొలిరౌండ్ గెలిచి, రెండో రౌండ్‌ను డ్రాగా ముగించిన ఈ తెలుగు గ్రాండ్‌మాస్టర్.. శనివారం జరిగిన మూడో రౌండ్లో విజయం సాధించాడు. ఈ రౌండ్లో అమెరికా గ్రాండ్‌మాస్టర్ రే రాబ్సన్‌ను ఓడించాడు. మూడు రౌండ్ల అనంతరం అర్జున్ 2.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. వరుసగా మూడో గెలుపుతో హ్యాట్రిక్ కొట్టిన జర్మనీ నెంబర్‌వన్ విన్సెంట్ కేమర్ 3 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. మిగతా ఆటగాళ్లలో అనీష్ గిరి (1.5)తో గేమ్‌ను ప్రణవ్ (1) డ్రా చేసుకోగా, నిహాల్ సరీన్ (0.5)పై విదిత్ గుజరాతీ (1.5) గెలిచాడు. చాలెంజర్స్ కేటగిరి మూడో రౌండ్లో అధిబన్‌తో గేమ్‌ను ద్రోణవల్లి హారిక డ్రాగా ముగించగా, ల్యూక్ మెన్‌డోన్సా చేతిలో వైశాలి ఓటమిపాలైంది. వైశాలి (1) ఏడు, హారిక (0.5) తొమ్మిదో స్థానాల్లో కొనసాగుతున్నారు.

కోహ్లీ కానుక పదిలంగా..



హైదరాబాద్: టీమిండియా పేసర్ సిరాజ్‌కు విరాట్ కోహ్లీ అంటే ప్రత్యేక అభిమానం. తాను ఆర్‌సీబీకి ఆడిన సమయంలో అతడిని హైదరాబాద్‌లోని స్వగృహానికి సైతం తీసుకెళ్లి పసందైన విందు భోజనంతో ఖుషీ చేయించాడు. అటు విరాట్ కూడా సిరాజ్‌పై తనకున్న ఆప్యాయతను పలు సందర్భాల్లో వెల్లడిస్తుంటాడు. అందుకే తానాడిన చివరి టెస్టు జెర్సీని సిరాజ్‌కే కానుకగా ఇచ్చాడు. విరాట్ సంతకంతో కూడిన ఈ జెర్సీని సిరాజ్ ప్రత్యేకంగా ఫ్రేమ్ చేయించి మరీ తన ఇంట్లో గోడకు బిగించాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గిల్ జెర్సీకి రూ.5.41 లక్షలు

న్యూఢిల్లీ: భారత్-ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో పాల్గొన్న క్రికెటర్ల సంతకాలతో కూడిన జెర్సీలను, క్యాప్‌లను వేలానికి ఉంచారు. ఇందులో కెప్టెన్ గిల్ ధరించిన జెర్సీకి అత్యధికంగా రూ. 5.41 లక్షల ధర పలికింది. జడేజా, బుమ్రా జెర్సీలు రూ.4.94 లక్షలు పలికాయి. మాజీ కెప్టెన్ ఆండ్రూ స్ట్రాస్ దివంగత భార్య రూత్ స్ట్రాస్ ఫౌండేషన్ నిధుల సేకరణ కోసం ఈ వేలం జరిగింది.

అమ్మకానికి లార్డ్స్ పిచ్

లండన్: ప్రపంచ క్రికెట్‌లో లార్డ్స్ మైదానానికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ఇక్కడ శతకం బాదినా.. ఐదు వికెట్ల మైలురాయి అందుకున్నా వారి పేర్లు చరిత్రలో నిలిచిపోతాయి. ఎన్నో అద్భుత మ్యాచ్‌లకు వేదికగా నిలిచిన ఈ ప్రఖ్యాత మైదానం పిచ్‌ను ముక్కల వారీగా అమ్మకానికి ఉంచుతున్నట్టు నిర్వాహక మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) ప్రకటించింది. పిచ్‌తో పాటు మైదానం టర్ఫ్‌ను కూడా కొనుగోలు చేయవచ్చని తెలిపింది.



1.2-0.6మీ. సైజు పిచ్ భాగాన్ని భారత కరెన్సీలో రూ.5 వేల చొప్పున అమ్మనున్నారు. అయితే ఈ అవకాశం ముందుగా తమ 25వేల మంది ఎంసీసీ సభ్యులకు ఇవ్వనుంది. ఆ తర్వాత క్రికెట్ అభిమానులు కూడా కొనుగోలు చేయవచ్చు. దీని ద్వారా వచ్చే నిధుల్లో పది శాతం ఎంసీసీ ఫౌండేషన్‌కు వెళతాయి. మిగతా మొత్తంతో స్టేడియంలో సౌకర్యాల మెరుగుదలకు వినియోగిస్తారు. మరోవైపు వచ్చేనెల నుంచి లార్డ్స్ గ్రౌండ్‌ను ఆధునీకరించనున్నారు. అందులో భాగంగానే పిచ్ చుట్టుపక్కల ఉండే పచ్చికను తొలగించి, అవుట్‌ఫీల్డ్‌ను కూడా తవ్వి సరికొత్త సర్ఫేస్‌ను ఉంచుతున్నారు.

తొలి వన్డేలో పాక్ గెలుపు

తరౌబా: ఆతిథ్య వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ ఘనంగా బోణీ చేసింది. శుక్రవారం రాత్రి జరిగిన తొలి మ్యాచ్‌లో పాక్ ఐదు వికెట్లతో గెలుపొందింది. తొలుత విండీస్ 49 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. ఎవిన్ లూయిస్ (60), హోప్ (55), చేజ్ (53) అర్ధ సెంచరీలు చేశారు. షహీన్ షా 4, నసీమ్ షా 3 వికెట్లు తీశారు. ఛేదనలో పాక్.. హసన్ నవాజ్ (63 నాటౌట్) అజేయ అర్ధ శతకానికి తోడు, కెప్టెన్ రిజ్వాన్ (53) రాణించడంతో 48.5 ఓవర్లలో 284/5 స్కోరు చేసి గెలిచింది.

ఆర్చర్ రిషభ్‌కు కాంస్యం



చెంగ్డూ (చైనా): ప్రపంచ క్రీడల్లో భారత ఆర్చర్ రిషభ్ యాదవ్ కాంస్య పతకం సాధించాడు. వ్యక్తిగత కాంపౌండ్ విభాగం కాంస్య పతక పోరులో రిషభ్ 149-147తో భారత్‌కే చెందిన అభిషేక్‌ను ఓడించాడు.

వైభవ్ వల్లే వెళుతున్నాడు

- సంజూ శాంసన్‌పై ఆకాశ్ చోప్రా

న్యూఢిల్లీ: రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ పాతుకుపోవడంతోనే సంజూ శాంసన్ జట్టును వీడాలనుకుంటున్నట్టు టీమిండియా మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా చెబుతున్నాడు. శాంసన్‌కు ఓపెనింగ్‌లో ఆడాలని ఇష్టమున్నా.. గత సీజన్‌లో అతడిని మూడో స్థానంలో పంపారు. ఇక.. యశస్వీ జైస్వాల్, వైభవ్‌లను ఓపెనర్లుగా ఆడించారు. 'గత మెగా వేలంలో రాజస్థాన్ జట్టు ఓపెనర్ బట్లర్‌ను వదులుకుంది. దీంతో జైస్వాల్‌కు జతగా శాంసన్ ఓపెనింగ్ చేయాలనుకున్నాడు. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో కొన్ని మ్యాచ్‌ల్లోనూ అతను ఓపెనర్‌గా ఆడాడు. అయితే సంజూకు గాయమవడంతో వైభవ్‌ను ఆడించారు. తిరిగి శాంసన్ జట్టులోకి వచ్చినా వైభవ్‌నే ఓపెనర్‌గా కొనసాగించారు. ఇది సంజూకు ఇష్టం లేకపోయింది' అని ఆకాశ్ వివరించాడు.

కివీలు కుమ్మేశారు



రెండో టెస్టులో ఇన్నింగ్స్ 359 రన్స్‌తో జింబాబ్వే చిత్తు

అరంగేట్ర పేసర్ జకారికి ఐదు వికెట్లు ● 2-0తో క్లీన్‌స్వీప్

బులవాయో: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు తమ టెస్టు చరిత్రలోనే అతి భారీ విజయాన్ని నమోదు చేసింది. జింబాబ్వేతో శనివారం మూడో రోజే ముగిసిన రెండో టెస్టులో ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో కివీస్ ఘనవిజయం సాధించింది. దీంతో ఈ సిరీస్‌ను కివీస్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అంతేకాకుండా ఓవరాల్ టెస్టు చరిత్రలోనూ ఇది మూడో భారీ విజయం కావడం విశేషం. కివీస్ జట్టులో 23 ఏళ్ల అరంగేట్ర పేసర్ జకారి ఫౌల్కెస్ సంచలన ప్రదర్శనతో (5/37) అబ్బురపరిచాడు. ఫలితంగా జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 117 పరుగులకే కుప్పకూలింది. నిక్ వెల్చ్ (47 నాటౌట్), కెప్టెన్ ఇర్విన్ (17) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. హెన్రీ, డఫీలకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కాన్వే, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా హెన్రీ నిలిచారు.

తొలి సెషన్‌లోనే..: ఓవర్‌నైట్ స్కోరు 601/3 పరుగుల వద్దే కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడంతో ఆ జట్టుకు 476 పరుగుల ఆధిక్యం దక్కింది. ఇక శనివారం ఉదయమే రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే తొలి సెషన్‌లోనే కుప్పకూలింది. పేసర్ల ధాటికి కేవలం 28.1 ఓవర్లే ఆడింది. ఓపెనర్ బెన్నెట్‌ను ఇన్నింగ్స్ తొలి ఓవర్ మూడో బంతికే పేసర్ హెన్రీ డకౌట్ చేశాడు. ఆ తర్వాత డఫీ, ఫిషర్‌ల ధాటికి జింబాబ్వే 49/4 స్కోరుతో నిలిచింది. ఇక 16వ ఓవర్ నుంచి వరుస విరామాల్లో ఐదు వికెట్లను పడగొట్టిన పేసర్ జకారి మిడిలార్డర్‌తో పాటు టెయిలెండర్ల భరతం పట్టాడు.

టెస్టు క్రికెట్‌లో భారీ విజయాలు

ఇన్నింగ్స్ 579 రన్స్‌తో	ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్
ఇన్నింగ్స్ 360 రన్స్‌తో	దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా
ఇన్నింగ్స్ 359 రన్స్‌తో	జింబాబ్వేపై న్యూజిలాండ్
ఇన్నింగ్స్ 336 రన్స్‌తో	భారత్‌పై వెస్టిండీస్



జకారి ఫౌల్కెస్ (5/37)

1 న్యూజిలాండ్ తరఫున అరంగేట్ర టెస్టులో ఉత్తమ గణాంకాలు (9/75) నమోదు చేసిన బౌలర్‌గా నిలిచిన ఫౌల్కెస్. విల్ ఓరౌర్క్ (9/93)ని దాటాడు.

సంక్షిప్త స్కోర్లు

జింబాబ్వే తొలి ఇన్నింగ్స్: 125
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 601/3 డిక్లేర్; **జింబాబ్వే రెండో ఇన్నింగ్స్:** 28.1 ఓవర్లలో 117 ఆలౌట్ (వెల్చ్ 47 నాటౌట్, ఇర్విన్ 17; ఫౌల్కెస్ 5/37, హెన్రీ 2/16, డఫీ 2/28).

ఇక ఐసీఐసీఐ కనీస బ్యాలెన్స్ 50 వేలు

- పట్టణాల్లో కొత్త సేవింగ్స్ ఖాతాలకు వర్తిస్తుంది
- చిన్న పట్టణాల్లో ఖాతాలకు రూ.25 వేలు
- జన్‌ధన్ ఖాతాలు ఎప్పట్లాగే జీరో బ్యాలెన్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: దేశంలో ప్రయివేటు రంగంలోని రెండో అతిపెద్ద బ్యాంకు ఐసీఐసీఐ కొత్తగా తెరిచే సేవింగ్స్ ఖాతాలకు కనీస బ్యాలెన్స్ మొత్తాన్ని భారీగా పెంచింది. పట్టణాలు, మెట్రో నగరాల్లోని శాఖలలో కొత్తగా తెరిచే బ్యాంకు ఖాతాలకు నెల రోజుల కనీస బ్యాలెన్స్ రూ.50,000గా నిర్ధారించింది. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని శాఖల్లో తెరిచే ఖాతాలకు రూ.25,000, రూ.10,000 చొప్పున నెల రోజుల కనీస బ్యాలెన్స్‌ను ఖరారు చేసింది. మూడు ప్రాంతాల్లోనూ కనీస బ్యాలెన్స్‌ను ఐదు రెట్లు పెంచింది. అయితే, ఆగస్టు 1 తర్వాత తెరిచిన కొత్త ఖాతాలకే ఈ నిబంధన వర్తిస్తుంది. పాత ఖాతాలకు ఎప్పట్లాగే రూ.10,000, రూ.5,000, రూ.2,000 చొప్పున కనీస బ్యాలెన్స్ కొనసాగుతుంది. వేతన ఖాతాలు, జన్‌ధన్ ఖాతాలు, డిపాజిట్ల కోసం ఉద్దేశించిన ఖాతాలకు జీరో బ్యాలెన్స్ వర్తిస్తుంది. నెల రోజుల కనీస బ్యాలెన్స్ ఖాతాలో ఉంచని వారిపై గరిష్ఠంగా రూ.500 వరకు జరిమానా విధిస్తారు. కనీస బ్యాలెన్స్ మొత్తానికి ఎంత తగ్గుతుందో అంత మొత్తానికి ఆరు శాతం చొప్పున వడ్డీ లెక్కించి వసూలు చేస్తారు. ఉదాహరణకు హైదరాబాద్‌లో రూ.50,000 కనీస బ్యాలెన్స్ ఖాతా తెరిచిన వ్యక్తి ఒక నెలలో కేవలం రూ.45,000 కనీస బ్యాలెన్స్ మెయింటెయిన్ చేశాడు అనుకుందాం. మిగిలిన ఐదు వేలకు నెలకు 6 శాతం చొప్పున వడ్డీని లెక్క వేసి జరిమానాగా వసూలు చేస్తారు. అంటే, అది రూ.300 అవుతుంది. ఒక వేళ పది వేల రూపాయల లోటు ఉంటే 6 శాతం చొప్పున రూ.600 అవుతుంది. అయితే, జరిమానా గరిష్ఠ పరిమితి రూ.500 మాత్రమే కాబట్టి రూ.600 బదులు రూ.500 మాత్రమే వసూలు చేస్తారు. అస్సలు ఖాతాలో ఏమీ ఉంచకపోతే కూడా రూ.500 చొప్పున జరిమానా వసూలు చేస్తారు. జరిమానాల మీద జీఎస్టీ అదనం. కొత్త ఖాతాలకు ఎన్‌ఈఎఫ్‌టీ నగదు బదిలీలను పరిమితి లేకుండా ఉచితంగా చేసుకొనే అవకాశం ఇచ్చారు. మూడు దఫాలుగా రూ.లక్ష వరకు నగదును ఏటీఎంలలో విత్‌డ్రా చేసుకోవచ్చు. ఒక విధంగా ఇది ప్రీమియం బ్యాంకు ఖాతా అన్నమాట.

7 ఇంజన్లు.. 354 వ్యాగన్లు!

- దేశంలోనే పొడవైన గూడ్స్ రైలు 'రుద్రాస్త్ర'
- పొడవు 4.5 కిలోమీటర్లు.. ప్రారంభించిన భారతీయ రైల్వే
- ఐదు గంటల్లో 200 కి.మీ. ప్రయాణం



న్యూఢిల్లీ, ఆగస్టు 9: భారతీయ రైల్వే అరుదైన రికార్డు సృష్టించింది. ఏకంగా 7 ఇంజన్లు.. 354 వ్యాగన్లతో దేశ చరిత్రలోనే అత్యంత పొడవైన గూడ్స్ రైలు విజయవంతంగా పట్టాలెక్కింది. 'రుద్రాస్త్ర'గా నామకరణం చేసిన ఈ రైలును తూర్పు మధ్య రైల్వే (ఈసీఆర్) పరిధిలోని గ్రాండ్ కోర్డ్ రైల్ సెక్షన్‌లో ప్రారంభించారు. దీని పొడవు 4.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఆరు బాక్సన్ ర్యాక్ (వ్యాగన్ల శ్రేణి)లను అనుసంధానించడం ద్వారా దీన్ని రూపొందించారు. ముందు ఒక లోకోమోటివ్.. తర్వాత మధ్యమధ్యలో మరో ఆరు ఇంజన్లు ఏర్పాటు చేసి సమర్థంగా నడిపారు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని గంజ్ కవాజా రైల్వే స్టేషన్ నుంచి ఝార్ఖండ్‌లోని గర్వా రోడ్ స్టేషన్ మధ్య పరుగులు తీసి అందరి దృష్టిని ఆకర్షించింది. గంటకు సగటున 40కిలోమీటర్ల వేగంతో 200 కిలోమీటర్ల దూరాన్ని దాదాపు ఐదు గంటల్లో పూర్తిచేసింది. దీనికి సంబంధించిన వీడియోను రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రుద్రాస్త్ర.. భారత అతి పొడవైన గూడ్స్ రైలు' అని క్యాప్షన్ ఇచ్చారు.

'రుద్రాస్త్ర' ప్రత్యేకత ఏంటి?

రుద్రాస్త్ర గూడ్స్ రైలు సరుకు రవాణాలో వేగంతో పాటు సామర్థ్యాన్ని పెంచుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇందులోని ఆరు ర్యాక్‌లను వేర్వేరుగా నడపడం వలన వాటన్నింటికీ వేర్వేరు మార్గాలు, సిబ్బందిని, షెడ్యూల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అదే రుద్రాస్త్రగా కలిపి నడపడం వలన సమయం ఆదా అవుతుందని, సిబ్బంది అవసరం, నిర్వహణ వ్యయం తగ్గుతుందని తెలిపారు. మొత్తం మీద భారత రవాణా రంగానికి 'రుద్రాస్త్ర' మంచి ఊపునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే..

'రుద్రాస్త్ర' భారత రైల్వే చరిత్రలోనే అతి పొడవైన గూడ్స్ రైలుగా నిలిచింది. అయితే ఈ విషయంలో ప్రపంచ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన బీహెచ్‌పీ కంపెనీ చేతుల్లో ఉంది. ఆ సంస్థ రూపొందించిన రైలు 7.3 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. అందులో 682 వ్యాగన్లు ఉంటాయి. అయినప్పటికీ, భారత రైల్వే సాధించిన ఈ సరికొత్త విజయం.. ప్రపంచ స్థాయి సరుకు రవాణా కార్యకలాపాల్లో ఒక కీలక అడుగుగా చెప్పవచ్చు.

పండుగ వేళ రైల్వే బంపర్ ఆఫర్


- తిరుగు ప్రయాణంపై 20% రిబేట్
- అక్టోబరు 13-26 మధ్య ప్రయాణించాలి
- 17 నవంబరు - డిసెంబరు 1 మధ్య తిరుగు ప్రయాణం ఉండాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 9: పండుగ సందర్భంగా భారతీయ రైల్వే శాఖ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. 'రౌండ్ ట్రిప్ ప్యాకేజ్ ఫర్ ఫెస్టివల్ రష్' పేరుతో శనివారం ఓ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. రాను పోను ప్రయాణానికి రైలు టికెట్లు బుక్ చేసుకున్న వారికి తిరుగు ప్రయాణం బేస్ ఫేర్‌లో 20% రిబేట్‌ను ఇవ్వనున్నట్లు తెలిపింది. ఇబ్బందులు లేని ప్రయాణానికి, ముందస్తు రిజర్వేషన్ చేసుకోవడాన్ని, రైళ్లలో ప్రయాణించడాన్ని ప్రోత్సహించడానికి, రద్దీని క్రమబద్ధీకరించడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ప్రత్యేక రైళ్ల సహా అన్ని రైళ్లలో, అన్ని తరగతులకూ ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద టికెట్లు ఆగస్టు 14 నుంచి బుక్ చేసుకోవచ్చు. అక్టోబరు 13 నుంచి 26 మధ్య ప్రయాణం చేయవచ్చని, తిరుగు ప్రయాణం నవంబరు 17 నుంచి డిసెంబరు 1వ తేదీలోపు చేయాలని పేర్కొంది. పథకాన్ని ఉపయోగించుకోవడానికి కొన్ని షరతులు వర్తిస్థాయని పేర్కొంది. 'రెండు వైపుల కన్ఫర్మ్ టికెట్లు ఉండాలి. రెండు వైపుల గమ్యస్థానాలు ఒకటే అయి ఉండాలి. 'ఫ్లెక్సీ ఫేర్' ఉన్న రైళ్లు... రాజధాని, శతాబ్ది, దురంతో రైళ్లలో ఈ పథకం వర్తించదు. తిరుగు ప్రయాణానికి ఏఆర్‌పీ (అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ పీరియడ్) వర్తించదు. అలాగే కూపన్లు, ఓచర్లు, పాసులు పనిచేయవు. ఈ పథకం కింద బుక్ చేసుకున్న టికెట్లకు డబ్బులు వాపసు చేయరు' అని రైల్వే తెలిపింది.

చిత్రజ్యోతి

SINCE 1965

చైనుతో మళ్లీ వస్తున్నాడు



భారతీయ సినిమా చరిత్రలో 'శివ' చిత్రం ఓ మైలు రాయి. నాగార్జున సైకిల్ చైన్ లాగి చేతులకు చుట్టుకుని చేసిన ఫైట్‌ను 30 ఏళ్లు అవుతున్నా ప్రేక్షకులు మరచిపోలేదు. కల్ట్ క్లాసిక్‌గా నిలిచి పోయిన 'శివ' చిత్రం మళ్లీ కొత్త సాంకేతిక హంగులు సమకూర్చుకుని వస్తోంది. డాల్బీ అట్మోస్‌లో, 4 కె విజువల్స్‌తో, హై ఎండ్ ఏ ఐ టెక్నాలజీతో రీ డిజైన్ చేసిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో త్వరలో విడుదల చేయనున్నారు. రామ్‌గోపాలవర్మను దర్శకుడిగా పరిచయం చేస్తూ అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించిన సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నన్ను ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా ఇది. ఇన్నేళ్ల తర్వాత కూడా ఈ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. అన్నయ్య వెంకట్, నేను కలిసి 'శివ' చిత్రాన్ని మళ్లీ విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. యు ట్యూబ్‌లో చూసిన కొత్త జనరేషన్‌కు కూడా మంచి థియేటర్ అనుభవం ఇచ్చే సినిమా ఇది' అన్నారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'నాగార్జున నమ్మకమే 'శివ' చిత్రాన్ని అంత ఎత్తుకు తీసుకెళ్లింది. ఇందులో ఒరిజనల్ సౌండ్ అప్పట్లోనే ప్రశంసలు అందుకుంది. ఇప్పటి స్టాండర్డ్స్‌కు సరిపోయేలా అడ్వాన్స్‌డ్ ఏ ఐ టెక్నాలజీతో మోనో మిక్స్‌ను డాల్బీ అట్మాస్‌కు మార్చాం. కొత్త సౌండ్‌తో 'శివ' మరింత అలరిస్తుంది' అన్నారు.

ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- సూర్య సేతుపతి



తమిళ నటుడు విజయ్ సేతుపతి కుమారుడు సూర్య హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఫినిక్స్'. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యాక్షన్‌తో హై ఎమోషన్స్ కూడా ఉంటాయి. రాజ్యలక్ష్మి అనల్ అరసు నిర్మిస్తున్న 'ఫినిక్స్' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య సేతుపతి మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న ధనుంజయన్, అనల్ అరసుకు కృతజ్ఞతలు.ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను.' అన్నారు. "ఫైట్ మాస్టర్‌గా చాలా పెద్ద పెద్ద సినిమాలు చేశాను. అయితే యాక్షన్‌లో కూడా ఒక కొత్తదనం చూపించాలని ఫినిక్స్ చిత్రం చేశాను. సూర్య బాగా చేశాడు' అని చెప్పారు అనల్ అరసు. ఒక కొత్త దర్శకుడు తీసిన పెద్ద సినిమా ఇదనీ, సూర్య రెండేళ్లు కష్టపడ్డాడని నిర్మాత ధనుంజయన్ చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని తెలిపారు.

నవంబర్‌లో అద్భుతం



మహేశ్‌బాబు 50 వపుట్టిన రోజు సందర్భంగా శనివారం అభిమానులకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చారు దర్శకుడు రాజమౌళి. వారిద్దరి కలయికలో వస్తోన్న 'ఎస్‌ఎస్‌ఎంబీ-29' (వర్కింగ్ టైటిల్) చిత్రానికి సంబంధించిన వివరాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో తొలిసారి అధికారికంగా ఆయన ఓ కీలక్ అప్డేట్‌ను పంచుకున్నారు. 'ఇంతకాలం ఓపికతో ఉన్న మీ అందరికీ ధన్యవాదాలు. మేము 'ఎస్‌ఎస్‌ఎంబీ' షూటింగ్ ప్రారంభించి చాలా కాలం అయింది. ఈ సినిమా గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి అందరిలో ఉంది. మునుపెన్నడూ చూడని విధంగా దీన్ని రూపొందిస్తున్నాం. అయితే ఈ సినిమా కథ, దాని పరిధి చాలా పెద్దది. కేవలం ఫొటోలు, ప్రెస్‌మీట్‌లు ఈ ప్రాజెక్ట్‌కు పూర్తి న్యాయం చేయలేవేమో అనిపించింది. ప్రస్తుతం మేం ఓ ప్రపంచాన్ని సృష్టిస్తున్నాం. దాన్ని నవంబర్‌లో మీ ముందుకు తీసుకొస్తాం. అప్పుడు పూర్తి వివరాలు తెలుస్తాయి' అని రాజమౌళి సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మొహం కనిపించకుండా, ఛాతీభాగం రక్తమోడుతూ ఉన్న ప్రీ లుక్ పోస్టర్‌ను ఆయన షేర్ చేశారు. మెడలో మాల, కింద త్రినేత్రం, ఢమరుకం, త్రిశూలం, నంది, రుద్రాక్ష ఉన్న లాకెట్‌ను ధరించి కనిపించారు మహేశ్‌బాబు. ఫుల్ పోస్టర్‌ను ప్రపంచ యాత్రికుడు పేరుతో నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని రాజమౌళి తెలిపారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

అనుపమ నటన అలరిస్తుంది

- రామ్



అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించిన 'పరదా' చిత్రం ట్రైలర్‌ను హీరో రామ్ పోతినేని విడుదల చేశారు. 'సినిమా బండి' చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీనివాసులు, శ్రీధర్, విజయ్ నిర్మిస్తున్నారు. "పరదా' చిత్రంలో అనుపమ సుబ్బు అనే యువతి పాత్రను పోషించారు. మహిళల పట్ల వివక్షను ప్రశ్నిస్తూ నిజాయతీగా సాగే కథ ఇదని దర్శకుడు చెప్పారు. తన కెరీర్‌లోనే బెస్ట్ పెర్ఫార్మెన్స్‌ను అనుపమ ఇచ్చారని తెలిపారు. రామ్ మాట్లాడుతూ 'చాలా అద్భుతమైన కథ ఇది. ఇలాంటి సినిమాలను తప్పకుండా ప్రోత్సహించాలి. ఈ నిర్మాతలు ముందుకు వచ్చి ఓ విభిన్న చిత్రాన్ని తీశారు. అనుపమ నాకు మంచి ఫ్రెండ్. ఏ పాత్ర ఇచ్చినా వంద శాతం ఎఫర్ట్ పెడుతుంది. సినిమా అంటే ఆమెకు చాలా ఫ్యాషన్. ఇందులో కూడా ఆమె అద్భుతంగా నటించారు. ఈ సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. అనుపమ మాట్లాడుతూ 'రామ్ నాకు మంచి స్నేహితుడు. 'పరదా' చిత్రం నాకు ఎంత ముఖ్యమో ఆయనకు తెలుసు. అందుకే తను బిజీగా ఉన్నా మా కోసం వచ్చి ఈ ట్రైలర్ విడుదల చేసినందుకు ఆనందంగా ఉంది. 'పరదా' చాలా మంచి సినిమా. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు. ఈ నెల 22న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాత విజయ్ చెప్పారు. మహేశ్ పుట్టిన రోజున సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తున్నామనీ, చిరంజీవి పుట్టిన రోజున చిత్రం విడుదలవుతుందని మరో నిర్మాత శ్రీధర్ చెప్పారు.

హారర్.. థ్రిల్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటించిన హారర్ మిస్టరీ థ్రిల్లర్ 'కిష్కింధపురిలో' చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. డార్క్ మిస్టీరియస్ వరల్డ్‌ను చూపిస్తూ, దానికి కాంట్రాస్ట్‌గా ఎమోషనల్ మూమెంట్స్‌ను చక్కగా మిక్స్ చేసిన చిత్రం ఇదనీ, కథ సాగుతున్న కొద్దీ ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు చెప్పారు. సినిమా కోసం టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోందనీ, ప్రమోషన్స్ వర్క్ ప్రారంభిస్తామని నిర్మాత తెలిపారు.

ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 వేడుకలు శనివారం హైదరాబాద్‌లో వేడుకగా జరిగాయి. నాని, అడివిశేష్, సిద్ధార్థ్, అదితీరావు హైదరీ దంపతులు సహా పలువురు సినీ తారలు ఈ కార్యక్రమంలో సందడి చేశారు.







మూడు విడతల్లో వేతనాల పెంపు

- ఫిల్మ్ చాంబర్

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

వివాదంగా మారిన సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై ఓ అడుగు ముందుకు పడింది. కొన్ని పరిమితులతో కూడిన వేతన పెంపునకు తాము సుముఖంగా ఉన్నట్లు నిర్మాతలు తెలిపారు. సుదీర్ఘ చర్చల అనంతరం మూడు విడతలుగా కార్మికుల వేతనాలు పెంచాలని నిర్మాతలు నిర్ణయించారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'రోజుకు రూ. 2 వేల కన్నా తక్కువ తీసుకుంటున్న కార్మికులకు తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం చొప్పున పెంచుతాం. రూ. 1000 కన్నా తక్కువ వేతనం ఉన్నవారికి వెంటనే 20 శాతం పెంచుతాం. మూడో ఏడాది మరో 5 శాతం వేతనం పెంచుతాం. లో బడ్జెట్ చిత్రాలకు పాత వేతనాలే అమలవుతాయి' అని చెప్పారు. ఈ సమావేశంలో నిర్మాత నాగవంశీ, నవీన్, విశ్వప్రసాద్, చెర్రీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాతల షరతులను అంగీకరించం: ఫెడరేషన్

వేతన పెంపు అమలుపై నిర్మాతల నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని తెలిపారు. ఫ్లెక్సీబుల్ కాల్‌షీట్లు, నాన్ మెంబర్స్‌తో పనిచేయించుకునే వెసులుబాటు, కాల్‌షీట్ లాంటి తదితర అంశాలపై నిర్మాతలు పెట్టిన షరతులకు అంగీకరించేది లేదన్నారు. ఫెడరేషన్‌లో విభేదాలు సృష్టించి, యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా నిర్మాతల నిర్ణయాలు ఉన్నాయని ఆరోపించారు. పది సంఘాలకు మాత్రమే పెంపును పరిమితం చేశారనీ రోజువారి వేతనాలు తీసుకునే 13 సంఘాలకూ ఒకే విధంగా పెంపును అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఆదివారం నుంచి తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అనిల్ ప్రకటించారు.

గోదావరి తీరంలో ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ప్రేమ కథా చిత్రం 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. శనివారం చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోదావరి తీరంలో ఆహ్లాదంగా సాగే ప్రేమకథా చిత్రమిదని అంజనప్ప తెలిపారు. ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే ప్రేమకథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని తుకారం చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఐఎస్ నౌఫల్ రాజా, సినిమాటోగ్రఫీ: రుద్రసాయి రాజా

ఊహించని మలుపులతో



సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సి-మంతం'. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా నటిస్తున్నారు. సుధాకర్ పాణి దర్శకత్వంలో ప్రశాంత్ టాటా నిర్మిస్తున్నారు. శనివారం చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సుధాకర్ పాణి మాట్లాడుతూ 'బీభత్సరస ప్రధాన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఊహించని మలుపులు, భయానక సంఘటనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ఒక మహిళ జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారమే మా చిత్ర కథ అని ప్రశాంత్ టాటా తెలిపారు. సంగీతం:ఎస్ సుహాస్, సినిమాటోగ్రఫీ: శ్రీనివాస్.

పిల్లల గ్రీన్‌కార్డుకు 'వయసు' తిప్పలు!

- దరఖాస్తు చేసిన తేదీ కాకుండా.. వీసా మంజూరైన తేదీయే పరిగణనలోకి
- ఈ నెల 15 నుంచే అమెరికాలో కొత్త నిబంధనలు
- తల్లిదండ్రులకు గ్రీన్‌కార్డు వచ్చినా.. పిల్లలకు కష్టమే!

వాషింగ్టన్, ఆగస్టు 9: అమెరికాలో శాశ్వత నివాస హోదా కల్పించే గ్రీన్‌కార్డుల నిబంధనల్లో మార్పు భారత సంతతి కుటుంబాలకు ఆశనిపాతంగా మారనుంది. సాధారణంగా అక్కడ ఉద్యోగం, వ్యాపారాలు చేసే విదేశీయులు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఆ కుటుంబాల్లోని 21 ఏళ్లలోపు వయసుండి, వివాహం కాని పిల్లలకు కూడా 'చైల్డ్ స్టేటస్ ప్రొటెక్షన్ యాక్ట్ (సీఎస్‌పీఏ)' కింద గ్రీన్‌కార్డు ఇస్తారు. ఇందుకోసం ఇన్నాళ్లుగా వారు దరఖాస్తు చేసుకున్న నాటి వయసును పరిగణనలోకి తీసుకునేవారు. ఇకపై వారి గ్రీన్‌కార్డు దరఖాస్తు ప్రాసెసింగ్/మంజూరు నాటి వయసును పరిగణనలోకి తీసుకునేలా ట్రంప్ ప్రభుత్వం మార్పులు చేసింది. ఆగస్టు 15 తర్వాతి నుంచి గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఇది భారత సంతతివారిపై, ముఖ్యంగా ఈబీ-2, ఈబీ-3 కేటగిరీల్లోని భారతీయులకు ఇబ్బందిగా మారనుంది. అమెరికాలో గ్రీన్‌కార్డు మంజూరుకోసం ఏళ్లకేళ్లు, ఒక్కోసారి దశాబ్దం పాటు ఎదురుచూడాల్సిందే. ఈ క్రమంలో దరఖాస్తు నాటికి, మంజూరు నాటికి కుటుంబాల్లోని పిల్లల వయసు పెరిగిపోతుంది. చాలా మంది 21 ఏళ్లు దాటిపోతారు. దానితో వారికి 'సీఎస్‌పీఏ' కింద గ్రీన్‌కార్డు మంజూరు చేయరు. చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. వారంతా విద్యార్థి వీసా (ఎఫ్-1)కు మారడం లేదా తాత్కాలిక హోదా కోసం దరఖాస్తు చేసుకోవడం తప్పదు.

'ఉద్యోగం' వదిలితే స్వదేశాలకే..

తాత్కాలిక ఉద్యోగ వీసాలపై వచ్చి.. నిర్ణీత ఉద్యోగంలో చేరకుండా ఉన్నా గానీ, ఆ ఉద్యోగాన్ని వదిలేసిన వెంటనే స్వదేశానికి వెళ్లిపోకుండా అమెరికాలోనే ఉండేవారుగానీ కఠిన చర్యలు ఎదుర్కోక తప్పదని ఆ దేశ ఇమిగ్రేషన్ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల ఫ్లోరిడాలో ఉద్యోగం కోసం హెచ్-2ఏ వీసాపై వచ్చిన ఓ వ్యక్తి సదరు సంస్థలో చేరకుండా, మరో చోటికి వెళ్లారని.. ఆ వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశామని వివరించింది. ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేసింది.

రష్యా ఉప ప్రధానితో డొభాల్ భేటీ

మాస్కో, ఆగస్టు 9: రష్యా పర్యటనలో ఉన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ ఆ దేశ అధినాయకత్వంతో వరుస సమావేశాలు జరుపుతున్నారు. తాజాగా రష్యా డిప్యూటీ ప్రధాని డెనిస్ మంటురోవ్‌తో సమావేశమయ్యారు. మాస్కోలో జరిగిన ఈ సమావేశంలో ద్వైపాక్షిక సైనిక-సాంకేతిక అంశాల్లో సహకారం, వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల అమలుపై చర్చించారు. పౌర విమానాల తయారీ, ఖనిజాలు, రసాయన పరిశ్రమలపై చర్చించినట్లు భారత్‌లోని రష్యా ఎంబసీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అంతకు ముందు డొభాల్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. భారత్‌లో పర్యటించాలన్న ఆహ్వానాన్ని పుతిన్ అంగీకరించారని డొభాల్ తెలిపారు.

15న పుతిన్‌తో భేటీ అవుతున్నా..

అలాస్కాలో కలవనున్నాం.. పుతిన్, జెలెన్ స్కీ ఇద్దరూ శాంతిని కోరుకుంటున్నారు

- రష్యా, ఉక్రెయిన్ మధ్య భూభాగాల మార్పిడి ఉంటుంది: ట్రంప్
- మా భూభాగాలను వదులుకొనే ప్రసక్తే లేదు: జెలెన్ స్కీ

వాషింగ్టన్, ఆగస్టు 9: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఓ కొలిక్కి వచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ అంశానికి సంబంధించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 15వ తేదీన భేటీకానున్నారు. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రుత్'లో ఈ వివరాలు వెల్లడించారు. "అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమావేశం ఆగస్టు 15న జరగనుంది. నేను, రష్యా అధ్యక్షుడు పుతిన్ అలాస్కాలో సమావేశం కానున్నాం. మిగతా వివరాలు తర్వాత తెలియజేస్తాను.." అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా, రష్యా అధ్యక్షులు నేరుగా భేటీకావడం 2021 తర్వాత ఇదే మొదటి సారి. అప్పటి అధ్యక్షుడు జో బిడెన్ జెనీవాలో పుతిన్‌తో భేటీ అయ్యారు. ఇక పుతిన్ అమెరికా గడ్డమీద చివరిసారిగా 2015 సెప్టెంబర్‌లో అడుగుపెట్టారు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో పాల్గొనేందుకు న్యూయార్క్ వచ్చిన ఆయన.. అప్పటి అధ్యక్షుడు ఒబామాతో భేటీ అయ్యారు.

రష్యా, ఉక్రెయిన్ మధ్య భూభాగం మార్పిడి ఉండొచ్చు..

'ట్రూత్'లో పోస్టు పెట్టడానికి ముందు అమెరికా అధ్యక్ష నివాసం వైట్‌హౌజ్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, జెలెన్స్కీ ఇద్దరూ శాంతిని కోరుకుంటున్నారని చెప్పారు. "శాంతి ఒప్పందమంటే.. ఇరు దేశాల మధ్య భూభాగాల మార్పిడి ఉంటుంది. ఇరుదేశాలకూ ప్రయోజనం కలిగించేలా.. కొన్ని ప్రాంతాలను తిరిగి ఇవ్వడం, మరి కొన్నింటిని వదులుకోవడం జరగవచ్చు. ఇదంత సులువేమీకాదు" అని ట్రంప్ పేర్కొన్నారు. శాంతి ఒప్పందం దిశగా ఇదే చివరి అవకాశమా? అని మీడియా ప్రస్తావించగా.. "చివరి అవకాశం అనే పదా



లను వాడటం నాకు ఇష్టం ఉండదు. ఎప్పుడైనా తుపాకులు పేలడం మొదలైతే.. వాటిని ఆపడం చాలా కష్టం" వ్యాఖ్యానించారు. కాగా, పుతిన్‌తో ట్రంప్ చర్చలు జరపనుండటాన్ని భారత్ స్వాగతించింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ఇది ముగింపు పలికి, శాంతిని నెలకొల్పుతుందని భావిస్తున్నామని విదేశాంగ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

భూభాగాలను వదులుకునే ప్రసక్తే లేదు: జెలెన్ స్కీ

ఉక్రెయిన్, రష్యా శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాలను వదులుకోవాల్సి రావొచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మండిపడ్డారు. ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం లేకుండా ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగే చర్చలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని.. వారు ఏదైనా డీల్ కుదుర్చుకుంటే అది 'విఫల పరిష్కారమే'నని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన టెలిగ్రామ్‌లో పోస్టు పెట్టారు. "అలాస్కాలో పుతిన్‌తో ట్రంప్ భేటీ అవుతున్నట్టు ప్రకటించారు. మా ప్రజలకు వ్యతిరేకంగా, మా భూభాగంలో జరుగుతున్న యుద్ధానికి దూరంగా జరిగే ఈ చర్చల్లో మా భాగస్వామ్యం లేకుండా ఎలాంటి ఫలితం ఉండదు. మేం అసలైన శాంతిని కోరుకుంటున్నాం. మా భూభాగాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదు.." అని జెలెన్ స్కీ స్పష్టం చేశారు.

భారత్, పాక్ యుద్ధంలో ఆరు విమానాలు కూలాయి: ట్రంప్

భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. ట్రంప్ జోక్యంతో అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. దీనిపై వైట్‌హౌజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరుదేశాల నేతలతోపాటు ట్రంప్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "ప్రపంచంలో శాంతిని, సుస్థిరతను నెలకొల్పాలన్నదే అమెరికా అధ్యక్షుడిగా నా కోరిక. ఇప్పటికే భారత్, పాకిస్థాన్ సహా ఐదు యుద్ధాలను ఆపాను. భారత్, పాక్ యుద్ధం ఆపడం పెద్ద విషయం. వాళ్లు యుద్ధ విమానాలతో దాడులు చేసుకున్నారు. ఐదారు యుద్ధ విమానాలు కూలిపోయాయి. పరిస్థితి ప్రమాదకరంగా మారింది. అందుకే నేను జోక్యం చేసుకున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఏ దేశ విమానాలు కూలాయన్న వివరాలేవీ ఆయన ప్రస్తావించలేదు.

ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకే చేటు

- భారత్ కాస్త ఓపిక పడితే ట్రంప్ గాలి మేడలు కూలిపోతాయి
- ఆర్థికవేత్త ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ విశ్లేషణ

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఆగస్టు 9: "ఏళ్ల తరబడి కొన్ని దేశాలు అమెరికా నుంచి ప్రయోజనం పొందాయి..! ఇప్పుడు ఆ దేశాల నుంచి బిలియన్ డాలర్లు వెనక్కి వస్తాయి" - ట్రూత్ సోషల్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్టు ఇది..! ఇలా అమెరికా ఖజానాను నింపడానికి ఏ దేశానికి ఎంత టారిఫ్ విధించాలంటూ లెక్కలేసుకుంటూ ట్రంప్ ఓ గాలి మేడను నిర్మిస్తున్నారని, ఈ ధోరణితో అది పేకమేడలా కూలిపోయే ప్రమాదముందని ఆర్థికవేత్త, జాన్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ హెచ్చరించారు. భారత్‌పై ట్రంప్ 50% సుంకాలు విధించడంపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో హాంకీ విశ్లేషణతో అమెరికా భవిష్యత్‌కు ఇబ్బందులు తప్పవనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రొఫెసర్ హాంకీ శనివారం ఓ జాతీయ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. ట్రంప్ టారిఫ్ పూర్తిగా అర్థరహితమన్నారు. "నెపోలియన్ చెప్పినట్లు ఆయన(ట్రంప్) ధోరణి తనను తానే నాశనం చేసుకునేట్లుంది. భారత్ విషయంలో ప్రధాని మోదీ, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కాస్త ఓపికపడితే చాలు. ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని హాంకీ వ్యాఖ్యానించారు. అమెరికన్లు సంపాదన కంటే ఎక్కువ ఖర్చు చేస్తున్నారని, దాంతో వాణిజ్య లోటు పెరుగుతోందని గుర్తుచేశారు. "ట్రంప్ విధిస్తున్న సుంకాల ప్రభావం వస్త్రపరిశ్రమ, సముద్ర ఉత్పత్తులు, తోలు ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూలంగా ఉంటుంది" అని ఆయన వివరించారు. చైనా రాయబారి షు ఫెహోంగ్ కూడా అమెరికా సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) నిబంధనలకు విరుద్ధమన్నారు. అటు రష్యా కూడా అమెరికా చర్యలను తీవ్రంగా విమర్శించింది. ట్రంప్ మాత్రం తన చర్యలు అమెరికా స్టాక్ మార్కెట్లకు బూస్ట్ ఇస్తున్నాయని, కోర్టు గనక సుంకాలకు వ్యతిరేకంగా తీర్పునిస్తే.. 1929 నాటి మహామాంద్యం తప్పదంటున్నారు.

రొయ్యకు ట్రంప్ దెబ్బ!

ఎగుమతుల్లో దేశంలోనే ఏపీ టాప్

- అందులో 'గోదావరి' వాటా 60 శాతం

మచిలీపట్నం/ఆకివీడు రూరల్/పాలకొల్లు/కలిదిండి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ఎగుమతులపై భారీగా సుంకాలు విధించడం ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. ముఖ్యంగా ఆక్వా రంగంపై భారీ దెబ్బ పడనుంది. ఆక్వా ఎగుమతులపై ట్రంప్ 50 శాతం సుంకం విధించడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ఆక్వా రైతులు అల్లాడిపోతున్నారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న ఆక్వా రైతులు తాజాగా సుంకాల దెబ్బకు తమపై పెనుభారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో రొయ్యల ధరలు మరింత పతనమైతే ఆక్వా సాగు చేయాలా, వద్దా అనే మీమాంసలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) యాంటీబయోటిక్ ఆరోగ్య ప్రమాణాలను కఠినతరం చేసింది. దీనివల్ల మందులు ఎక్కువ వాడిన రొయ్యలను తిరస్కరించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు, ట్రేడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆక్వా ఎగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించగానే రాష్ట్ర ప్రభుత్వం ఓ ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. సుంకాల పెంపు వల్ల ధరలు, ఎగుమతులపై ప్రభావం, ఆక్వా రంగ పరిస్థితిపై అధ్యయనం చేస్తోంది.

'గోదావరి' ఆయువు పట్టు

ఆక్వా రంగానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు ఆయువు పట్టు. దేశవ్యాప్తంగా విదేశాలకు ఎగుమతి అయ్యే రొయ్యల్లో ఈ రెండు జిల్లాల నుంచే దాదాపు 60 శాతం ఉత్పత్తి జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఏటా దాదాపు 10-11 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుండగా, అందులో ఉభయ గోదావరి జిల్లాల్లోనే 6లక్షల టన్నుల వరకు ఉత్పత్తి చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 3 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతోంది. అందులో అమెరికాకు 40 శాతం, చైనాకు 30 శాతం ఎగుమతి అవుతున్నాయి. వీటి ద్వారా భారీగా విదేశీ మారకద్రవ్యం వస్తోంది. భీమవరం



కేంద్రంగా ప్రఖ్యాతి పొందిన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లు ఉన్నాయి. తాజాగా ట్రంప్ విధించిన 50 శాతం సుంకం ఈ నెల 27నుంచి అమల్లోకి రానుంది. ఇక్కడి నుంచి అమెరికాకు రొయ్యలు ఎగుమతి చేయాలంటే 40 రోజుల వ్యవధి పడుతుంది. దీంతో వ్యాపారులు ఇప్పటి నుంచే ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

పడిపోయిన రొయ్యల ధరలు

ఆక్వా ఉత్పత్తులలో అమెరికాకు 40 శాతం ఎగుమతి అవుతున్నది. 20 కౌంటు నుంచి 60 కౌంటు మాత్రమే ఎక్కువ శాతం ఎగుమతి చేస్తున్నారు. తొలుత ఆక్వా ఎగుమతులపై 25 శాతం సుంకం విధించినపుడు అమెరికాలోని బయ్యర్లు ఈ భారాన్ని భరించేందుకు అంగీకరించారని చెబుతున్నారు. 50 శాతం సుంకం పెంచుతున్నట్లు ట్రంప్ ప్రకటన చేశాక అమెరికాలోని బయ్యర్లు చేతులెత్తేశారనే ప్రచారం తెరపైకి తెచ్చి, రొయ్యల ధరలను స్థానిక ఎగుమతిదారులు తగ్గించివేశారని ఆక్వా రైతులు అంటున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉత్పత్తయ్యే పెద్దరొయ్యలలో 50 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు సుంకం పెంచుతున్నట్లు ప్రకటన చేసిన వెంటనే స్థానికంగా ఉన్న ఎగుమతిదారులు గత మూడు, నాలుగు రోజులుగా రొయ్యల ధరలను తగ్గించివేశారు. గతంలో కిలోకు 25 తూగే రొయ్యల ధర రూ.565 ఉండగా, ఇప్పుడు రూ.430కు తగ్గించారు.

కేంద్రం ప్రోత్సాహకాలు ఇవ్వాలి

గతంలో అసైన్డ్ భూములలో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రాయితీని ఎత్తివేసింది. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి అసైన్డ్ భూములను మినహాయించింది. ఆక్వా జోన్‌లో ఉన్నప్పటికీ ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకే విద్యుత్ రాయితీని ఇస్తామని గత ప్రభుత్వం మెలికపెట్టింది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పరిశ్రమగా గుర్తించింది. మేత ధరలు తగ్గించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆక్వా జోన్‌ను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్రం కూడా రాయితీలు కల్పిస్తే అమెరికా విధించిన టారిఫ్ నుంచి గట్టెక్కే అవకాశం ఉందని అటు వ్యాపారులు, ఇటు రైతులు ఆశిస్తున్నారు.

ఏపీ అగ్రి ఎగుమతులకు దెబ్బ

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రష్యా నుంచి చమురు కొనుగోలుచేస్తున్నామన్న సాకుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించిన పరిణామం.. ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. రాష్ట్రం నుంచి ఇప్పుడిప్పుడే అమెరికాకు పలు వ్యవసాయ, ఇతర ఉత్పత్తుల ఎగుమతులు ఊపందుకుంటున్నాయి. వీటిలో దంపుడు బియ్యం, ఉప్పుడు బియ్యం, పాలిష్డ్ బియ్యం, పిండి, జీడిపప్పు, బెల్లం పొడి, టమోటా సాస్, మినరల్ వాటర్, రోస్టెడ్ నట్స్, తృణ ధాన్యాల ఉత్పత్తులు మొదలైనవి ఉన్నాయి. వీటివల్ల విదేశీ మారక ద్రవ్యం కూడా పెరుగుతోంది.

ఏటా 20వేల కోట్ల ఎగుమతులు

అమెరికాకు రొయ్యల ఎగుమతిలో ఏపీ ప్రధాన వాటాదారు. దాదాపు రూ.20 వేల కోట్ల రొయ్యలను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తుండగా.. ఇందులో అమెరికాకు వెళ్లే రొయ్యల విలువే రూ.16 వేల కోట్లు ఉంది. అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్‌గా నిలిచే యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలకు ఆక్వా ఉత్పత్తులు పంపడం సవాల్‌తో కూడుకున్నదని ఆక్వా ఎగుమతిదారులు అంటున్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగంపై దాదాపు 10 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. సుంకాల పెంపుతో ఎగుమతులు, ఉత్పత్తులు నిలిచిపోతే ఆ కుటుంబాలు రోడ్డున పడతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు రాష్ట్రప్రభుత్వం, కేంద్రం చర్యలు తీసుకోవాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు పి.భాస్కర్ కోరారు. ప్రధానంగా ప్రత్యామ్నాయ మార్కెట్ల అన్వేషణలో సహకరించాలని కోరారు.

ఫార్మాకూ సుంకాల ముప్పు!?

- ప్రస్తుతానికి మినహాయింపు..
- భవిష్యత్‌లో వడ్డింపు తప్పదని ట్రంప్ హెచ్చరిక
- మన ఔషధ ఎగుమతుల్లో 40% అమెరికాకే..
- టారిఫ్‌లతో ఫార్మా కంపెనీల ఆదాయం 10% వరకు తగ్గే అవకాశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50% సుంకాలతో భారత ఎగుమతి రంగాలు బెంబేలెత్తిపోతున్నాయి. అయితే, అమెరికాలో చవకగా ఔషధాలు లభించడంలో కీలకపాత్ర పోషిస్తున్న భారత ఫార్మా రంగానికి మాత్రం సుంకాల నుంచి మినహాయించారు. ఫార్మా సహా పలు రంగాలకు ఇచ్చిన మినహాయింపుపై సమీక్ష జరుగుతోందని, అవసరమైతే వీటినీ సుంకాల పరిధిలో చేరుస్తామని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. పైగా, ఫార్మాపై సుంకాలను వచ్చే 18 నెలల్లో 250 శాతానికి పెంచుతామని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఊరట లభించినప్పటికీ, భవిష్యత్‌లో అమెరికా అధ్యక్షుడి నిర్ణయం ఎలా ఉండనుందోనని మన ఫార్మా రంగం, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఔషధ తయారీ పరిశ్రమ ఆందోళన చెందుతోంది.

జెనరిక్ ఔషధాల్లో 35 శాతం మనవే..

ఒకవేళ ట్రంప్ ఔషధాలనూ సుంకాల పరిధిలోకి తెస్తే, మన ఫార్మా పరిశ్రమ కూడా 50 శాతం సుంకం చెల్లించేందుకు సిద్ధమవ్వాల్సిందే. ఇదే గనుక జరిగితే, మన ఔషధ కంపెనీల ఆదాయం 5-10 శాతం మేర తగ్గే ప్రమాదం ఉందని ఎస్‌బీఐ తాజా నివేదిక అంచనా వేసింది. ఎందుకంటే, అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాస్యూటికల్ మార్కెట్. ఆ దేశానికి అత్యధికంగా (35 శాతం) జెనరిక్ ఔషధాలు సరఫరా చేసేది మనమే. గత ఆర్థిక సంవత్సరంలో మన ఫార్మా మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటాయే దాదాపు 40 శాతం. ముఖ్యంగా పెద్ద కంపెనీల ఆదాయంలో అమెరికాకు ఎగుమతుల ద్వారా సమకూరే వాటా 40-50 శాతం వరకు ఉంది. సుంకాల భారాన్ని కస్టమర్ల పైకి బదిలీ చేయలేక మన ఔషధ సంస్థల పోటీ సామర్థ్యం తగ్గిపోతుందని, దాంతో ఆదాయాలతో పాటు లాభదాయకతకూ గండిపడే అవకాశం కనిపిస్తోంది.

అమెరికా వినియోగదారులకే నష్టం: ఫార్మెక్సిల్

భారత ఫార్మాపై సుంకాలు విధిస్తే, అమెరికాకే నష్టమని ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషీ అన్నారు. దీంతో అమెరికా కస్టమర్లు ఔషధాల కోసం అధికంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. మన జెనరిక్ ఔషధ తయారీ కంపెనీలు అతి స్వల్ప మార్జిన్లతో వ్యాపారం చేస్తాయని, సుంకాల భారాన్ని వినియోగదారులపైకి బదిలీ చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. స్వదేశంలోనే ఫార్మా రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న అమెరికా అధ్యక్షుడి ఆలోచన ఇప్పటికిప్పుడు సాకారమయ్యేది కాదని, కనీసం 3-5 ఏళ్ల సమయం పడుతుందన్నారు.

హైదరాబాద్ ఫార్మాపై అధిక ప్రభావం

డాక్టర్ రెడ్డీస్, దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా, నాట్కో ఫార్మా, హెటిరో, ఎంఎస్ఎన్ ఫార్మా, గ్లాండ్ ఫార్మా, గ్రాన్యూల్స్ ఇండియా సహా 800కు పైగా కంపెనీలకు నెలవైన హైదరాబాద్ ఫార్మా పరిశ్రమపై సుంకాలు అధిక ప్రభావం చూపనున్నాయి. అమెరికాకు అత్యధికంగా ఔషధాలు ఎగుమతి చేస్తున్న కంపెనీల్లో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్, అరబిందో, నాట్కో సహా మరికొన్ని కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీల ఆదాయాల్లో 40 శాతం వరకు ఒక్క అమెరికా నుంచే వస్తుండటం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి ఔషధ ఎగుమతులు 9 శాతం వృద్ధి చెందిన 3,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.2.5 లక్షల కోట్లు) దాటాయి. అందులో తెలుగు రాష్ట్రాల వాటా 30 శాతం పైమాటే.

దేశీయ రక్షణ ఉత్పత్తుల రికార్డు

- 2024-25లో రూ. 1.51 లక్షల కోట్లకు ఉత్పత్తులు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: దేశీయ రక్షణరంగ ఉత్పత్తులు రికార్డు స్థాయిలో పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రక్షణ ఉత్పత్తులు రూ. 1,50,590 కోట్లకు చేరి ఆల్‌టైం అత్యధిక రికార్డును నమోదు చేశాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం తెలిపారు. ఇది అంతక్రితం ఏడాది కంటే 18% అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఉత్పత్తులు రూ.1.27 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కాగా 2019-20లో రూ. 79,071 కోట్లుగా ఉన్న ఉత్పత్తులు ఆ తర్వాత రాకెట్ వేగంతో దూసుకెళ్లాయి. ఆ ఏడాది నుంచి చూస్తే ప్రస్తుతం 90% అధికం. మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ), పబ్లిక్ సెక్టార్ యూనిట్ల (పీఎస్‌యూ) వాటా 77 శాతంగా ఉంది. మిగిలిన 23% ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం. ఇక 2024-25లో ప్రైవేట్ సెక్టార్ వాటా 2% పెరిగింది. 2023-24లో అది 21 శాతంగా ఉంది. పబ్లిక్, ప్రైవేట్ సంస్థల సమష్టి సహకారంతో రక్షణరంగ ఉత్పత్తుల్లో రికార్డు నెలకొల్పగలిగామని రాజ్‌నాథ్ కొనియాడారు. రక్షణ పరిశ్రమల్లో భారత్ బలోపేతం అయిందనడానికి ఇదే స్పష్టమైన సంకేతమన్నారు. ఆత్మనిర్భర్‌లో భాగంగా ప్రభుత్వ ప్రోత్సాహంతో రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధిస్తున్నామని ఆయన చెప్పారు. రక్షణ ఉత్పత్తుల్లో 2028-29 నాటికి రూ. 50 వేల కోట్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకుంటామని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ ధీమా వ్యక్తం చేశారు.

6 పాక్ విమానాలు కూల్చేశాం

- ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్

బెంగళూరు, ఆగస్టు 9: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో వాయుసేన కీలక పాత్ర పోషించిందని ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. దాయాది దేశానికి చెందిన ఓ పెద్ద విమానం సహా 6 యుద్ధవిమానాలను నేలమట్టం చేశామని చెప్పారు. ఉపరితలం నుంచి గగనతల లక్ష్యాలపై జరిపిన దాడుల్లో ఇదే అతి పెద్దదని పేర్కొన్నారు. బెంగళూరులో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో అమర్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ వైమానిక సామర్థ్యాన్ని దెబ్బతీశామన్నారు. పలు ఎఫ్16ఎస్ యుద్ధ విమానాలను నేలమట్టం చేయడంతోపాటు, ఒక హ్యాంగర్‌ను కూడా ధ్వంసం చేశామని తెలిపారు. అదేవిధంగా ఒక పెద్ద విమానాన్ని కూడా కూల్చివేసినట్టు వివరించారు. మానవ రహిత వైమానిక వాహనాలు సహా డ్రోన్లు, క్షిపణులను కూడా నేలమట్టం చేశామని, అవి భారత భూభాగంలోనే కూలిపోయాయని తెలిపారు. ప్రధానంగా సుక్కూర్ వైమానిక స్థావరంపై జరిపిన దాడిలో యూఏవీ హ్యాంగర్, రాడార్ వ్యవస్థను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని వీడియోలను ప్రదర్శించి.. పాక్‌లోని సుక్కూర్ వైమానిక స్థావరంలో దాడి తర్వాత నెలకొన్న పరిస్థితిని వివరించారు. సర్గోధా స్థావరంలోని ఎఫ్-16ఎస్ యుద్ధ విమానాలపై జరిపిన దాడి గురించి వివరిస్తూ.. తన రిటైర్మెంట్‌కు ముందు లభించిన అవకాశంగా పేర్కొన్నారు. ఇటీవల భారత ప్రభుత్వం సేకరించిన ఎస్-400 రక్షణ వ్యవస్థ గేమ్ చేంజర్ వంటిదన్నారు. పాక్ యుద్ధ విమానాలు, మానవ రహిత విమానాలను ఈ వ్యవస్థ బలంగా ఎదుర్కొంటుందని తెలిపారు. సైనిక కార్యకలాపాలలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) పదవి అనేక మార్పులు తీసుకువచ్చిందని అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. సీడీఎస్ అన్ని వేళలా అందుబాటులో ఉండి.. తమకు ఎన్నో సూచనలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా 'ఆపరేషన్ సిందూర్'లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ కీలక పాత్ర పోషించారని చెప్పారు.

అందుకే స్వేచ్ఛగా..!

'ఆపరేషన్ సిందూర్' విషయంలో కేంద్ర ప్రభుత్వం సుస్పష్టమైన రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించిందని అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. అందుకే ఆపరేషన్ విజయవంతమైందన్నారు. వైమానిక దళంపై ఎలాంటి నిబంధనలు పెట్టలేదని, దీంతో తాము స్వేచ్ఛగా పని పూర్తిచేశామని చెప్పారు.

ఏ ఒత్తిడి పనిచేసింది?: కాంగ్రెస్

పాకిస్థాన్‌కు చెందిన 6యుద్ధ విమానాలు కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పిన విషయంపై విపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెబుతున్న సమయంలో ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు అంత హఠాత్తుగా నిలుపుదల చేయాల్సి వచ్చిందని ప్రశ్నించింది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు.

ఒక్క విమానాన్నీ కూల్చలేదు

- భారత్‌ది అసంబద్ధ వాదన: పాక్

'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చివేశామన్న భారత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ వ్యాఖ్యలను పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ తోసిపుచ్చారు. ఆ వాదనలో పసలేదని, అదొక అకాల, అసంబద్ధమైన వాదనని ఎదురు దాడి చేశారు. తాము ఒక్క విమానాన్నీ నష్టపోలేదన్నారు. అంతేకాదు.. స్వతంత్ర ధ్రువీకరణ కోసం ఇరు దేశాల విమానాల జాబితాను బహిరంగ పరుద్దామని సలహా ఇచ్చారు. "మా యుద్ధ విమానాల్లో ఒక్కదాన్నీ భారత్ కూల్చలేదు. ధ్వంసం కూడా చేయలేదు. 3 నెలలుగా దీనిపై ఆ దేశం ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కానీ, భారత్ ఇప్పుడు ఏదో చేసేశాం అంటోంది. ఇది నమ్మశక్యం కాని అకాల, అసంబద్ధ వాదన." అని ఆసిఫ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి శీనివాసరావుకు గంగాశరణ్ సింగ్ పురస్కారం



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో హిందీ సాహిత్యం, భాషల పురోగతికి విశిష్టమైన సేవలు అందించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు బిహార్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకమైన గంగాశరణ్ సింగ్ పురస్కారం లభించింది. ఈ నెల 23న బిహార్ సీఎం నితీశ్‌కుమార్ చేతుల మీదుగా ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. పురస్కారంలో భాగంగా ఆయనకు లక్ష రూపాయల నగదును బహూకరించి సత్కరిస్తారు. దేశ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అనుయాయుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గంగాశరణ్ సింగ్ హిందీని జాతీయ భాషగా గుర్తించేందుకు చేసిన కృషి రీత్యా ఆయన పేరిట ఏటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

చేతక్, చీతా చాపర్లకు స్వస్తి!

- వాటి స్థానంలో ఆధునిక లైట్ హెలికాప్టర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: కాలంతీరిన చేతక్, చీతా చాపర్ల స్థానంలో ఆధునిక హెలికాప్టర్లను ప్రవేశపెట్టడానికి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ ప్రయత్నాలు ప్రారంభించాయి. దీనికోసం 200 ఆధునిక తేలికపాటి హెలికాప్టర్లను కొనుగోలు చేస్తున్నాయి. వీటిలో 120 ఆర్మీకి, 80 వాయుసేనకు కేటాయించారు. 1960 దశకం నాటి చేతక్, చీతా హెలికాప్టర్లలో ఆధునిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే మిగ్-21 ఫైటర్ జెట్లలా వీటి క్రాష్ రేటు కూడా ఎక్కువ. పైలట్లకు విజిబిలిటీ సమస్య కూడా ఎదురవుతోంది. అందువల్ల వీటి స్థానంలో ఆధునిక హెలికాప్టర్లను ప్రవేశపెట్టడానికి నిర్ణయం తీసుకున్నారు.



అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు మండలం లగిశపల్లిలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, సభకు హాజరైన జనం






వంజంగిలో శంకుదేవుడికి పూజలు చేస్తున్న చంద్రబాబు



గిరిజన ప్రాంతంలో సాగుచేసే పంటల విత్తనాలను పరిశీలిస్తున్న సీఎం



ఉచితంగా రూఫ్ టాప్ సోలార్

"రాష్ట్రంలో గిరిజన జనాభా 28.32 లక్షలు, కుటుంబాలు 8.41 లక్షలు. వారిలో 4.82 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. త్వరలో వారందరికీ రూఫ్ టాప్ సోలారు యూనిట్లు ఉచితంగా ఇస్తాం. పెట్రోల్ ఖర్చు లేకుండా ఎలక్ట్రిక్ వాహనాలు కూడా చార్జింగ్ చేసుకొని రయ్ రయ్ మంటూ తిరగవచ్చు."

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

"ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తెస్తున్నాం. ఏజెన్సీలో 7 అన్న క్యాంటీన్లు పెడతాం. సంతకు వచ్చే గిరిజనులు అక్కడ రూ.5కే భోజనం చేయవచ్చు. ఈ నెలాఖరుకు డీఎస్సీ ద్వారా టీచర్లను నియమిస్తాం. రాష్ట్రానికి ఇప్పటివరకూ పది లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేశాం. వాటి ద్వారా 9 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.. కొత్త ప్రాజెక్టు ఒకటి ప్రారంభించి 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి లక్ష చొప్పున ఆదాయం వచ్చేలా చేస్తాం. సమాజంలో పేదలను పైకి తీసుకురావడానికి ఆర్థికంగా స్థితిమంతులైన వారు సాయం చేయాలనే తలంపుతో పీ-4 పథకం అమలు చేస్తున్నాం." అని చంద్రబాబు తెలిపారు.

ఆదివాసీల రక్షణకు నాదీ హామీ!

"గిరిజనుల పోస్టులు గిరిజనులకే అనే స్ఫూర్తితో ఏజెన్సీలో జీవో నంబరు 3ను తెచ్చాను. ఆ జీవోను కోర్టులో కొట్టివేయించేలా చేసింది మీ నాయకుడు (జగన్) కాదా?. కనీసం కౌంటర్ కూడా వేయలేదు. ఏజెన్సీని గంజాయి అడ్డాగా మార్చారు. గిరిజనుల హక్కుల్ని కాపాడే విధానం ఇదేనా?. ఎంతవరకైనా పోరాడి ఆ జీవోను మళ్లీ పునరుద్ధరిస్తాం. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఆదివాసీ హక్కుల పరిరక్షణ బాధ్యతను నేను తీసుకుంటా.' - తన పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిచ్చిన వైసీపీ నేతలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

గిరిజనులకు ఇవ్వాలని నాడు జీవో నంబరు 3ను తాము తీసుకువస్తే, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు వాటిని రద్దు చేశాయన్నారు. ఈ సందర్భంగా తన పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిచ్చిన వైసీపీ నేతలను ఉద్దేశించి చంద్రబాబు తీవ్ర స్వరం వినిపించారు. గతంలో రెండుసార్లు పాడేరు రావాలని ఏర్పాట్లు చేసుకోగా, వాతావరణం అనుకూలించలేదన్నారు. ఇప్పుడు ఒకేరోజు రెండు శుభకార్యాలు..ఒకటి ఆదివాసీ ప్రపంచ దినోత్సవం, మరొకటి రక్షా బంధనం చేసుకునేలా దేవుడు అవకాశం కల్పించాడన్నారు. గిరిజనుల్లో మాణిక్యాలు ఉన్నారని, 25 వేల మంది గిరిజన విద్యార్థులు విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సం దర్భంగా 108 సూర్య నమస్కారాలు, 108 నిమిషాలు పాటి నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించారని గుర్తుచేశారు. పులివెందులలో సొంత బాబాయ్‌ని గొడ్డలితో ఘోరంగా న రికి చంపేశారని, దానిని గుండెపోటుగా సాక్షి టీవీలో ప్రసా రం చేస్తే నాడు సీఎంగా ఉన్న తాను నిజమేనని నమ్మానన్నారు. అది అప్పటి కాలమని, ఇప్పుడు సీబీఎన్ మారిపోయాడని, రాజకీయ ముసుగులో హత్యలు, దారుణాలు చేస్తే చూస్తూ ఊరుకోనన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఏజెన్సీకి 'వందనం'..

"ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చాం. వాటిని ఏడాది కాలంలోనే అమలుచేసి హిట్ కొట్టాం. పక్కనే ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పెన్షన్లు వేయి, రెండు వేల రూపాయలే ఇస్తున్నారు. ఏపీలో మాత్రం రూ.4 వేలు ఇస్తున్నాం. గిరిజనుల పెన్షన్ల కోసమే ఏడాదికి రూ.1,595 కోట్లు వెచ్చిస్తున్నాం. తల్లికి వందనం పథకం ఏజెన్సీ గిరిజనులకు ఎక్కువ లబ్ధిని చేకూర్చింది. ఇక్కడ ఒక్కో కుటుంబంలో ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నారు. వారిలో చదువుకున్న అందరికీ రూ.15 వేలు చొప్పున ఇచ్చాం.(పలువురి పేర్లు చదివారు.) 4,86,803 మంది పిల్లలకు రూ.643 కోట్లు ఇచ్చాం. ఏజెన్సీలో 373 నూతన భవనాల నిర్మాణానికి రూ.45 కోట్లు ఇటీవలే విడుదల చేశాం. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి రూ.1,337 కోట్లు వెచ్చించాం. ఏజెన్సీ విద్యాలయాల్లో 10+2 కూ డా పెడతాం. విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో స్టడీ సర్కిళ్లు పెట్టి రూ.4.5 కోట్లు అందిస్తున్నాం. రూ.150 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతిగృహాలుగా మారుస్తున్నాం."

అరకు కాఫీకి మార్కెటింగ్

"అరకు కాఫీని నేనే ప్రమోట్ చేస్తున్నాను. ప్రపంచమంతటా మార్కెటింగ్ జరిగేలా చర్యలు చేపట్టాం. పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాల్ పెట్టాం. ఇక్కడ ఏజెన్సీలోని 11 మండలాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తుండగా అదనంగా మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు వేయనున్నాం. 1.8 లక్షల ఎకరాల్లో చెర్రీ కాఫీ సాగు చేపట్టి 90 వేల టన్నుల ఉత్పత్తిని గిరిజనులు సాధిస్తున్నారు. ఏజెన్సీలో గంజాయి సాగును వైసీపీ అరికట్టలేకపోయింది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఈ ప్రాంతానికి చెడ్డ పేరు వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులను నిర్మించి ప్రపంచంతో అనుసంధానం చేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రూ.200 కోట్లతో 269 కిలోమీటర్ల రోడ్డు నిర్మించి 203గ్రామాలకు సౌకర్యం సమకూర్చాం."

డోలీలకు చెక్..

"గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్యం అందుబాటులో లేక రోగులను డోలీల ద్వారా తీసుకువెళుతున్నారు. ఈ సమస్య నివారణకు ఐదు ప్రాంతాల్లో (సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్‌పురం, శ్రీశైలం) మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నాం. వీటిని త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. కొందరు డాక్టర్లు ఏజెన్సీకి రావడం లేదు. వారికి ఇన్సెంటివ్‌లు ఇచ్చి రప్పిస్తాం. పోస్టులన్నీ భర్తీ చేస్తాం. ఏజెన్సీలో సికిల్ సెల్ రోగులు 1,487 మంది ఉండగా వారికి నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇస్తున్నాం. గర్భిణులకు పోషకాహారం ఇస్తున్నాం. 76 బర్త్ వెయిటింగ్ హాళ్లను బలోపేతం చేశాం. మరో 35 కొత్త భవనాలు నిర్మిస్తున్నాం."

అడవి బిడ్డలతో బాబు మమేకం

రాఖీ కట్టిన ఆదివాసీ మహిళ

కాఫీ తోటల్లో రైతులతో మాటామంతీ

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంజంగి గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మమేకమయ్యారు. తొలుత గ్రామ రచ్చబండ వద్ద గిరిజన దైవం శంకుదేవుడిని దర్శించుకుని, కొబ్బరికాయ కొట్టారు. అనంతరం గిరిజన పండగలు, సంప్రదాయాలు, ఆచారాలపై అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. గిరిజనులు నిర్వహించే విత్తనాలు పండగ, కొర్రకొత్త పండగ, సంకాంత్రి పండగలు, వారి ఆచారాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు పండగల గురించి చంద్రబాబుకు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, తెలుగు మహిళ నేత వంజంగి కాంతమ్మ వివరించారు. అక్కడకు సమీపంలో ఉన్న గుమ్మడి పాదును పరిశీలించి, అనంతరం అంగన్‌వాడీ చిన్నారులను పలకరించారు. అనంతరం గిరిజన మహిళ వంతాల కొండమ్మ ఇంటికి వెళ్లారు. కొండమ్మ ఆయనకు రాఖీ కట్టి, తాను తయారుచేసిన వంటకాలను సీఎంకు అందించారు. ఈ సందర్భంగా వారి దైనందిన జీవితం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎంత మంది పిల్లలు?, తల్లికి వందనం డబ్బులు అందాయా?.. అని అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు పిల్లలకు ఇద్దరు మాత్రమే పాఠశాలకు వెళుతున్నారని, వారిద్దరికీ సంబంధించి తల్లికి వందనం డబ్బులు ఖాతాలో పడ్డాయని కొండమ్మ తెలిపింది. పెద్దబ్బాయి డ్రాపవుట్ అయ్యాడని స్కూల్‌కు వెళ్లడడం లేదని తెలపగా...ఆ బాలుడుతో చంద్రబాబు మాట్లాడి పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని సూచించారు. 'నీవు స్కూల్‌కు వెళితే, మీ ఇంట్లో ముగ్గురికి తల్లికి వందనం డబ్బులు అందుతాయి' అని పేర్కొన్నారు. అనంతరం కాఫీ తోటల్లో గిరిజన రైతు పూజారి సత్యారావు, కృష్ణవేణి దంపతులతో ముఖ్యమంత్రి మాటామంతీ నిర్వహించారు. కాఫీ తోటల ద్వారా ఏడాదికి ఎంత ఆదాయం వస్తుంది?... ఈ ఏడాది ఎంత వచ్చింది?... ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందించాలి?... అని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది రూ.60 వేలు ఆదాయాన్ని సంపాదించామని రైతు సత్యారావు తెలిపారు.కాఫీ, మిరియాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఆయన సీఎంను కోరారు. ఈ సందర్భంగా అక్కడే అరకు కాఫీని సీఎం రుచి చూశారు. కాఫీ తోటల్లో మిరియాలు సేకరణ చేసే పద్ధతిని చంద్రబాబు పరిశీలించారు. నూతన కాఫీ ప్రాజెక్టులో భాగంగా గిరిజన రైతులకు అల్యూమినియంతో తయారుచేసిన నిచ్చెనలు ఇస్తామని ముఖ్యమంత్రి వారికి తెలిపారు.



అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగిలో తన ఇంటికి వచ్చిన సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న గిరిజన మహిళ కొండమ్మ

అడ్డుకుంది మీ నాయకుడు కాదా?

వైసీపీ నేతల తీరుపై సీఎం ఫైర్

"మీరు నన్ను ప్రశ్నించడం కాదు...నేనే మిమ్మల్ని ప్రశ్నిస్తున్నా. మీ నాయకుడు జగన్ గిరిజన అభివృద్ధికి ఏమి చేశారు.? మీ హక్కులను ఏమి కాపాడాడో చెప్పండి"...అంటూ వైసీపీ నేతలకు సీఎం చంద్రబాబు సవాల్ విసిరారు. ఏజెన్సీలో తన పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించినవారు తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ దిశ, దశ మార్చడానికే తాను పాడేరు పర్యటనకు వచ్చానన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి పనులు చేసిన చోటే కూటమి అభ్యర్థులను గిరిజనులు మొన్నటి ఎన్నికల్లో గెలిపించలేదని, ఇలా ఎందుకు చేశారని తానే తిరిగి ప్రశ్నిస్తున్నానని, సమాధానం చెప్పాలని చంద్రబాబు నిలదీశారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చి రాఖీ కట్టిన మహిళలతో మంత్రి లోకేశ్

మంగళగిరి ఆడబిడ్డలకు రుణపడి ఉంటా

ఇప్పటికి 3 వేల మందికి పట్టాలిచ్చాం

- రాష్ట్రంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దుతా: లోకేశ్
- రాఖీలు కట్టడానికి భారీగా తరలివచ్చిన స్థానిక మహిళలు

అమరావతి, మంగళగిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): 'నాకు అక్కలు, చెల్లెళ్లు లేరు. మంగళగిరి మహిళలే నా అక్కాచెల్లెళ్లు. ఈ రోజు మీరంతా రాఖీ కట్టి అందించిన ఆశీస్సులు కొండంత బలాన్ని ఇచ్చాయి. మీ ఆశీస్సులతో మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గానికి చెందిన మహిళలు శనివారం ఉండవల్లి నివాసానికి వచ్చి మంత్రి లోకేశ్‌కు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు అందించారు. మంత్రి మాట్లాడుతూ... 'గత ఏడాది ఎన్నికల్లో మంగళగిరి నుంచే రాష్ట్రంలోనే 3వ అతి పెద్ద మెజారిటీతో గెలిపించి విమర్శించిన వారి నోళ్లు మూయించారు. తొలి ఏడాదిలోనే సుమారు 3 వేల మందికిపైగా పట్టాలు ఇచ్చి రూ.వెయ్యి కోట్ల విలువైన ఆస్తిని పంపిణీ చేసి మాట నిలబెట్టుకున్నా. నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాను. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

సీఎంకు రాఖీలు కట్టిన టీడీపీ మహిళా నేతలు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అమరావతి సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుకి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత రాఖీలు కట్టారు.

రాఖీ.. భావోద్వేగాలకు సంకేతం: పవన్ కల్యాణ్

అక్కా చెల్లెళ్లకు, అన్నదమ్ములకు మధ్య ఉన్న అనుబంధాన్ని చూపే వేడుక రాఖీ పౌర్ణమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'రాఖీ అంటే కేవలం ఓ దారం కాదు. అది మన అనుబంధాలకు భావోద్వేగాల సంకేతం.' అని అన్నారు. కాగా, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలని, అడవి బిడ్డలకు సకల సౌకర్యాలు అందాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

అరకు కాఫీ బ్రాండింగ్‌కు టాటా సంస్థ

కాఫీ ప్లాంటేషన్ కోసం ఐటీసీ

21 సంస్థలతో కుదిరిన ఎంవోయూలు

పాడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో 21 సంస్థలు శనివారం పాడేరులో ఒప్పందాలు చేసుకున్నాయి. ఆదివాసీల జీవనోపాధి, వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక కేంద్రంగా ఏజెన్సీ అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. రంపచోడవరం ఐటీడీఏ ప్రాంతంలో రబ్బర్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్రీయ రబ్బర్ బోర్డు, జీసీసీ ఉత్పత్తులను అమెరికా వంటి దేశాల్లో విక్రయించేందుకు హాతీ సర్వీసెస్ ఒప్పందం చేసుకున్నాయి. అరకు ఆర్గానిక్ కాఫీని బ్రాండింగ్ చేసేందుకు దిగ్గజం సంస్థ టాటా సంస్థ ముందుకువచ్చింది. చింతపల్లి వద్ద కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సబ్ కో సంస్థ సిద్ధమైంది. అదనంగా 1,600 హెక్టార్ల కాఫీ ప్లాంటేషన్ కోసం ఐటీసీ సంస్థ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం చేసుకుంది. గిరిజన ప్రాంతంలోని మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను వివిధ ప్రాంతాల్లో మార్కెటింగ్ చేసేలా ఈజీ మార్ట్, పసుపు వివిధ ఉత్పత్తుల మార్కెటింగ్ చేసేందుకు ఎక్విప్ సంస్థ ఐటీడీఏతో ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం హోమ్‌స్టేలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఓయో హోమ్స్, హోమీ హట్స్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేలా మార్పు సొసైటీ ఒప్పందం చేసుకుంది. గిరిజన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పర్యాటకశాఖ ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.నాయక్, కమిషనర్ సదా భార్గవి, కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



జీసీసీ ఉత్పత్తుల రిటైల్ మార్కెటింగ్‌కు ట్రైఫెడ్‌తో ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

చెప్పు తెగేవరకూ కొడతా

- కృష్ణా జలాల సరఫరాపై పోస్టులు పెట్టినవారిపై ఆగ్రహం
- ఆదివాసీ దినోత్సవంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వివాదాస్పద వ్యాఖ్యలు

ఎ.కొండూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శనివారం ఎ.కొండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలంలోని కిడ్నీ ప్రభావిత గ్రామాలకు కృష్ణా జలాలు సరఫరా చేయడంలేదంటే చెప్పు తెగే వరకు కొడతా. నీటి సరఫరా ఒక యాప్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుంది. నీటి సరఫరా జరగడంలేదనే వారిని చెప్పు తెగే వరకు కొడతా అన్నారు. గిరిజనుల కోసం కేటాయించిన 320 వ్యక్తిగత మరుగు దొడ్లు కట్టకుండా, కట్టించినట్టు పేర్కొని బిల్లులు తీసుకొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే మీ పేరుతో దోపిడి చేస్తున్న వారి పక్కన తిరగడానికి మీకు (గిరిజనులకు) సిగ్గు ఉండాలి' అని ఎమ్మెల్యే అన్నారు.

ఎమ్మెల్యే తన వైఖరి మార్చుకోవాలి: సీపీఎం

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు 'చెప్పు తెగేవరకూ కొడతా' అని మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని సీపీఎం మండలి కార్యదర్శి పానెం ఆనందరావు అన్నారు. చీమలపాడులో ఆయన మాట్లాడారు. 'ఈ నెల 6న సీపీఎం గిరిజన తండాల్లో పర్యటించింది. ఆ సందర్భంగా అక్కడ ప్రజలు వారం రోజులుగా నీరు రావడం లేదని చెప్పారు. ఈ విషయాన్ని 7న అధికార్ల దృష్టికి తీసుకొని వెళ్లాం. ఇబ్రహీంపట్నం సంపు వద్ద నుంచి కుదపకు నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. సమస్యను పూర్తిగా తెలుసుకోకుండా ఎమ్మెల్యే విచక్షణ కోల్పోయి మాట్లాడటం తగదు. గతంలో కూడ ఆయన అనేకసార్లు దురుసు ప్రవర్తన, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైన ఎమ్మెల్యే తన వైఖరిని మార్చుకోవాలి' అని ఆనందరావు అన్నారు.

దేశంలో దొంగ ఓట్ల పాలన: రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దేశంలో దొంగ ఓట్ల పాలన జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శనివారం కర్నూలులో జరిగిన జిల్లా సీపీఐ 24వ మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా దొంగ ఓట్లు వేయిస్తున్నారు. ఎక్కడో కాదు సాక్షాత్తూ బెంగుళూరు పార్లమెంటు పరిధిలోని ఒక నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండే ప్రాంతంలో 1,02,550 దొంగ ఓట్లు వేయించి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకున్నారు. బిహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించారన్నారు. బీజేపీకి రాని ఓట్లన్నీ తొలగిస్తున్నారని ఆరోపించారు. దేశం పక్కా దొంగల రాజ్యంగా తయారైందన్నారు. ఈ నిజాలన్నీ కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ బయటపెట్టారన్నారు. అయితే ఎన్నికల కమిషన్ సిగ్గులేకుండా రాహుల్‌గాంధీ స్వయంగా వచ్చి ఫిర్యాదు చేయలేదని చెప్పడం దుర్మార్గమన్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్.శేషన్ లాంటి అధికారులు రావాలన్నారు. బీజేపీ నాయకులతో ఎన్నికల అధికారులు లాలూచి పడుతున్నారన్నారు.



నగరంలోని ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐ మురళీకి రాఖీ కడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఆటో డ్రైవర్, పోలీసులకు రాఖీ కట్టిన మంత్రి అనిత

ఎంవీపీ కాలనీ(విశాఖపట్నం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ సందర్భంగా పలువురికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాఖీ కట్టారు. ఎంవీపీ కాలనీ నుంచి ఉషోదయ కూడలి వరకూ ఆటోలో ప్రయాణించి, ఆటో డ్రైవర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్ గిరీశ్‌కు రాఖీ కట్టారు. అనారోగ్యానికి గురైన ఉషోదయ కూడలి సమీపంలో ఉంటున్న కానిస్టేబుల్ కొర్లయ్యను పరామర్శించారు. అతడికి ధైర్యం చెప్పి రాఖీ కట్టారు. ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐ జె.మురళీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, విధి నిర్వహణలో ఉన్న కొందరు పోలీసులకు అనిత రాఖీ కట్టారు.

వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ: ఎమ్మెల్యే బూర్ల

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా దళితుల పట్ల వారి ధోరణి మారలేదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను చులకనగా చూస్తూ వారి ప్రాణాలను లెక్క చేయని నిరంకుశత్వం వైసీపీ నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇటీవల తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు పవన్ అనే దళిత యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా, దాడి వీడియో తీసి పవన్ తండ్రికి పంపించి పైశాచిక ఆనందం పొందడం అమానుషమన్నారు. వైసీపీ నాయకులు తమ చర్యల ద్వారా తాము, తమ పార్టీ దళిత వ్యతిరేకమని నిరూపించుకున్నారని విమర్శించారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట

- ఏడాదిలో అద్భుతాలు సాధించామని చెప్పడం లేదు
- కానీ... గత పాలకులకన్నా మెరుగ్గా చేస్తున్నాం: మంత్రి డోలా

తిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఎప్పుడూలేని విధంగా రూ.310 కోట్ల నిధులు కేటాయించాయ. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.100 కోట్లతో నూతన హాస్టళ్ల నిర్మాణం, రూ.58 కోట్లతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాం. మరో రూ.143 కోట్లు హాస్టళ్లు, స్కూళ్ల మరమ్మతులకు జారీ అయ్యాయి. గతంలో ఇంత పెద్ద మొత్తంలో ఎవరూ నిధులు కేటాయించలేదు. గడిచిన ఏడాదిలో అద్భుతాలు సాధించామని చెప్పడం లేదు కానీ... గత పాలకులకంటే మెరుగ్గా పనిచేస్తున్నాం. నాణ్యమైన బియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నాం. పీ 4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అభివృద్ధి, సంక్షేమం అమలు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులూ ఉండకూడదని స్వామిని కోరుకున్నా' అని మంత్రి డోలా చెప్పారు.

అటెన్షన్: చంద్రబాబు!

నిబంధనల చట్రంలో 'రాజధాని ప్లాట్లు'



(మొదటి పేజీ తరువాయి)

అప్పగించారు. "ఇక్కడ రాజధాని వస్తుంది. మీరు ఇచ్చిన భూములకు ప్రతిగా అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తాం. వాటిని విక్రయించుకుంటే చాలా డబ్బులొస్తాయ్"... అని అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం చెప్పిన మాటలను నమ్మి భూములు అప్పగించారు. సగటున ఎకరం ఇచ్చిన రైతుకు రిటర్నబుల్ ప్లాటుగా 1000 గజాల భూమిని నివాసం కోసం కేటాయించారు. మరో 200-300 గజాల వరకు 'కమర్షియల్' ప్లాటు ఇచ్చారు. రెసిడెన్షియల్ కింద 250 గజాలు, 500 గజాలు, 700 గజాలు, 1000 గజాలు... ఇంకా ఆపైన విస్తీర్ణమున్న ప్లాట్లను ఎంచుకునే అవకాశం కల్పించారు. తాము ఇచ్చిన భూమికి బదులుగా ఇస్తున్న విస్తీర్ణానికి తగినట్లుగా ఆయా ప్లాట్లను రైతులు ఎంచుకోవచ్చు. ఉదాహరణకు... ఒక రైతుకు వెయ్యిగజాల రిటర్నబుల్ ప్లాటు వస్తే... 250 గజాల ప్లాట్లు రెండు, 500 గజాల్లో ఒకటీ ఎంచుకోవచ్చు. లేదా... నాలుగు 250 గజాల ప్లాట్లు తీసుకోవచ్చు. రాజధాని వస్తోందన్న ఆనందంలో ఉన్న చాలామంది రైతులకు ఈ ఆప్షన్లు అర్థం కాలేదు. 'సింగిల్ బిట్... పెద్దగా ఉంటే సూపర్ కదా' అని భావించి... వెయ్యి గజాలు, రెండువేల గజాల ప్లాట్లకు ఆప్షన్ పెట్టుకున్నారు. రాజధాని పనులయ్యాక సొంతానికి కొంత ఉంచుకొని, మిగతాది విభజించి (స్ప్లిట్) అమ్ముకోవచ్చని భావించారు. ప్లాట్లు తీసుకుంటూ అధికారులు ఇచ్చిన భారీ పుస్తకాల్లాంటి డాక్యుమెంట్లలో సంతకాలు పెట్టేశారు. ఆ రోజున్న పరిస్థితి అలాంటిది!

అదేం కుదరదు...

ఇటీవల తుళ్లూరుకు చెందిన నారాయణ స్వామి అనే రైతు సీఆర్‌డీఏ ఆఫీసుకు వెళ్లారు. తనకిచ్చిన 1000 గజాల ప్లాటును, మరో 700 గజాల ప్లాటును విభజించాలని కోరారు. "అలా కుదరదండీ! ప్లాటును విభజించలేం. మీరు పెట్టిన ఆప్షన్ ప్రకారం ప్లాటు ఇచ్చాం. దానిని అలాగే ఉంచాలి" అని అధికారి స్పష్టం చేశారు. "అదేంటీ... మా ప్లాటు... మా ఇష్టం కాదా!" అని ఆ రైతు అడగ్గా... అధికారి ఆయన చేతిలో ఓ పత్రం పెట్టి చదువుకోమన్నారు. 'ఆంధ్రప్రదేశ్ భూ సమీకరణ పథకము-రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు విధానం' అనే ట్యాగ్‌తో ఉన్న ఆ పత్రంలో 9వ పేజీలోని 3వ అంశాన్ని ప్రకారం... "ఒకసారి కేటాయించిన ప్లాటును తర్వాత విభజించుకోవచ్చా? ఆ సందర్భంగా ఎటువంటి నిబంధనలు వర్తిసాయి? అన్న ప్రశ్నకు సమాధానంగా... రాజధాని నగర అందాన్ని, మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని 9.18 నమూనాలో కోరుకున్న తర్వాత ఆ ప్లాట్ల విభజనకు అంగీకరించబడదు" అని అందులో స్పష్టంగా ఉంది. దీంతో ఆ రైతు దిగ్భ్రాంతికి గురయ్యారు. అప్పటికే ఆ ఆఫీసు వద్ద ఇలాంటి సమస్యనెదుర్కొంటున్న రైతులు మరో పాతికమందిపైనే ఉన్నారు. అంతా కలిసి ఆ అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజధానికి భూములు ఇచ్చిన రైతులుగా మేం ఎలాంటి కండీషన్లు పెట్టలేదు. మాకిచ్చిన భూములను ఎలా వాడుకోవాలో మీరు కండీషన్లు పెట్టడం ఏమిటి? ఇదెక్కడి న్యాయం?" అని నిలదీశారు. దీంతో అధికారి ఆఫీసు లోపలికి వెళ్లి 2019కు ముందు ఆయా షరతులకు ఒప్పుకొనే ప్లాట్లు తీసుకున్నారంటూ... పత్రాలపై పెట్టిన సంతకాలు చూపించారు. ఇలాంటి షరతులు తమకు అప్పట్లో అర్థంకాలేదని, రాజధాని వస్తుందన్న సంతోషంలో అధికారులు కోరిన చోటల్లా సంతకాలు చేశామని, ఈ రూల్ తీసెయ్యాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఆచరణాత్మకమేనా...

రాయపూడికి చెందిన ఒక రైతుకు తాను ఇచ్చిన భూమికి బదులుగా 5వేల గజాల విస్తీర్ణంలో రిటర్నబుల్ ప్లాట్లు తీసుకునే అవకాశం వచ్చింది. అయితే... ఆయన కూడా అప్పట్లో 'అమాయకంగా' ఆలోచించి... సింగిల్ బిట్ పెద్దగా ఉంటే బాగుంటుందని 2500 గజాలున్న రెండు ప్లాట్లు ఎంచుకున్నారు. ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే... పీకల్లోతు అవసరాలున్నా ఆ ప్లాట్లను అమ్ముకోలేక పోతున్నారు. 2500 గజాల ప్లాటును ముక్కలు చేయడానికి వీల్లేదు. ఒక్కరికే అమ్మాలి. అంటే... దాని విలువ ఇప్పుడున్న ధర కనీసం రూ.10 కోట్లు! అంత పెద్ద స్థాయి 'బయ్యర్' ఎక్కడ దొరకాలి? 500 గజాలు, ఆ పైన విస్తీర్ణమున్న రిటర్నబుల్ ప్లాట్లు ఎంచుకున్న అనేక మంది రైతులు ఎదుర్కొంటున్న సమస్య ఇది! పేరుకే ఆ ప్లాట్లకు విలువ! కానీ... కొనేవారు దొరకడం లేదు. విభజించి విక్రయిద్దామంటే... 'నిబంధనలు' ఒప్పుకోవడంలేదు.

వారసులకూ పంచలేరు

రిటర్నబుల్ ప్లాట్లలో కొంత విభజించి... విక్రయించి ఆర్థిక అవసరాలు తీర్చుకోవాలని చాలా మంది రైతులు భావిస్తున్నారు. మరికొందరు... తమ వారసులకు పంపకాలు చేయాలనుకుంటున్నారు. కానీ... 'ఆంధ్రప్రదేశ్ భూ సమీకరణ పథకము-రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు విధానం' అందుకు వీల్లేకుండా చేస్తోంది. అవసరాలకు ఆదుకోని ఆస్తి ఎందుకన్నట్లుగా పరిస్థితి తయారైంది. అమరావతి పరిధిలో ఇప్పుడున్న ధరల ప్రకారం... వెయ్యి, రెండువేల గజాలు కొని ఇల్లు కట్టుకోవాలంటే అంబానీ, అదానీలాంటి బడా బాబులకే సాధ్యం. ఇది అయ్యేపనేనా?

అప్పుడు లేని చర్చ

రాజధానికి రైతులు భూములు ఇచ్చేటప్పుడు అందం, సింగపూర్‌స్థాయి అనే చర్చ రాలేదు. ఆ పేరిట భూ సేకరణ చేయలేదు. రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోరే రాజధాని నిర్మాణం అని నాటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు ప్రచారం చేశారు. అయినా కూడా తొలుత రైతులంతా ఒప్పుకోలేదు. దీంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి రైతులతో సంప్రదింపులు జరిపారు. రైతులు కోరుకున్న చోటే రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని, వారి సంతృప్తే తమకు కీలకం అని ప్రభుత్వ పెద్దలు ఊరూరా తిరిగి ప్రచారం చేశారు. అదే సమయంలో అధికారులు... 'రాజధాని అందం' పేరుతో ప్లాట్ల విభజనకు అడ్డుకట్ట వేశారు.

బాబు పరిష్కరించాలి

అమరావతి రాజధాని నగరం రైతుల త్యాగాల పునాదులపై నిర్మితమవుతోంది. అదే రైతులను కష్టపెట్టి, వారి సమస్యలను పెంచి కేవలం అందమైన ప్లాన్ అంటూ పరుగులు తీస్తే సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని... ప్లాట్ల విభజనకు అవకాశం ఇచ్చేలా చట్టాలు, నిబంధనలను మార్చాలని రైతులు కోరుతున్నారు.



సింగపూర్ సరే...

రాజధాని మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా రూపొందించి ఇచ్చింది. 'రాజధాని ప్రాంతం అందంగా, ప్రణాళికాబద్ధంగా ఉండాలి' అనేదే సింగపూర్ ప్రభుత్వ కాన్సెప్ట్! ఈ నేపథ్యంలోనే అధికారులు రిటర్నబుల్ ప్లాట్ల విభజనకు వీల్లేకుండా నిబంధనలు విధించారు. ఇప్పుడు అదే పెద్ద సమస్యలాగా మారింది. సింగపూర్ ప్రమాణాలు, పరిస్థితులు వేరు. మన పరిస్థితులు వేరు. ప్రభుత్వ భవనాలు, ఆఫీసులను అందంగా నిర్మించుకోవచ్చు. కానీ... రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల విభజనపై ఆంక్షలు విధించడమేమిటి? అందులో హేతుబద్ధత ఎక్కడుంది? మరీ అగ్గిపెట్టెల్లాంటి నివాసాలు ఉండకూడదంటే అర్థముంది. అందుకోసం... ఒక ప్లాటు కనీసం 250 గజాలకు తగ్గొద్దనీ చెప్పొచ్చు. కానీ... వెయ్యి, రెండువేలు, రెండున్నరవేల గజాలు... ఇలా మొదట్లో ఆప్షన్ పెట్టి తీసుకున్న ప్లాటు విభజన కుదరదనడమే అసలు సమస్య!

అణా.. కాణీ.. కహానీ!

- గతంలో దమ్మిడీలు, గవ్వలూ డబ్బే
- ఇంకా కాణీలు, బేడాలు, అణాలు..
- కొన్ని వ్యవహారిక పదాలు వీటిలోంచే
- ప్రస్తుతం వాడుకలో లేని నాణేలు ఎన్నో?

(ద్వారకాతిరుమల-ఆంధ్రజ్యోతి)

క్షణం తీరిక లేదు.. 'దమ్మిడీ' ఆదాయం లేదు! వీడు 'దమ్మిడీ'కి కొరగాడు! చేతిలో చిల్లి 'గవ్వ' లేదు! ఆమె పదహారు 'అణాల' ఆడపిల్ల! ఇలాంటి వ్యాఖ్యలను వ్యవహారికంగా వింటుంటాం. వినడం మినహా ఆ దమ్మిడీలు, గవ్వలు, అణాలు ఏమిటో? ఎలా ఉంటాయో? చాలా మందికి తెలియదు. ప్రస్తుతం మన దేశంలో చలామణి అవుతున్న అతి తక్కువ విలువ ఉన్న నాణెం రూపాయి. కొన్నేళ్ల వెనక్కి వెళ్తే... అర్థ రూపాయి(50 పైసలు), పావలా(25పైసలు) నాణేలు వాడుకలో ఉండేవి. ఇంకా వెనక్కి వెళ్తే ముందు తరంలో.. 20, 10, 5 పైసలతో పాటు 2, 1 పైసల నాణేలు కూడా చలామణి అయ్యేవి. ప్రస్తుతమున్న 50-60 ఏళ్ల వయసు వారిలో గుర్తున్న నాణేలు బహుశా ఇవే అయి ఉంటాయి. మరి... అంతకుపూర్వం ఏ నాణేలు వాడుకలో ఉండేవి? అవి ఎన్ని కలిస్తే ఒక్క రూపాయి అవుతుందో మీకు తెలుసా? మనం వినే కొన్ని సామెతలు, వాడుక పదాలు వాటి నుంచే పుట్టాయి. ఒకప్పుడు వాడుకలో ఉన్న దమ్మిడీలు, గవ్వలు, అణాలు తదితర నాణేల గురించి తెలుసుకుందాం.



గవ్వలు

గవ్వలు ఇప్పటికీ ఉన్నాయి కానీ డబ్బుల రూపంలో వాడటం లేదు. దీని విలువ కూడా చాలా తక్కువ. అందుకేనేమో డబ్బులు లేకపోతే... చేతిలో చిల్లిగవ్వ లేదు అని అంటుంటారు. అప్పట్లో 768 గవ్వలు కలిస్తే రూపాయి అన్నమాట.



ఒకప్పుడు గవ్వలూ కరెన్సీయే



అణా

అణా.. బ్రిటిష్ పాలనలోని మారక ద్రవ్య ప్రమాణం. ఒక రూపాయికి 16 అణాలు, ఒక అణాకు ఆరు పైసలు ఉండేవి. ఈ పద్ధతి స్వరాజ్యం వచ్చాక కూడా కొనసాగింది. 1957లో దశాంక విధానం అమలులోకి వచ్చాక రూపాయికి 100 నయాపైసలుగా నిర్ణయించారు. 1964లో నయాపైసాను పైసాగా పేరు మార్చారు.

క్లుప్తంగా..

- పూర్వకాలంలో ఒక రూపాయికి 768 గవ్వలు, 384 రోలీలు, 192 దమ్మిడీలు, 128 ఏగాణీలు, 64 కాణీలు, 32 అర్ధ అణాలు, 16 అణాలు, 8 బేడాలుగా చలామణి అయ్యాయి.
- 20 పైసల నాణేలను 1968లో ముద్రించారు. 1970లో 1, 2, 3 పైసల నాణేలను క్రమంగా తొలగించారు. 1982లో రెండు రూపాయల నోట్ల స్థానంలో కొత్త రెండు రూపాయల నాణెం అందుబాటులోకి వచ్చింది. 2011 జూన్ 30న 25 పైసలు అంతకంటే తక్కువ విలువ కలిగిన నాణేలను రద్దు చేశారు.

దమ్మిడి

బ్రిటిష్ కాలంలో దీన్ని వాడేవారు. గతంలో మనదేశంలో ఇంగ్లిష్‌లో దీన్ని 'పై' అనేవారట. దీని విలువ చాలా తక్కువగా ఉన్నందుకు.. 'దమ్మిడీకి పనికి రాడు', 'నా దగ్గర దమ్మిడీ కూడా లేదు' వంటి పదాలు పుట్టుకొచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దశాబ్దకాలం వరకూ భారతీయ ద్రవ్య విధానం రూపాయికి 16 అణాల పద్ధతిలో ఉండేది. అంటే... అర్థ రూపాయికి ఎనిమిది అణాలు, పావలాకు నాలుగు అణాలు అన్నమాట. ఇక ఒక అణా.. రెండు పరకలు, నాలుగు కాణీలతో సమానం. అప్పట్లో ఒక పైసా అనేది ఇప్పటి 1.562 నయాపైసలతో సమానమట. అణాలో 12వ వంతు భాగాన్ని దమ్మిడి అనేవారు. అంటే సుమారుగా 192 దమ్మిడీలు కలిస్తే ఒక రూపాయి. అప్పట్లో వంద రూపాయలు అంటే.. చాలా పెద్ద మొత్తం అన్నమాట.



పురాతన దమ్మిడీలు

ఐదుగురు తమిళుల విచారణ

- ధర్మస్థలలో కొనసాగుతున్న తవ్వకాలు
- రహస్యంగా మృతదేహాలు పూడ్చడం చూశాం
- సిట్ అధికారుల వద్దకు ఇద్దరు వ్యక్తులు

బెంగళూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల వివాదంలో రోజుకో కొత్త అంశం తెరపైకి వస్తోంది. గతంలో ధర్మస్థలలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసిన ఐదుగురు తమిళనాడు వాసులను సిట్ అధికారులు విచారించారు. వీరు 1995 నుంచి 2014 మధ్య అక్కడ పనిచేశారు. ధర్మస్థల ప్రాంతంలో మృతదేహాలను పాతిపెట్టినట్లు ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా సిట్ అధికారులు ఈ ఐదుగురిని తమిళనాడు నుంచి రప్పించారు. మరోవైపు శనివారం తవ్వకాల ప్రక్రియ కొనసాగింది. ఇప్పటివరకు ఫిర్యాదుదారుడు చూపిన 13 ప్రదేశాల్లో 12 చోట్ల తవ్వకాలు ముగిశాయి. ఇవి కాకుండా 14, 15, 16వ పాయింట్లలోనూ తవ్వకాలు జరిగాయి. ఇప్పటివరకూ నేత్రావతి నది ఒడ్డున, ఓ గుట్టపైన తవ్వకాలు కొనసాగాయి. ఫిర్యాదుదారుడు వాటన్నింటికీ భిన్నంగా ధర్మస్థలకు వెళ్లే రత్నగిరి కొండలలో 16వ ప్రదేశాన్ని చూపించారు. అక్కడ ఐదు అడుగుల లోతు, ఐదు అడుగుల వెడల్పుతో తవ్వకాలు జరిపారు. ఆ ప్రాంతంలో కొత్తగా మట్టి వేసినందున మరో 2-3 అడుగులు తవ్వాలని ఫిర్యాదుదారుడు సిట్ అధికారులను కోరారు. రోడ్డు మలుపుతో పాటు ఓ చెట్టును గుర్తు పెట్టుకుని 16వ పాయింట్‌ను చూపించారు. కాగా, మృతదేహాలను రహస్యంగా పూడ్చడాన్ని తాము చూశామంటూ ఇద్దరు వ్యక్తులు సిట్ అధికారులను కలిశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలపాలని వారికి సిట్ సూచించింది. దీంతో వారు ధర్మస్థల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వారి సాక్ష్యాన్ని సిట్ పరిగణనలోకి తీసుకోనుంది.

పుస్తకాలు చూసి సర్జరీలు చేయొద్దు!

పూర్తి అనుభవం వచ్చాకే చేయాలి

- లేకపోతే పేషంట్లకు ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా సమస్యలు
- ఇతర ఆపరేషన్లకు సౌందర్య శస్త్రచికిత్సలకు తేడా ఉంది
- అందాన్ని మెరుగుపర్చాలేగానీ చెడగొట్టొద్దు
- ప్లాస్టిక్ సర్జన్లకు డాక్టర్ సంజయ్ పరాశర్ హితవు
- హైదరాబాద్‌లో 'సేఫ్ ప్లాస్ట్-2025' సదస్సు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చూసి శస్త్రచికిత్సలు చేయవద్దని, పూర్తిస్థాయిలో అనుభవం వచ్చిన తర్వాతే చేయాలని ప్లాస్టిక్ సర్జన్లకు దుబాయికి చెందిన సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంజయ్ పరాశర్ పిలుపునిచ్చారు. 'మిగిలిన విభాగాలలో చేసే చికిత్సలు వేరు. ప్లాస్టిక్ సర్జన్లు, డెర్మటాలజిస్టులు చేసే చికిత్సలు వేరు. కాస్త అందంగా కనపడాలని, ఉన్న లోపాన్ని సరిచేయించుకోవాలని వచ్చేవాళ్లకు మనం పూర్తి సంతృప్తి ఇవ్వగలగాలి. అంతే తప్ప ఉన్నదాన్ని మరింత చెడగొడితే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. చికిత్స తర్వాత ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అవి రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా లైపోసక్షన్, కాస్మెటిక్ శస్త్రచికిత్సలు, ముక్కు, గడ్డం, బుగ్గలు వంటివి సరిచేయించుకునే చికిత్సలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటివి చాలా సున్నితమైనవి. వీటి విషయంలో రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి' అని సూచించారు. హైటెక్ సిటీలోని టీ-హబ్ వేదికగా రెండురోజుల పాటు జరిగే 'సేఫ్ ప్లాస్ట్-2025 సదస్సు' శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ పరాశర్ ప్రసంగించారు. ప్లాస్టిక్, ఈస్థటిక్ సర్జరీలు చాలా సంక్లిష్టమైనవని, నూటికి నూరుశాతం కృషిచేసినా కూడా కొన్ని సందర్భాల్లో అనుకోని అవాంతరాలు ఎదురవుతాయన్నారు. సమగ్రమైన అనుభవం ఉంటేనే వాటిని అధిగమించగలమని, కేవలం పుస్తకజ్ఞానంతో సాధ్యం కాదని హితవు పలికారు. డాక్టర్ గురుకర్ణ వేముల మాట్లాడుతూ.. ఈ చికిత్సలు చేయించుకోవడానికి ముందు సరైన వైద్యులు, ఆస్పత్రుల గురించి పేషంట్లు సమాచారం సేకరించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. మెడికల్ కౌన్సిల్ లాంటివాటిలో నమోదయ్యారా అన్నది సరిచూసుకోవాలని సూచించారు. తగిన శిక్షణ లేని వాళ్లు చికిత్సలు చేయడం వల్ల పలురకాల సమస్యలు వస్తున్నాయన్నారు. సౌందర్య శస్త్రచికిత్సల గురించి మనదేశంలో వైద్యులకు ఇంకా శిక్షణ మెరుగుపడాలని, శిక్షణ కార్యక్రమాలు పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ సర్జరీ చేసేటప్పుడు అనుక్షణం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.



'సేఫ్ ప్లాస్ట్-2025 సదస్సు'లో పాల్గొన్న వైద్యులు

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.